శ్రీమతేరామానుజాయనమః

వరవరమునిహృదయము



మొవ్వ వేంకటదాసు గారిచే

రచియింపఁబడి

ప్రథమ ముద్రణ :

శారదా ముద్రాక్షరశాల, తెనాలి యందు - 1936 ముద్రింపఁబడియె

ద్వితీయ ముద్రణ :

శ్రీనివాస గ్రాఫిక్స్ & ఆఫ్‌సెట్ ప్రింటర్, రేపల్లె యందు - 2017

ముద్రింపఁబడియె

1000 ప్రతులు

వెల : రు. **50/-**

1

శ్రీరామ



పంచతనియలు

1. శ్రీశైలేశదయాపాత్రం ధీభక్త్యాదిగుణార్ణవం
యతీన్ద్రప్రవణంవన్దే రమ్య జామాతరంమునిమ్

2. లక్ష్మీనాథ సమారమ్భాం నాథయామునమధ్యమాం
అస్మదాచార్య పర్యన్తాం - వన్దే గురుపరంపరామ్.

3. యోనిత్యమచ్యుత పదామ్బుజయుగ్మరుక్మ
వ్యామోహితస్తదితరాణి తృణాయమేనే
అస్మద్గురోర్భగవతోఽస్యదయైకసిన్ధోః
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే

4. మాతాపితాయువతయస్తనయా విభూతిః
సర్వంయదేవనియమేనమదన్వయానాం
ఆద్యస్యఃనఃకులపతేర్వకుళాభిరామం
శ్రీమత్తదంఘ్రియుగళం - ప్రణమామి మూర్ధ్నా

5. భూతం సరశ్చమహదాహ్వయ భట్టనాథ
శ్రీభక్తిసారకుల శేఖరయోగివాహాన్
భక్తాఙ్ఘ్రి రేణు పరకాలయ తీన్ద్రమిశ్రాన్
శ్రీమత్పరాఙ్కుశమునింప్రణతోఽస్మినిత్యమ్.

> శ్రీమద్రామానుజ విరచిత శ్రీభాష్యంనుండి
> అఖిలభువనజన్మస్థేమ భఙ్గాదిలీలే
> వినత వివిధ భూతవ్రాతరక్షైకదీక్షే
> శ్రుతిశిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే
> భవతుమమ పరస్మిన్ శేముషీభక్తి రూపా.
> అవతారకాలము 1017-1137 సం॥

అభినవపంచతనియలు

1. గోవిందసుందర పదాంబుజమగ్నచిత్తో
మందాకినీతులిత మంజుళవాక్ప్రవృత్యా
లోకం సమస్తమకరోదవధూత పాపం
తంవేంకటాఖ్య గురుమాత్మ నిభావయామః

2. సంసార తాపానలదగ్ధభావా
స్సమాగతాయావవలోక్యసద్యః
భవంతి బోధామృతసేకహృష్టా
స్తామేగతిర్వేంకటదేశికాంఘ్రీ

3. నారాయణాంఘ్రి నవనీరజమత్తభృంగం
భక్తిప్రపత్తి సరసీచరరాజహంసమ్
పౌరాణికప్రథమముత్తమ తత్త్వబోధం
శ్రీశ్రీనివాస గురుపుంగవమాశ్రయేఽహమ్.

4. శ్రీమద్రామాయణామ్నాయ
స్వరూపాయ మహాత్మనే
రామ భక్తిప్రబోధాయ
కృష్ణదాసాయతే నమః

5. శ్రీరంగ రాజచరణాంబుజ మూలదాసం
శ్రీకాంచిపూర్వరదరాజ పదాబ్జ భృంగమ్
శ్రీవేంకటేశ పదకం జమరాళరాజం
శ్రీవిష్ణు దాసగురుపుంగవమానతోఽస్మి

విషయ సూచిక

ముద్రాపకులకు - కృతజ్ఞతలు

ఈ గ్రంధమును ఇంత సొంపుగా అచిరకాలములో ముద్రణ వేసియిచ్చిన రేపల్లె శ్రీనివాస గ్రాఫిక్స్ & ఆఫ్ సెట్ ప్రింటర్స్ యాజమాన్యం మునగాల సురేష్‌బాబు గారికి వారి సిబ్బందికి ముఖ్యముగా ఓర్పుతో నేర్పుతో డి.టి.పి. చేసి గ్రంధముద్రణకు కారణమైన దొక్కు రామకృష్ణ గారికి నా కృతజ్ఞతాభి వందనములతోడి మెచ్చుకోలు.

ఇట్లు
పద్యాల గోపీచంద్రస్వామి
విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు
నగరం కళాశాల.

శ్రీరామ

శ్రీమతే రామానుజాయనమః **శ్రీవేంకట గురుభ్యో నమః**

శ్రీనివాస గురుభ్యో నమః **శ్రీ విష్ణుదాస గురుభ్యో నమః**

గోవిందదాసు విన్నపము

అనంత కోటిబ్రహ్మాండ నాయకా, ఆదిమధ్యాంతరహితా, సృష్టి స్థితిలయ కారణా అశరణ్య శరణ్యా, ఆపన్నివారకా, అనాధరక్షకా, దీనజనావనా, దయాసింధూ, అశ్రితజన బంధు గోవింద, నిర్హేతుక జాయమాన కటాక్షా, పుండరీకాక్షా, శ్రీమన్నారాయణ, శ్రీ మొవ్వ వేంకటదాస పోషకా, శ్రీ సీతావల్లభా, లీలామానుష విగ్రహా, భక్తా భీష్ట వరదా, శ్రీ వేణు గోపాలాప్రణామములు

వేదనాభరితమైన హృదయముతో దుఃఖమును భరించలేక యీ రూపములో వెడల గ్రక్కుచున్నందులకు నన్నుకరుణించమని ప్రార్థించుచున్నాను. సహృదయులగు పాఠకులీయు పోద్ఘాతమును దయతో పూర్తిగా చదివిమన్నించవలెనని మనవి చేయుచున్నాను.

దేహినోస్మిన్ యధాదేహే; కౌమారం యౌవనంజరా
తథాదేహాంతర ప్రాప్తిః; ధీరస్తత్ర నముహ్యతి (2-13)
జాతస్యహి ధృవోమృత్యుః ధృవంజన్మమృతస్యచ
తస్మాదపరిహార్యేఽర్థే; నత్వంశోచితుమర్హసి (2-27)

అని పెద్దలు చెప్పవత్తు రేమో ధీరులుసోకించరు గాని నాలాంటి సామాన్యులు, అల్పులు శోకించకెట్లుందురు జరిగినవిషాదవృత్తాంతము స్మృతికి వచ్చునప్పుడెల్ల దుఃఖము పొర్లిరాకుండుట సాధ్యమా.

ఇరువురు కుమారులతరువాత పుత్రిక కొఱకు మ్రొక్కుబడులు చేయగా నీ అనుగ్రహమున జన్మించిన బిడ్డ కనులముందట్లగుటను నేనెట్లు సహింపజాలుదును.

ప్రాణికి శరీరము నందు బాల్యకౌమార యౌవన, ముసలితనములు, ఆపైన ముగింపుకలుగునంటి వేభగవద్గీతలో అట్లయిన దుఃఖ మేలకలుగును. ముప్పదిరెండు సంవత్సరములకు కుమార్తెను కనుమరుగు చేసిన

నీయనుగ్రహమును నేనేరీతి కొనియాడగలను. కాకచేయ గలగినది మాత్రమేమికలదు.

అనన్యాః చింతయంతోమాం యేజనాః పర్యుపాసతే
తేషాంనిత్యాభియుక్తానాం యోగక్షేమంవహామ్యహం (9-22)
అని సంతకము చేసితివికదా గీతలో
కౌంతేయ ప్రతి జానీహి; నమేభక్తః ప్రణశ్యతి.

నాభక్తుడెన్నడును నష్టమునకు గురికాడు అనుటను విశ్వసించి ఉద్యోగ విరమణ చేసిన దగ్గర నుండి నీ పాదసేవలో గడపి తరించలెనని తలంచి మెలగుచున్న నాకీ గర్భశోకమునొడ గూర్చితివి. యోగమన నేమో క్షేమమన నెట్టిదో నాకేమియును తెలియుట లేదుస్వామీ। శ్రీ వేణు గోపాల దేవా !

శ్రీ విష్ణు దాసస్వామి వారు తమతండ్రి గారి జీవిత చరిత్ర (తపోమహిమ)లో చెప్పిన మాటలు తలంచక ఉండలేకపోవుచున్నాను.

ఉత్పల :- **కూరుతు వొక్కగేహమున గొందఱు బంధులఁగాగ గూర్చివి**
స్తారపుబ్రేమ బెంతువు మిధః పరిపూర్ణముగాగ దానితో
వారటులుండ నొక్కరిని వ్రాల్చి యదృశ్యులజేసి తక్కువా
రాఱడి నేడ్చుచుండగని యాత్మగతంబున సంతసింతువే.

నేనుగాని, నాభార్యాబిడ్డలు, అల్లుడుగాని తెలిసితెలిసి యెవ్వరికైనను కించిత్తు ద్రోహముగాని, అపకారముగాని చేసినట్లు నీకు వర్తమాన మేమైనచేరి నదా. లేకమదోన్మత్తులమై నీ పాద భక్తిని తిరస్కరించి జూడలేమైన కల్గెనామమ్ముల నిట్లు శిక్షించుటు కోదయా మయా !

ఆమెకు పదునెనిమిది సంవత్సరముల ప్రాయము వచ్చువరకు చలాకీగా ఆటల యందు పాల్గొనజేసి బహుమతులగెలుచుకొనునట్లు చేసినావు. పిదప తీరని కొఱంతపెట్టిననుదానికి (కష్టభరితమైనను) పరిహారమార్గమును సూచించి జీవితమును సాగింపజేయుటయేకాక పుణ్యపురుషుని, సుగుణరాశిని, సద్గుణశీలుని మృదుస్వభావుని భార్యాభీష్టాను సారమునడచుకొనుభర్తను జీవిత సహచరునిగా కూర్చుటయే గాక అచిరకాలమున వారినోముల పంటగా ఒక బాబును అనుగ్రహించితివి

అట్లు అన్యోన్యముగా సాగుచున్న కాపురమునకు ఈహఠాత్పరిణామము కల్గింపయేల తలంపుకల్గెనో. భర్తీచేయ వీలుగాని కొరంతను కల్పించుటకు యేమి హేతువోమాబోంట్లేమిగ్రహింతురు. నీనిగ్రహమునకంతలోనే పాత్రభూతుల మైతిమా ! కరుణాలవాలా !

మండువేసగిలోన మరుదేశమందున్న; నీ పదాశ్రితులకు లోపమున్నె
ఘోరామయంబుల బారిలోపలబడ్డ; నీ పదాశ్రితులకులోపమున్నె
పటుసింహశార్దూల చటులాటవులనున్న; నీపదాశ్రితులకులోపమున్నె
అర్థరాత్రమున జోరాళిమధ్యకుజన్న; నీపదాశ్రితులకు లోపమున్నె
నీదుభక్తులకెట్లు ప్రమాదముండు; నఘవినాశనమఖిలలోకైక సుఖము
బహుళకల్యాణ పదము నీపాదసేవ; శ్రీశకేశవహరిహృషీకేశదేవ.

అని పెద్దలు వక్కాణించిన విషయమునందు పూర్తి విశ్వాసము తోడనే నేనుమెలంగుచుటిని. 'వనేరణే శత్రుజలాగ్ని మధ్యే ... రక్షంతి పుణ్యానిపురాకృతాని. అని చెప్పబడినట్లు పురాకృత పుణ్యమేలేదుగాబోలు.

సకృదేవప్రపన్నాయ తవాస్మీతిచయాచతే
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతంమమ. (రామా యుద్ధ కాం)
వ్యసనేషు మనుష్యాణాంభృశంభవతి దుఃఖితః
ఉత్సవేషుచ సర్వేషు పితేవ పరితుష్యతి. (రామా అయో కాం)
సర్వధర్మాన్ పరిత్యజ్య .... మాశుచః (భగవద్గీత)
నహికల్యాణకృత్ కశ్చిత్; దుర్గతింతాతగచ్ఛతి. „
సమోహం సర్వ భూతేషు నమేద్వేష్యోస్తిన ప్రియః
యేభజం తితుమాంభక్త్యామయితేతేషుచాప్యహం. (9-29)

అనుప్రమాణ వాక్యములకెట్లు అర్థములు కల్పించు కొనవలెనో తెలియక కొట్టు మిట్టాడుచున్న అజ్ఞడనోజగదీశా !

పెద్ద పెద్దవైద్యాలయములుగలవని హైదరాబాదు చేరగా అచట పదరానిపాట్లుపడజేసి, వైద్యుల నిర్లక్ష్యమునకు, ధనకాంక్షకు గురిజేసి, ఘోరవ్యధలపాలుజేసి కఠినకోతలకు శరీరము బలిజేసి చివరకు నీసన్నిధానమునకు చేర్చుకొంటివా దేవాతిదేవా !

ఆమె కొఱకై బంధుమిత్రపరివారమెల్ల నిద్రాహారములుమాని తమశక్తికిమించి శ్రమించిననుకించి త్ఫలము నీయక ప్రతి నిర్ణయమునందు సరియగు ఆలోచనతట్ట నీయకవ్యతిరేక ఫలమునొసంగి చివరకు తీరనిలోటును మిగిల్చితివే నిర్హేతుక కృపాజలధీ.

ఆర్తావిషణ్ణాః శిధిలాశ్చభీతాః; ఘోరేషుచ వ్యాధిషువర్తమానాః
సంకీర్త్యనారాయణ శబ్దమాత్రం; విముక్తదుఃఖాస్సుఖినోభవన్తి

అన్ననీ ప్రమాణమునందు పూర్తి విశ్వాసముతో కుటుంబసభ్యులు (ఆత్మీయులైనబంధువులు) పెదతల్లులు, పినతల్లులు, మేనత్తలు, మేనమామలు, పెదతండ్రులు, పినతండ్రులు, వృద్ధులైన తాతగార్లు, నాయనమ్మలు, అమ్మమ్మలు శ్రమలకోర్చి ఆమెనుగూర్చి నీకు ప్రపత్తి చేయుటజరిగెను కదా । ఆశించిన ఫలితమును పొందలేక పొయితిమి అంతకుమించిన పాపము శీఘ్రమేనేనను భవించవలసి యున్నదని తలంచుచుంటిని. "అత్యుత్క టైఃపుణ్య పాపైరిహైవఫలమశ్నుతే"

లోగడ ఇంటిలో ఉన్నప్పుడు ఎప్పుడైనా మాటల సందర్భమున లోక సాధారణ రీతిని గూర్చి నేను మాట్లాడ "ఎవరు ముందో ఎవరు వెనుకో ఎవరుచూచిరినాన్న గారు" అని ఆమె నోటి వెంటపలికింపజేసెడి నీ సర్వజ్ఞత్వమును గ్రహింపలేని నిర్భాగ్యుడనుగదా! హృషీకేశా ॥

భాగవతంలో పోతన గారు భక్తులవిషయంలో స్వామి దయను ఇట్లుకొనియాడినారు.

కలలో నందనుమున్నెఱుంగని మహాకష్టాత్ముడైనట్టిదు
ర్బలుడాపత్సమయంబునన్ నిజపదాబ్జాతంబులుల్లంబులో
దలపన్నంతనమెచ్చియార్తిహరుడై తన్నైననిచ్చున్ సుని
శ్చలభక్తిన్ భజియించు వారికిడడే సంపద్విశేషోన్నతుల్.

కుచేలోపాఖ్యానము లోవర్ణించబడిన యీపద్యమును పరిశీలింప కలలోనైనను స్వామిని భజింపని, తలవని పాతకుడను నేననితేలినదిగదా! జ్ఞానబలవీర్య ఐశ్వర్యతేజశ్శక్తులతోపాటు సత్యకామ సత్యసంకల్ప ఆశ్రితౌదార్యములు కలవాడవు. ఇంతయుచూడ ఇలవేల్పు శ్రీ వేణుగోపాలుని కృప యీ విషయమున లేనందున యిట్లయినదని తలంపదగును. అందులకు తగిన

పోలికను అజమహారాజు భార్య ఇందుమతీదేవి మరణ సందర్భమున మహాకవి కాళిదాసు గారిట్లు వర్ణించియున్నారు.

“కుసుమాన్యపిగాత్ర సంగమాత్ప్రభవంత్యాయురపోహి తుంయది
నభవిష్యతిహంత సాధనం కిమి వాన్యత్ప్రహరిష్యతో విధేః
ప్రగియంయది జీవితాపహాహృదయే కినింహితా నహంతిమాం
విషమప్యమృతంక్వ చిద్భవేదమృతం వా విషమీశ్వరేచ్ఛయా

(రఘువంశం 8 సర్గ)

ఒక వ్యక్తిని నశింపజేయదలచినదైవమునకు ఏ వస్తువు హింసాసాధనము కాదు. పుష్పములు కూడా మరణసాధనములు కావచ్చును. దైవ సంకల్పిముతో విషమమృతముకావచ్చును. దైవప్రాతికూల్యమున అమృతము కూడా విషమేయగును. విధిచండతరుడుగదా.

కాకున్న లోకమున ఎంత మందికి ఆపరేషన్లు జరుగుట లేదు. ఎంతెంత ప్రమాదస్థితికిగురైన వారు కోలుకొనుటలేదు, రెండు, మూడు హృదయకవాటములుదెబ్బతిని రక్తనాళములు మూసుకు పోయినవారు బాగుపడి బ్రతుకుట లేదు? నా బిడ్డ విషయమునయింత ప్రతి కూలతకు హేతువేమో అవగతమగుటలేదు.

ఆమె మేనమాలలో పెద్దవారగు శ్రీ మొవ్వ వృషాద్రిపతి గారు ఎన్ని పర్యాయములు రమ్మన్నను గుంటూరు చికిత్సాలయమునకు వచ్చి స్వస్థత కల్పించుటకు తీవ్ర కృషిసల్పిరి. మొదటి సారిస్వల్ప అస్వస్థత కలిగినప్పుడు (2001లో) చివరిసారి (2015లో) రెండు పర్యాయములు ఆమె మేనమామలు శ్రీ మొవ్వ సరోజనాభుడు గారు, శ్రీ మొవ్వ వేణుపాణి గారు బావ శ్రీ కలకొండ సత్యనారాయణ గారు ఆమె వెంటేయుండిరి. ఆమెఆరోగ్యమునకై అనల్పమైన కృషి సల్పియు దక్కించుకొనలేక పోయితిమని తీవ్రమనస్తాపము జెందినారు. అచట నివాసముంటున్న మేనమామలు శ్రీ మొవ్వ దేవనాథసూరి గారు, శ్రీ వంశీధరమూర్తి మేనమామ కుమారుడు తిరుమలరాజమణి, సోదరులు కాలారిరమానృసింహప్రసాదు గారు, శ్రీ రేవిణిశెట్టి శేఖరు గారు మేనమామ కుమార్తెలు, ఆమె అక్క, చెల్లెండ్రు హైదరాబాదు నివాసులు ఇతరబంధువర్గము అలమటించిహాస్పటలులో మూగిరి. మగవారలందరు

ఆమె కొఱకై హాస్పటలు చుట్టు తిరుగుచు డాక్టర్ల సలహా సంప్రదింపులతో మునిగియుండ నామేనకోడళ్ళు కుమార్తెలు వీరలకందరకు భోజనాది సదుపాయములు సమకూర్చుటలో పక్షముదినములు తలమున్కలై అల్లాడిరిగదా.

ఎవరికైనను ఆపద కల్గిన వారు, వారి కుటుంబసభ్యులు వేదన చెందుదురు దుఃఖింతురు. రాజీవకు అస్వస్థత కల్గిన దనగాయావత్కుటుంబ సభ్యులతో పాటు శ్రీ భాష్యకారసమాజ సభ్యులు పూడివాడ గ్రామమునందలి అశేషజనము అన్ని వర్ణముల వారు ఘోషించి యీ గండము కాచిగట్టెక్కించ మని నీకు మొరపెట్టిరే నా పాపమంతగా యున్నను “జనవాక్యంతుకర్తవ్యం” అని అందురు గదా పెద్దలు. వారినందరినైననూ పరిగణలోనికి తీసుకొని ఇంక కొంత కాలము నిలుపజాలకపోతివి. సముద్రముపై రాలుతేలించి మృతిచెందిన కోట్ల కొలది వానరులను బ్రతికించిన నీకదియసాధ్యమా? అమెనట్లేలయుంచితివని నిన్ను నిలదీయువారలెవరైన నుందురా? మాయామానుష విగ్రహా ! పరాత్పరా !

ఆలునుబిడ్డ లెల్లరును వారిచితిట్టి పెళార్చు చుండగానా
కేల చిరాయువిచ్చెనొకొ యీశ్వరుడంచును నేడ్చువాని
నెన్నా ఖలకైనజంపవు, జనంబికజూడకయున్ననోపగా
జాలమటన్నవాని నిముసంబును నుంచవిదేమిచేతరా.

(విష్ణుదాస స్వామి తండ్రి అస్తమయ సందర్భమున చెప్పిన యీ పద్యమక్ష రసత్యము)

పై రీతిలో వారలందరు అట్లేల అలమటించిరనవారలందరకు ఆమెపై గలవాత్సల్యము ఆబింబమునందున్న ఆకర్షణ. ఆమె యందున్న కలుపుగోలు తనము ఆహ్లాదము వారినట్లు త్రిప్ప ఆమె కొఱకై వారట్లు తపించిరి. దక్కించు కొనుటకై సర్వులును అట్లు తమశాయ శక్తుల కృషి చేసియుండిరి. కానీ ప్రయోజన శూన్యమై ఒక స్వప్న గాథగా, ఇంద్రజాలముగా మరుగుజేసితివి.

ఇంటికి ఆమెపార్థివ దేహముతో తిరిగిరాగా ఊరిలోనున్న ఆమె మేనమామలు శ్రీ మొవ్వవేంకట నగరాయలు గారు, శ్రీ రంగరాజ పెరుమాళ్ళు గారు, ఆమె పెదతండ్రి శ్రీతాడివాక వీరరాఘవయ్య గారు, పిన తండ్రులు శ్రీతన్నీరురాజ మిహిరాక్ష ప్రసాదు గారు, శ్రీ పద్యాల సింధుజేంద్ర ప్రసాదు,

శ్రీ పద్యాలదేవ రాజ పెరుమాళ్ళు గారు వారలసంతానములు అన్నలు–వదినలు తమ్ములు కుటుంబములలో నివారలందరూ దుఃఖ తీవ్రత ననుభవించుచునే వలయుకార్యములలో నన్నాదుకొనిరి. నాకు సానుభూతి తెల్పినన్ను ఓదార్చి సహకారమందించిన పెద్దలకు పిన్నలకు నేనేమి ప్రత్యుపకారముచేసి ఋణవిముక్తుడను కాగలను. నావలనఅయ్యె డిదేమి. అందించిన చేయూతకు చేసిన సహాయ సంపత్తులకు మారుగా గ్రంధముఖమున వారలందరకు కృతజ్ఞతాంజలులు గావించెదను. అంతకుమించినే నేమి చేయగలను.

లోకములో ఇట్టి స్థితులెవ్వరికి కల్గలేదా ! నీకొక్కనికే నా యీ కష్టము అని యనవత్తురేమో, ఒక మహా కవియనినట్లు "తనరుచి బ్రతుకులు తనవిగాన" నాబాధ నాదుఃఖము నాకు విదితము ఇతరులవి నాకెట్లును భూతము.

నాకు కల్గిన ఈ పుత్రికా దుఃఖమునకు సానుభూతి వ్యక్తము చేయుచు నన్నుప్రత్యక్షముగా పరోక్షముగా ఓదార్చిన వారనేకులు, మా పిన తండ్రి పెదతండ్రుల పుత్రులు వారికుటుంబ సభ్యులు, బంధవులు, స్నేహితులు ఇంకెందరో ఆత్మీయులు. ఈవిషాదమునకు కంటతడిపెట్ట నివారు లేరు చాలాకాలము వరకు నన్నుపల కరించెడి సాహసముచేయలేక (మాసిపోయిన గాయమును దుఃఖమును మరల రేపినట్ల గునని) నేరు గానాతో మాట్లాడలేక టీవిలో ఆమె ఫొటో చూచికలత చెందిన వారు నా సంబంధుల ద్వారా కూడా నాకు తమ ప్రగాఢ సంతాపసాను భూతులను తెలియపరచియుండిరి.

నాకన్నా తీవ్రమైన గర్భశోకమునను భవించి తట్టుకొనగలిగిన శ్రీమొవ్వరఘుశేఖరు గారు బావయ్యా రాజీవయోగ భ్రష్టురాలు. పవిత్రమైనమీ గర్భమున బిడ్డయైజన్మించి ప్రారబ్ధ కొఅత తీర్చుకొని త్వరితగతినితిరిగి వెళ్ళిపోయినది అట్టి వారెక్కువకాలము భువిపై నిలువరు. కావున దుఃఖము నుదిగ మ్రింగియూరట జెందుము' అని చిన్నవాడయినను చక్కని అనుభవముతోడి ఉపశమన వాక్యములు పలికినాడు.

ఇంకనూనన్ను విశేషముగా ప్రత్యక్షముగా పరోక్షముగా (చఌవాణిద్వారా) ఓ దార్చిన వారిలో మాతోడల్లుడు శ్రీమాన్ వక్కపట్ల

వృషాద్రిపతి గారు హృదయతాపము కొంత తగ్గునట్లుగా పూర్వరచనలు, గాథలు ఎన్నొ చెప్పిదుఃఖోపశమనము కలుగునట్లుగా చేసినారు. వారు చెప్పిన వాటిలో కొన్నింటినిచట పొందుపరచుట యావశ్యకమనితలంతును. భీష్ముడు ధర్మరాజును గూర్చిభాగవతములో

వాయువశంబులై యెగసివారిధరంబులు మింటగూడుచుం
బాయుచునుండు కైవడి బ్రపంచము సర్వము గాలతంత్రమై
పాయుచు గూడుచుండు నొక భంగి జరింపదు కాలమన్నియుం
జేయుచునుండు గాలము విచిత్రము దుస్తరమెట్టి వారికిన్

కాలము బహుచిత్రమైనది. అన్నింటికినీమూలము. ఎంతటి వారు కూడా కాలప్రవాహమును దాటలేరు.

రాజటధర్మజుండు సురరాజ సుతుండటధన్వి శాత్రవో
ద్వేజకమైన గాండివము విల్లట సారథి సర్వ భద్రసం
యోజకుడైన చక్రి యటయుగ్రగదాధరుడైన భీముడ
య్యాజి కిదోడు వచ్చునట యాపదగల్గుటి దేమిచోద్యమో

సాక్షాత్తు శ్రీకృష్ణుడు సర్వ రక్షకుడై వెంటనంటి యుండును త్రిలోక విజయదురం ధరులని ఖ్యాతి వహించినవారు. అట్టివారికే ఆపదలు తప్పలేదనుటాశ్చర్య కరమని శాంతనవుడు పేర్కొనినాడు.

కవిభట్టారక దాశరథీసూరిగురుదేవుల (బుఙ్జకథ నుండి) కౌంతేయారణ్య వాసఘట్టమున ధర్మజుడు గతము తలంచి దుఃఖ పడుతమ్ములతో

అన్నలార యిటులాడిన మాత్ర నెయాపద కడచనునా ?
మున్నొనరించిన కర్మతంత్రమునమునుగ వలయునరుడు !
కానరానివాడొకడం దరిపై కలడు పరాత్పరుడు !
వానియాజ్ఞజవదాట బ్రహ్మకును వశముగాదు సుమ్మా !
ఎన్నడొనర్చిన పాపఫలమొయి టులీనాటి కివచ్చె !
వెన్నునిదయ యికనెప్పుడుమనపై వెల్లివిరియగలదొ ?

విష్ణు దాసస్వామి 'కావ్యకళ' నుండి

చనినారెందఱొ మండలాధిపతులీ మాతెల్గు మాగాణిలో
జనినారెందఱొ సుందరాకృతుల హింసా సూత్రపారాయణుల్

గనినా రెండవతొమాతృదేవతలు రాకాచంద్రులంగాలమా

తినినావిందరబట్టి భూతదయలేదే నీకు నేనాడిలో

కాలమెట్టి వారినైనను మరుగున బడవేయును. కావున కాల ప్రభావమునకు తలవొగ్గక ఎవ్వరునూ నిలువలేరు. అని ఎన్నోరీతుల ఓదార్పు వాక్యములు పలుకుటయే గాక వేదనారూపనాయీ వ్రాతలోని స్ఖాలిత్యములు సవరించి నాకు సహాయపడిరి.

మాతల్లి గారు శ్రీమతి పద్యాల రామబాణమ్మ పినతల్లి శ్రీమతి తన్నీరు కమలాదేవి గార్లు కూడా దుఃఖోపశమన వాక్యములు పల్కుటయే గాక "దుఃఖనీరాజనము" అని ఆమెపై పద్యముల నల్లిరి. వీరలందరకు కృతఘ్నతాదోషమంటకుండుటకై అంజలిగాకయేమివ్వగలను.

రాజీవ వయసున చిన్నదయినను సంసారసాగరము తరింపవలెనని తపించుచు అట్టిస్థితికి తనకుతోచిన రీతిలో (విన్న-కన్నరీతిని) ప్రయత్నము చేయుచుండెడిది. బాల్యముననే తిరువాయిమొళి అర్థానుపూర్వముగా (వ్యాఖ్యాన సహితముగా) చదివినది. నిరంతరమునోములు, వ్రతములు సల్పుచు తీర్థయాత్రలు గావింపమనసుపడు చుండెడిది.

తిరుమల, భద్రాద్రి, వేదాద్రి శ్రీపూరీజగన్నాధము ఇలాంటి క్షేత్రము లేకాక ఒక సంవత్సరము క్రిందటనే తల్లిదండ్రులతో భర్త, బిడ్డ, అత్త, ఆడుబిడ్డతో కలసి పండరి యాత్ర చేసివచ్చినది. ఆయాత్రలో అంతదూరము ప్రయాణము చేసినను బడలిక, నీరసము ఎరుగక నియమ బద్ధ (అల్పమైన) ఆహారముతో హుషారుగా తిరిగిరాగలిగినది.

కార్తీక మాసము పూర్ణిమనాడు శ్రీ వేణుగోపాలుని దేవాలయమున దీపారాధన ఉత్సవవేడుకలో పాల్గొని హుషారుగా భజనచేసినది. పిదపతాతగారింటికి చేరుటతోడనే అస్వస్థతకు గురియైనది. ఆమరుసటి రోజు హైదరాబాదు ప్రయాణం. కార్తీక బహుళత్రయోదశి ది. 8-12-2015 న పరమపదనాధుని సాన్నిధ్యము చేరినది.

మా అల్లుడు (ఆమెభర్త డా॥ శివప్రసాదు) అది వరకు తనకున్న (భక్తి) పారాయణ విధానములను మార్చుకొని ఉద్యోగపు పనివత్తిడిలో నున్నను తీరిక కల్పించుకొని సంస్కృత రామాయణం పారాయణ శ్రద్ధగా చేయుటకు అలవాటుపడియున్నాడు. చివరిసారిహైదరాబాదు చికిత్సకు వెళ్ళునప్పుడు

కూడా రామాయణం ఆయన వెంటనేయున్నది. హాస్పిటలు గదిలో కూడా చదువు చుండగా జటాయు మోక్షమును రాముని చేతచరమ సంస్కారఘట్టము ప్రవర్తిల్లు చున్నది.

శ్లో॥ **యాగతిర్యజ్ఞ శీలానామ్ ఆహితాగ్నేశ్చయాగతిః**
అపరావర్తినాంయాచ; యాచభూమి ప్రదాయినామ్.
మయా త్వంసమనుజ్ఞాతో గచ్ఛలో కాననుత్తమాన్
గృధ్రరాజమహాసత్త్వ సంస్కృత శ్చమయావ్రజ

(అరణ్య కాం 68 సర్గ - 29 - 30 శ్లో)

తా:- యజ్ఞశీలురు, నిత్యాగ్ని హోత్రులు, నిరంతరభూ దానము చేయువారును తిరిగి రాని ఏయుత్తమ లోకమలకు చేరుకొని యెదరో ఓపక్షిరాజా అట్టి (నాసత్యము చేజయింపబడిన) లోకములకు నీవు చేరుదువు గాక.

అనెడి శ్లోకములాయన చదువుట పూర్తియగుట. ఆమెశ్వాస నిలిచి పోయినదని ఆయన చెవినిపడుట ఒకేసారి తటస్థించినది. ఆమె (శాశ్వతమైపునరావృత్తి రహిత) నారాయణుని స్థానము చేరిన దనిరూఢిపడినది.

వివాహమునకు ముందే ఆమెకు ఆరోగ్యపరమైనలో పమున్నదని తెలిసి అదిపరిగణింప దగినది కాదని సాహసించి వచ్చినాకుమార్తెను చేపట్టిన అల్లుని ఆశలను అడియాసలుజేసిన నన్నునే నేమని నిందించుకొనవలయును.

ఒక మహాశతకకర్త ఒకపద్యములో ఇట్లు దృఢ పరచియుండెను.

"అల్లుని మంచితనంబును ...... తెల్లని కాకులును లేవు తెలియరసుమతీ" అన్నాడు మిగిలిన విషయములే మోకాని, నా అల్లుని మంచితనమును నేనుమాటలలో వ్యక్తీకరింపజాలను "రామోవిగ్రహవాన్ ధర్మః" అన్నట్లు మంచితనము మానవాకృతి దాల్చిననాయల్లుని వలెఉండునేమో.

వాల్మీకి అయోధ్య కాండ 105 సర్గలో ఇట్లు చెప్పియుండెను.

యథాకాష్ఠంచకాష్ఠంచ సమేయాతాం మహార్ణవే
సమేత్య చవ్యపేతాయాంతాం కాలమాసాద్య కంచన (26శ్లో))

మహాసముద్రము నందు (ప్రవాహమున) ఒక కఱ్ఱమరియొక కఱ్ఱతో కలసిసాగిపోవును. కొంతకాలమునకవి వేఱయిపోవు చుండును.

అనునట్లు ఎచ్చటనోపుట్టి పెరిగివచ్చి నా కుటుంబమున కలిసినాడు.

ఏవం భార్యాశ్చపుత్రాశ్చ జ్ఞాతయశ్చవసూనిచ

సమేత్యవ్యవధావంతిధ్రువోహ్యేషాం వినాభవః (27శ్లో)

అట్లే సంపదలు భార్యా పుత్రులు బంధువులు (యజమానితో) కలసి జీవించుచుందురు. కాలక్రమమున విడివడుదురు. వీరి యొక్క సంయోగ వియోగములులోక సహజము.

ఈభావమునే ఆధునిక కవి అవసానదశయందున్న భార్యకైదుఃఖ పడుచున్న భర్తనామె యిట్లు ఓదార్చినట్లు వ్రాసినాడు.

ఆవిరియోడలో జలధియానమొనర్చెడు బాటసారులో
భూవర! రేవులందు దిగిపోయె దరించుక వెన్కముందుగా
నీవ సుధాపణంబుపనియెల్ల ముగించిస్వ దేశగాములై
పోవుచువచ్చు చుందు సతమున్ బ్రజలీ నరజన్మవర్తకుల్ (గుర్రం జాషువా)

మరియు రాజుతో ఆమె ఈలోక సంబంధములు సుఖదుఃఖ మిశ్రితము స్వాప్నికములు, మెఋపుతోసమానము భూమియనెడి సత్రశాలలో యేర్పడిన ఈ చెల్మి స్థిరమైనది కాదని భర్తకూరటగా చెప్పి వీడి పోయినది .

అట్లన్నదానికి నా కుమార్తెగమనము కూడా చక్కగా సరిపోవును. ఆయనత్యాగమునకు తగిన ప్రతి ఫలమును నేనీజన్మమునయెట్లు సమకూర్చ గలను. ఇంకొక జన్మయెత్తి ఆయనతో నిండు నూరేండ్లు కాపురముండు కుమార్తెనుగనుటయును కాంక్షింపదగినదికాదు. ఏలయన మా పెద్దలు మాతామహులు – మేనమామలు చూపిన మార్గము అనుపమానమైనది. మాతాతగారు ఒకానొక శిష్యురాలి (చావలి – భూషమ్మ) విషయమున తనతపోమహిమ ప్రదర్శించి ఆమె వ్రణబాధనివారణ చేసిరి. అట్లు చేసి శిష్యులతో ఈ మార్గము సాటిలేనిదనియు మాయందు, మా వాక్కులయందు భగవానుడున్నాడని విశ్వసింపుడని భగవన్మంత్రమహిమజూపి శిష్యులనాశ్చర్య పరచిరి. అటులనే కుమారుడనారోగ్యముతో విషమస్థితిలో తల్లడిల్ల వారికి భగవన్నామమునకు మించినయౌషధము లేదని ధైర్యము జెప్పుచు "నా యందుప్రవేశించునప్పుడు భగవానుడెట్టివాడో యెంతటివాడో యెరుంగము. తనకుతానై ఇచ్చగించిన నొకవస్తువుగా తన అంతరంగునిగా అంగీకరించి

తన మహిమ కొంత విశదపరచె అట్టి సర్వేశ్వర స్థితి ప్రచారమునకై నాకు శక్తి నిచ్చి వాత్సల్యమును ప్రకటించినాడు, ఈయేర్పడిన భగవద్భక్తి నాయొక్క నితో (తీరునది) వీడిపోవు నదికాదు, పుత్ర, పుత్రికా, పౌత్ర దౌహిత్రా దులగు మీయందరినీ రక్షింపగలడు. అందులకైనేను శ్రీవేణుగోపాలుని నెలకొల్పినాను. వాని పాదములు రక్షక మని విశ్వాసముతో మెలగండి. మిమ్ము ఆపదల నుండి ఉద్ధరించి తరింపజేయునని చెప్పి అదే మార్గమున సంతామును వారి సంబంధులను పట్టించి వెడలినారు.

కావున అట్టి వేణుగోపాలస్వామి (వేంకటదాసస్వామి) పాదములు నమ్మిభగవద్రామానుజుని సిద్ధాంతమునచేరి సేవించిపునర్జన్మ లేకుండా సంసారజలధి తరింపనిశ్చయించినవారము గాక మరలజన్మ కోరదగినది కాదు. నా బిడ్డపాణిగ్రహణముచే అల్లునకునూ అంతే (పునరావృత్తి లేని జీవనము కాంక్షింపదగియున్నది)

అయిననూ **"యుద్దామైశ్వర్యములింపుసేయునె కళత్రజ్యోతి చల్లారిననొ"** అన్నాడు సత్యవాది యైన ఒక కవీశ్వరుడు.

కానీ నాఅల్లునినేకోరునదేమన మీ వంశాంకురమును దృష్టిలో పెట్టుకొనవలెనని, జీవితపు సుఖదుఃఖములు శరీరమునకేగాని ఆత్మకు లేవనుమనో నిబ్బరమును శ్రీవేణుగోపాలుడు నీకు కల్గింపగలడని ఆశక్తితో నీ కుమారుని చిరాయువుగా ఆరోగ్యభాగ్యములతో యశోవర్ధనుడగులాగున చి॥ కౌసల్యావర్ధనుని నీవు తీర్చిదిద్ద గలవని ఆస్థితిని చూచి తల్లిదండ్రులమైన మేమూరట చెందగలమని ఆశించుచున్నాను.

గురజాడ అప్పారావు గారు ముత్యాలసరములలో (పూర్ణమ్మ ఖండికలో) చెప్పినట్లు

"నలుగురు కూర్చుని నవ్వేవేళల; నా పేరొక తరితలవండి
మీ మీకన్న బిడ్డల నొకతెకు; ప్రేమను నా పేరివ్వండి"

అనినట్లు ఆమెను మరచిపోవుట కుటుంబములో నివారికెట్లు సాధ్యపడును. అట్లు విషాదములో కూరుకుపోయిన మాకు హృదయగతముగా నవ్వెట్లు వచ్చును. లోకగతినను సరించి కాలము వెళ్ళదీయుటయే గదా! ఆరూపము, వర్చస్సు, కలుపు గోలుతనము చూపెడుచొరవ మృదుమధురముగా ఎదుట

వ్యక్తిని నొప్పించకుండ మాట్లాడు తీరుఅంతకుమించి జాలితో కూడిన దానగుణము రాజీవకు పుట్టుకతో వచ్చి సహజ గుణములై భాసించినవి. ఇతరులు అలవరచుకొనుటకు వీలుకానివి కదా సహజగుణములనగా. ఏ పని తలపెట్టినను ఆమెతలపునకు వచ్చి మా హృదయములు తల్లడిల్లుచున్నవి. పేదలను చూచినకరగిపోయెడి హృదయము కలిగి వారడుగకముందే కాంక్షించినదానికి కొన్ని రెట్లధికముగా యిచ్చెడి సరళస్వభావమామెది. అందుచే మా రెండవకుమారుడు పవన నందన రాయలుకు జన్మించిన (పాప) చిరంజీవినికి 'రాజీవశ్రీ' అనినామ కరణము చేసితిమి. రాజీవ పుట్టిన తేదీ, వారము మాసముననే పాపపుట్టుటదైవఘటన
రాజీవ 6-6-1983 సం. సోమవారం రాజీవశ్రీ 6-6-2016 సోమవారమే.

తల్లిదండ్రుల మరణము వలనదుఃఖము ఆరునెలలు లేక సంవత్సరీకము వరకు భార్యా దుఃఖము (పునఃభార్యా) వేరొక వివాహమగు వరకు కానీ, పుత్రలేక పుత్రికా దుఃఖము శాశ్వతము, జీవితాంతము మరల మరల తలంపునకు వచ్చుచు నేయుండుననుట లోకవిధానము. అట్టివియోగ దుఃఖమునకు తోడు (వారి సంతానము) ఒక నలుసున్న ఆదుఃఖ తీవ్ర తవర్ణనాతీతము కదా!

నేను కొంతగ్రంధ పఠనముచేతను అప్పుడప్పుడు బయటకు పోయి తిరుగుట చేతనుదుఃఖము కొంతమరుగుపడజేయ గలుగుచున్నాను. పుట్టిన దగ్గర నుండియు వెంటనంటి తిరుగుచు, వివాహమైనను (అత్తవారింటికి) దూరమునకు వెళ్ళక (భర్త ఉద్యోగ రీత్యా) తనతోనే ఉన్న పుత్రికావియోగమును తట్టుకొనలేక ఆమె తల్లితల్లడిలుచున్నది. చిత్తక్షోభ తగ్గించి హేజగన్నాధా ఆమెకు చిత్త శాంతిప్రసాదించ ప్రార్థించుచున్నాడను.

మా పెద్దకుమారుడు పద్మావతీ మనో హరప్రసాదు ఎన్నో పర్యాయములు మరల ఇంకొక పర్యాయము రాజీవకు బెలూన్ (సర్జరీ) చేయించుదాము. డాక్టర్లు లోగడచెప్పియున్నారు కదా యని అను చుండెడివాడు. చేయించుదాము. ఇప్పటి డాక్టర్లు ఇంకా తొందరలేద నుచున్నారు కదా. అనుచుండువాడను. అట్లుచేయించకపోతివే యనియిప్పుడు విచారించుచుంటిమి. మనవశమఅట్లు సక్రమముగా నెరవేర్చుకొనగల్గుట. మంచి కల్గవలసియుండ తప్పక నిశ్చయము మారెడిదే. ఈశ్వరేచ్ఛ తప్పింపను మాయ నతిక్రమింపను ఎవ్వరివశము.

ఈశ్వరుండు విష్ణుదేవ్వేళనెవ్వని
నేమిసేయుబురుషుడే మి యెఱుగు
నతనిమాయలకు మహాత్ములు విద్వాంసు
లడగిమెలగు చుందు రంధులగుచు

అనుభవనీయమైనప్రారబ్ధము. ఏ జన్మలో చేసినదో ఈజన్మలో మీ వలన అయిన దోషము కాదని నన్ను ఓదార్చుచున్నారు కొందరు అనుభవజ్ఞులగు పెద్దలు, హితైషులు. అయినను హేజగదీశ్వరా! పరంధామా! సర్వతంత్ర స్వతంత్రా! జగద్రక్షక ! దయామయా; నామనవి యేమనగా

ఎప్పుడొ చేసిన దిప్పుడు
ఇప్పుడు చేసిన ది ఎప్పటికొకా కుండన్
అప్పటి దప్పుడె చొప్పడ
ఎప్పుడు ఫలమిా యదగును యీశ్వర ! యెందున్.

అనివిన్నవింతును. అంతేకాకనీవు సర్వాంతర్యామివి ఇంద్రియ ప్రభుడవు. సర్వజ్ఞుడవు. నంబిళ్ళగారి కస్వస్థత ఏర్పడ శిష్యులు గురుబాధా నివారణార్థము ప్రపత్తి చేసెదమనగా సర్వేశ్వరునకు రెండు దోషము లాపాదించిన వారగుదుమనినారట వాడుదయాసముద్రుడు, సర్వము తెలిసినవాడను విషయములకు బాధకములు మీ ప్రపత్తి అని వారిని విరమింపజేసెనట.

కానీ జీవుడు చేతనుడు కనుక చైతన్య లక్షణమునిలుపుకొనుటకై కోరికలు కోరవలసి యేయుండును. అనియింకొక ప్రక్క చెప్పుచున్నారు. దివ్యచిత్తాను సారముగా నవధరింపుడు అయిననూ నామనవి యాలకింపుడు.

ప్రారబ్దము తీరినవెనుక జీవులకే గతికలుగునో ఎవ్వరికిని తెలియదు. పోయిన వారెవ్వరు నూ ఆరూపములో తిరిగి రారుకదా తెలియజెప్పుటకు సామాన్యులగుబద్ధులకు, నీ పాదాశ్రితులగు భక్తులకూ ఒకటేగతిగాక కించిత్ వ్యత్యాసము ఇహలోకము నందుకనపరిచిన కొంత కుదుట పడగలరు (భక్తులు) భక్తిలో చేరినందున నీ పాదసేవ చేసినందు మూలమున యీమేలు పొందిరి భక్తులనునట్లుగా అనుగ్రహింపుమని వేడుకొనుచున్నాను.

“చేసిన గాని పాపపములు సెందవ్వ, చేయుదలంచినంతటం
జేసెదనన్న మాత్రమున జెందుగదా కలివేళ బుణ్యములో” (భాగవతసూక్తి)

ఏది ఎట్లు జరిగినను శ్రీ వేణుగోపాలుని పాదపద్మములు విడనాడు వాడను కాను. అజ్ఞానముచే దుఃఖతీవ్రతచేపైన ఏవేవో వ్రాసి నందులకు ఉదంకుడనుమునివలె క్షమార్హుడను. మా మాతామహులు నెలకొల్పిన పెన్నిధి వగుటచే మా కుటుంబముల కన్నిటికిని దిక్కు, ధారక పోషకభోగ్యములు వేణు ధరుండవైన శ్రీయశోదానంద వర్ధనా ! నీవేకదా!

ఆమెస్మృత్యర్థముగా మహర్షి శ్రీవేంకటదాసస్వామివారి రచనలలో ఒక గ్రంథమును అచ్చువేయింపదలచితిని అముద్రిత గ్రంథములు ఎన్నోయుండగా ఒకప్పుడు ముద్రింపబడిన వరవరముని హృదయమునే ఎందులకు గ్రహించితిననెడి సందేహము పెద్దలకు కలుగ వచ్చును.

వారు వ్రాసినవి పద్యకావ్యములే హెచ్చు సంఖ్యలోగలవు వచన గ్రంథములు రెండే 1) వరవరమునిహృదయము 2) జ్ఞానసూర్యోదయము. ఈ గ్రంథము 800 పేజీల విశిష్టాద్వైత సిద్ధాంతసమగ్రవ్యాఖ్యానసారము. అద్దానిని పునర్ముద్రణచేయుట ఈ కాలమున ఒక్కరి వలన అగుపనికాదు. ఒక వేళజరిగినను ఆ గ్రంథమును పూర్తిగా చదివి ఆకళింపు చేసుకొను తీరిక ఓపికనేటికాలమున చాలఅరుదు.

అదియునుగాక ఈ చిన్నగ్రంథము నందు భగవద్భక్తిలో క్రొత్తగా చేరిన వారికి తెలియదగిన గురుపరంపర ఆళ్వారుల విషయములు ప్రథమసోపానమువలె సంగ్రహముగా చెప్పబడినవి. ముముక్షువైన వాడాచరించవలసినవి పరిహరింపవలసినవి, ఇందు సంగ్రహముగా పేర్కొనబడినవి. (మాతామహులు మాతుల మహాశయులు) తాతగారు – మేనమామలు శిష్య గ్రామములకు వెళ్ళి వర్షాకాలము రెండున్నర నెలలచటయుండి భగవద్విషయము, ఆచార్య ఆళ్వారుల విషయము అక్షరజ్ఞానము లేని వారికి కూడాపట్టునట్లు చెప్పెడివారు.

ఇప్పుడట్టి ఓపిక, తీరిక, పూనిక అనుకూల వాతావరణము మాకు కొఱవడినవి. మాతాతగారు మహర్షి శ్రీ వేంకట దాసస్వామి వారేర్పరచిన

భాష్యకార సంఘమునందచ్చటచ్చట సభ్యులు నేటకినీ చేరుచునే యున్నారు. వారికి ప్రాథమిక విషయములు (గురుపరంపర) తెలియగలందులకై ఈ గ్రంథమును నేను ఎంపిక చేసితిని.

నాకుమార్తెకు అస్వస్థత ప్రారంభమైనప్పుడు (2001)లో మా పెద్దమే మేనమామగారి రెండవకు మారుడు శ్రీ మొవ్వకృష్ణ ప్రసాదు గారు నేను కలసి “భాగవతసురభూజమును” పునర్ముద్రణగా వించితిమి. ఆమె అంతిమ యాత్రను పురస్కరించుకొని స్మృత్యర్థముయిప్పుడీ గ్రంథము పునర్ముద్రణ చేయించుట తటస్థించుచున్నది. ఈ గ్రంధాతవర్ణనలో (తృ. ఆశ్వాసంలో) అర్చిరాది మార్గము. ముక్తపురుషుడైన పుణ్యాత్ముని ప్రయాణము శ్రీవైకుంఠప్రాప్తి వర్ణించబడియున్నది. శ్రీ కూరనాథునివలే నాకుమార్తె పరమ పదము చేరెననుట కెట్టి సందేహములేదు. ఎందుచేతనన యీసిద్ధాంతకర్త శ్రీ మద్రామానుజులవారు సిద్ధాంతప్రచారకులు శ్రీవేంకటదాసస్వామి వారు తమ శిష్య సంఘము కొఱకై శ్రీరంగనాథునకు వారే ప్రపత్తి చేసియుండిరి. కావున నిస్సంశయము. మోక్షప్రాప్తి కరతలామలకము.

అయితే నాకుమార్తె ఆర్తురాలై త్వరపడి చేరినది. ఈ గ్రంథమును పఠించినవారు కూడా తృప్తులై ప్రారబ్ధానంతరము అట్టి లోకము నందగలరని అనంతగరుడ విష్వక్సేన నిత్యసూరి సేవ్యుడై శ్రీవిష్ణుదాస శ్రీశ్రీనివాస శ్రీవేంకటదాసాదిముక్త పరుష పరివృతుడైన లక్ష్మీసహితుడైన నారాయణుని అట్లనుగ్రహించగలందులకు వేడుకొనుచు, భాగవతులకు మనవి చేయుచు విరమించుచున్నాను.

ఇట్లు
విన్నవించు భాగవత విధేయుడు
గోవింద దాసు
(పద్యాల గోపీచంద్రస్వామి)

హేమలంబి 1-5-2017
చైత్ర బహుళ పంచమి.



దుఃఖ నీరాజనము...

తే॥గీ॥ అమ్మ రాజీవ అపరంజి బొమ్మ సుమ్ము
నాసు రూపంబు హృదయాల నుంచుకొందు
మీరలందరు నాకింక సెలవటంచు
వెడలిపోతివె రాజీవ నేత్రి పౌత్రి!

తే॥గీ॥ పుడమి వీడంగ నీకేమి ప్రాయమయ్యె
స్వల్ప కాలమునందున సర్వజనుల
మన్ననలు బొంది మంచి నీవెంట గొనుచు
పుష్పరథమెక్కి పోతివే పుణ్యరాశి !!

తే॥గీ॥ సాధు సజ్జనశీలి నీ తండ్రి నొదలి
మమత గురిపించు సుమతి నీమాత నొదలి
ప్రేమ వెదజల్లు పతిని నీసుతుని వీడి
మనసుగలిగెనె రాజీవదివికి బోవ

తే॥గీ॥ అమృత భాండంబు బద్దలై అవనిగలిసె
జాతి రత్నము చేజారి జలధి గ్రుంకె
ముక్కలై దుఃఖ మొందె మా మానసములు
కమలనేత్రుని దయలేని కారణమున

తే॥గీ॥ తల్లడిల్లుచునున్న నీ తల్లిదండ్రి
యోగిగా మారినట్టి నీ విభునిసుతుని
సోదరులనెల్ల నోదార్ప నెవరితరము
కాలమే దీర్చి శాంతి చేకూర్చుగాక

ఇట్లు
పితామహీ : **పద్యాల రామబాణమ్మ**
మణులు : **తన్నీరు కమలాదేవి**

వేదనారాజీవము

(8-12-15 నుండి 27-11-16)



పుణ్యపురుషులు భక్తితో పూజసలుప
కొఱత కలుగునెగోపాలు కోవెలందు
నీచుననుబోలు నిర్భాగ్యు నిలుపుజేసి
తనదుకార్యాలు సాగింప తలపుకలిగె

నేను గావించి నట్టిది నేరమేమొ
తరచి చూచిన నామది తట్టదయ్యె
కరుణజూపుము మాపైన కమలనయన
నిగ్రహింపగ మేమెట్లు నిలువగలము

కూతునొసగుమనిమ్రొక్కకూర్మినిచ్చి
పుడమి నల్పాయు వేయామె పొందుననుచు
నొసట వ్రాయింపనీకెట్లు పొసగెనయ్య
నాదుపాపంబెమూల మా నల్లనయ్య

సకలసద్గుణ సంపత్తి సంతరించి
వైద్యరంగాన విస్తృత వ్యాప్తినిచ్చి
మనసుక్షోభింప భార్యను మాటుజేయ
మానసంబెట్లు వొప్పెనోమాధవునకు

కనికరముమీఱ కలనైన గానిచూపు
ఆమె చెందిన సద్గతియరసియైన
మనసు స్వస్థత జెందగా మరలనేను
నీదు కైంకర్యమును జేయ నేర్తునేమొ

పూర్వజన్మార్జితం బైనపుణ్యలవము
లేదెనాయందు రక్షింపరాదెనీకు
వేణుగోపాల నిన్నునే వేడుకొనగ
అడ్డుపడవేమి నా బిడ్డ నొడ్డుజేర్ప

వరవరమునిహృదయము

స్వామి నీ యాజ్ఞజవదాటసాధ్యపడదు
ఆలుబిడ్డలు అల్లుండు ఆత్మజనులు
విశదమొనరించి చేసిన విన్నపంబు
చేరలేదేమి యికనేమి చేయువాడ

పాండురంగనిపాద పద్మాలు పట్టి
వసుధ నిండెను నేటికి వత్సరంబు
పరమపదనాథు పాదాలు పట్టుకొనగ
త్వరితగతిబోవనీ కిట్లు తలపు గలిగె

గోపబాలుని నెలకొల్పి కోవెలందు
కొలిచి కోర్కులు సాధించు కొనుడటంచు
మాకు తెల్పినట్టి మహర్షి మాటనెపుడు
మీరకుండగ వర్తించి మెలగినాము

నాదునేరంబులెంచకో నలిననాభ !
మూలభూతుండు మాస్వామి (తాత) మోముజూచి
కనికరించుటనీవిధి కమలనయన !
పిన్నవారల కబళింప మన్ననగునె

ఎందరెందరొ నిర్భాగ్యులెల్ల యెడల
వసుధవర్తిల్లుచున్నట్టి వారిజూడ
యింతమాత్రపు పుణ్యంబుయెప్పుడేని
నేను చేయను గాబోలు నేటి వరకు

దుఃఖ భారంబు భర్తకు తొలగజేసి
తల్లిదండ్రుల వేదన తగ్గజేసి
అడలుచున్నట్టి కొడుకుకుఅన్నలకును
శ్రీపతికి జెప్పిచేకూర్చు చిత్తశాంతి

కోర్కెయొక్కటి నెఱవేర్చు కొనుటలేదు
తీర్థయాత్ర లతరియించి తిరుగలేదు
పుడమినుండంగభోగంబు పొందలేదు
పరమపదమును జేరంగ పయనమయెను

నిండునూఱేండ్లు జీవించియుండు మనుచు
పెద్దలిచ్చినయా శీస్సు పేలవంబె
దానధర్మాలు వ్యర్థమై ధరణి జెల్లె
కఠిన కోతకు బలిజేసె కమలభర్త

అత్యధికమైన పాపపుణ్యాలఫలము
అనుభవంబగు శీఘ్రంబుననెడిమాట
సత్యమైనేడు మాయందు సాగుటెల్ల
అందరము మేము పాపాత్ములనగదగును.

అమ్మనీరూపు అపరంజి బొమ్మసుమ్మ
అర్ద్రహృదయంబు పేదలనాదుకొనగ
పలుకులందునతేనెలుపాఱుచుండు
విధియెవంచించె నిన్నుయీ విధముగాను

మరల జన్మంబువలదని మాధవునకు
విన్నపముజేసి నావొనీ వెన్ని మార్లు
దయను నీ కొర్కె చెల్లించె ననితలంతు
ఐనయిదిరీతి గాదని యలమటింతు

అరయశనిబట్టి నాతనిధనమునకును
పుడమి నెడబాటు వెంటనే పుట్టునంద్రు
నాదుబిడ్డకు నమ్మినదైవమునకు
దూరవర్తుడనయిపోయి దుఃఖపడితి

దేహమెల్లను సూదులు దిగుటజూచి
భక్తురాలగునీబాధ బాపనెంచి
తనదు సన్నిధి నిన్నుంచ దలచియిట్లు
కమలనాథుడు నీపైన కరుణజూపె.

మరలజన్మంబు మహిపైన మనకులేదు
మానసంబున నీరీతి మరపురాదు
ఆత్మలెపు డైన కలియునో అంతులేదు
యేమి చేయంగ వచ్చును, యీశ్వరాజ్ఞ.

వరవరమునిహృదయము

"మనతొాగూడనోడెన్ కంసమర్దనుండు"
అన్నరీతిని నాబిడ్డ ఆలిగాగ
అల్లుడును గూడనను గూడి అలమటించె
అట్లుగాకున్న వానికీ ఆర్తియేల.

సర్వవేళల పాలింతు సాధుజనుల
చెడ్డవారి శిక్షింపక విడువననుచు
పలికితివినీవు గీతలో పరమపురుష
యెందులెక్కింపబడితి నేనిందువలన

దుహిత యెడబాటు భరియించి దుఃఖ జలధి
దాటలేనునీ మహిమను చాటలేను
చేరగాదీసి చేకూర్చు చిత్తశాంతి
వేణుగోపాల నిన్ననే వేడుకొందు

కాలమయుగాలుకల్పాలు గడచుచుండు
పుట్టుచుందురు జీవులు గిట్టుచుంద్రు
మరలకలిసెడి భాగ్యంబు మనకులేదు
చిత్రమెంచంగ యీశ్వరు చేష్టలిట్లు

పుడమి జన్మంబు పొందిన పూట నుండి
తల్లిదండ్రుల విడనాడు తలపులేక
తోడవర్తించి తిరిగిన జాడజూచి
యెంద రెందరొా యీర్ష్యనుజెందినారొా

భక్తులుందురునాయందు భవ్యరీతి
వారియందున నేనుందు వశుడనగుచు
అనుచునీవన్న మాటకు ఆశపడితి
ఇంతఅన్యాయమొనరించుటెరుగనైతి

రక్తబంధమైన దుహితరాముజేరె
తనదుప్రతిరూపమైనట్టి తనయునొకని
భర్తగారి తొాజతజేసి బంధమేసి
మాకు బాధ్యత హెచ్చించి మదినికలచె

రాముడే గలడు మనకు రక్షయనుచు
నిర్విచారుండనైనేను నెడగుచుండ
పూర్వజన్మార్జితంబైనపుణ్య మొకటె
యున్నచోజాలున నియిప్పుడెన్నబడియె.

ఆపదలయందు కాపాడి ఆదుకొానని
ఇష్టదైవంబుయిటుజేయ ఇష్టపడగ
జన్మవీడిన పిదపనుజనుల నెట్లు
బ్రోచు నిజమంచు నమ్మంగ బోలనగును

ఎప్పుడొా చేసిన దిప్పుడు
ఇప్పుడు చేసినది ఎప్పటి కొాకాకుండన్
అప్పటి దప్పుడె చొప్పడ
ఎప్పుడు ఫలమీయ దగునుయీశ్వరుడెందున్

మనుజలోకాన శిక్షలుమారు చుండు
కాలవశమున తగ్గును కఠిన శిక్ష
ముందు కూర్చినరుజచాల నందువలన
మరణ శిక్షగ మార్చెను మాధవుండు

ఎందరొా మంచిగా చెప్ప ఎగిరివచ్చి
మోదమునతాళి గట్టితామురిసిపోయె
మూడు నాళ్ళకెబ్రతుకిట్లు ముగియుననుచు
ముందు చూపులే నందున మోసపోయె

అకృత్రిమత్వచ్చరణార విన్దప్రేమప్రకర్షావధి మాత్మవన్తమ్
మాతామహం వేంకటాఖ్యంవిలోక్య, ప్రసీదమద్వృత్తమచిన్త యిత్వా.

వేదనాభరిత హృదయాలతో ..

తల్లిదండ్రులు

శ్రీమతే రామానుజాయ నమః


గ్రంధము ను గూర్చి శిష్యుని నివేదన


ఆస్తికజనాగ్రేసరులారా !


నేను బాల్యంబున మాతృభాష యగునాంధ్రంబునందును, ఆంగ్లేయభాషయందును గొంతజ్ఞానము సంపాదించి లౌకికోద్యోగంబునకై యే డెనిమిది వేలరూప్యంబుల వెచ్చించి ఫలంబు గానక వ్యవహారధర్మంబు లన్నియు నిట్టివేకదా యని విసికి వేసారి శాశ్వతా నందముఁ జెందఁగోరి మదీయ గ్రామనివాసులును, వైష్ణవాగ్రేసరులునగు మొవ్వ వేంకటదాసు గారి నాశ్రయించి యుపదేశంబుఁ జెంది కొంతకాలమునుండి విష్ణుభక్తి చేయుచుంటి మా గురువు గారు సీతారామానుగ్రహము చే సంస్కృతాంధ్ర ములయందు గొంతపాండిత్యము సంపాదించినవా రగుటచే, శ్రీనివాసహస్రము, శ్రీదేవీసహస్రము, ఆంజనేయస్తవము, శ్రీసీతారామ ప్రభావము, కొన్ని హరికథలును రచించి యుండిరి. శ్రీ దేవీసహస్రములోఁ గొంతభాగ మచ్చొత్తింపఁబడినది. గాని తక్కినవి ద్రవ్యలోపంబుచేఁ బ్రకటింపఁ బడవయ్యెనిది యిట్లుండఁగా నీసంవత్సరము 'వరవరముని హృదయ' మను వైష్ణవ గ్రంథ మొకటి రచించి నాకుం జూపించి రా గ్రంథంబు వినినంతటం బ్రళయకాల సముద్రజలంబున మునింగినజను లల్లాడినట్లు మదీయ హృదయం బానందసముద్రంబున నోలలాడె నంతమాత్రమేకాక శరీరంబు పరవశంబయ్యెనటుమీఁద వీనినచ్చు వేయించువిధ మెట్లాయని యాలోచింపుచుండ శ్రీ రామానుజులవారి తిరునక్షత్రమహోత్సవంబు దివితాలూకాలో నశ్వారావుపాళెములో జరిగినది. యా యుత్సవమునకు మద్గురుపుంగవుని శిష్యులగు భాష్యకారసమాజసభ్యులు మున్నూరుమంది వచ్చిరి. రామానుజులవారి జన్మదినం బగు నార్ద్రా నక్షత్రమహోత్సవ మైదుదినంబులు నిరాఘాటంబుగా జరిగె నా దినం బులయందు గురువుగారిచే నుపన్యసింపఁబడిన భగవత్కల్యాణగుణామృతంబు కర్ణాంజలులం గ్రోలి భక్తు లానంద భరితులై యుండ నుత్సవాంతంబున నేను లేచి దేశికునిఁ గూర్చియు, వారిచే రచింపఁబడిన గ్రంథప్రాశస్త్యంబును గూర్చియు నుపన్యసించి శక్త్యానుసారముగా ద్రవ్యసహాయము చేయు దని సభ్యులంగూర్చి సవినయంబుగాఁ బ్రార్థించి నాలుగురూప్యంబు లొసంగితిని. నిరుపేదలైనవారుఁదుప్పఁ దక్కినభాగవతులు స్త్రీ పురుషు లందఱు మహోత్సాహంబుతో నూటయేబదిరూప్యంబు లొసంగిరి. యిక్కార్యంబున నాకుం దోడ్పడి సభ్యుల కుత్సాహంబు గల్పించి తమశక్తి లోపంబు లేకుండ ద్రవ్యం బొసంగి నన్నుఁగృతార్థునిఁ జేసిన చావలిపురనివాసుఁడగు విష్ణుమొలకల వీరరాఘవదాసుగారికి, బడేవారిపాళెములో నుండు పూషడపు మాధవదాసుగారికి వందనసహస్రంబు లర్పించి తక్కినసామాజికులగు స్త్రీ పురుషాదులనామంబులు ప్రకటింపఁ దలంచియు గ్రంధవిస్తరభయంబుచే మానితి నందువలనఁ గృతఘ్నుతాదోషంబు నా కొదవకుండ వారి కందఱికి శిరస్సు వంచి యంజలి గీలించి నమస్కరింపుచున్నాను.

ఇట్లు విన్నవించు సాధుజనవిధేయుఁడు,

పద్యాల విశ్వేశ్వరరావు.







పన్నిద్దరాళ్వారులు - తిరు నక్షత్రములు - గ్రంధములు - పాశుర సంఖ్య

	ఆళ్వారు	మాసం-నక్షత్రం	అంశ	గ్రంధము	పాశుర సంఖ్య
	ఇలయాళ్వారు శ్రీరామానుజులు	మేష - ఆర్ద్ర చైత్రం - ,,	శేషస్వరూపం	1) శ్రీభాష్యం (బ్రహ్మ సూత్రములకు) 2) వేదార్థ సంగ్రహం 3) వేదాంతదీపం 4) వేదాంతసారం 5) గీతాభాష్యం 6) శరణగతిగద్య 7) శ్రీరంగగద్య 8) వైకుంఠ గద్య 9) నిత్యగ్రంధం	
1.	పొయ్గైఆళ్వారు	ఆశ్వీజం-శ్రవణ	పాంచజన్యాంశ (శంఖం)	మొదల్ తిరువందాది	100
2.	పూదత్తాళ్వార్	ఆశ్వీజం-ధనిష్ఠ	కౌమోదకి (గద)	ఇరండాంతిరువందాది	100
3.	పేయాళ్వారు	ఆశ్వీజం-శతభిషా	నందకం (ఖడ్గం)	మూన్ఱాంతిరువందాది	100
4.	తిరుమళిశైయాళ్వార్	పుష్య - మఖా	సుదర్శనం (చక్రం)	తిరుచ్చంద విరుత్తం నాన్ముగం తిరువందాది	120 96
5.	కులశేఖరాళ్వార్	మాఘ-పునర్వసు	కౌస్తుభమణి	పెరుమాళ్ తిరుమొళి ముకుందమాల (40శ్లో)	105
6.	తొండరడిప్పొడియాళ్వార్	మార్గశిరం-జ్యేష్ఠ	వైజయంతీ మాల	తిరుమాలై తిరుప్పళ్ళి యెళుచ్చి	45 10
7.	తిరుప్పాణియాళ్వారు	కార్తీకం - రోహిణి	శ్రీవత్సం (పుట్టుమచ్చ)	అమలనాదిపిరాన్	10
8.	తిరుమంగైయాళ్వార్	కార్తీకం - కృత్తిక	శార్ఙ్గం (ధనుస్సు)	పెరియతిరుమొళి తిరుక్కురుందాండకం తిరునెడుందాండకం తిరువెళుక్కూత్తిఱుక్కై శిరియతిరుమడల్ పెరియతిరుమడల్	1084 20 30 01 77 149
9.	పెరియాళ్వార్	జ్యేష్ఠ - స్వాతి	గరుడుడు (రధాంశము)	తిరుప్పల్లాండు పెరియాళ్వార్ తిరుమొళి	12 461
10.	ఆండాళ్ (గోదాదేవి)	ఆషాఢం - పూర్వఫల్గుని	భూదేవి	తిరుప్పావై నాచ్చియార్ తిరుమొళి	30 143
11.	నమ్మాళ్వార్	వైశాఖ-విశాఖ	విష్వక్సేనాంశ	తిరువిరుత్తం తిరువాశిరియం పెరియతిరువందాది తిరువాయిమొళి	100 7 87 1102
12.	మధుర కవి	చైత్రం - చిత్తా	కుముదగణేశాంశ	కణ్ణినున్ శిరుత్తాంబు	11
				నాలాయిరము	4000

శ్రీమతే రామానుజాయ నమః

పీఠిక

స్వాత్త్వికజనాగ్రగణ్యులారా !

పుణ్యభూమియని ప్రసిద్ధిc జెందిన భరతఖండంబున మహాత్మ లనేకులు జన్మించి సంసారాంబుధి నిమగ్నులగు చేతనుల నుద్ధరింపనెంచి బహువిధమార్గంబులు కనిపెట్టి యాయా మార్గంబులకు శ్రుతి స్మృతీతిహాస పురాణంబులు నుపనిషత్తులును భగవద్గీతాశాస్త్రంబునుc బ్రమాణంబులుగా నొసంగి రట్టి మహనీయులలో శంకరాచార్యులవా రద్వైతంబును, రామానుజులవారు విశిష్టాద్వైతంబును, పూర్ణప్రజ్ఞ యాచార్యులవారు ద్వైతంబును స్థాపించిరీ మూడుమతంబులు జగత్ప్రసిద్ధంబులు. వీనిలో ననేక శాఖాభేదంబు లుండినను మొత్తము మీcద నారాయణపరత్వమునేc బ్రకటింపుచున్న విప్పటికి నాయా మతములలో జనించినవారును నూతనముగాc బ్రవేశించినవారునుcదదీయ మార్గములనే యనుసరింపుచున్నారు, కాని యియ్యాంధ్రదేశంబున రామానుజ సిద్ధాంతము స్వల్పముగానైనను వ్యాపించుటలేదు. కారణ మేమన నీ మతగ్రంథంబులన్నియు సంస్కృత ద్రావిడములలో నుండుట చేతను బోధకుల శ్రద్ధాయోగంబును భజించుటచేతను దేశము మతాంతరవ్యాప్తి గలదగుటచేతను, మతంబు మిక్కిలి కట్టుదిట్టము గలదగుటచేతను దీనికిట్టి దుర్దశ సంభవించెనని తలంచెద నింతేకాక కలివులో నధికమాసమనునట్లు కూచిమాచిమతస్థుల దురాచారంబులీ మతగౌరవంబునకు హాని గల్గింపుచున్న విట్టి కొలంతలేమైన నివారించునేమోయని తలంచి భాష్యకార సమాజమొకటి నిర్మించి చిరకాలమునుండి శ్రమపడితిని కాని రెండుమూడువందల జనులుమాత్రము దీనిలోc జేరి రింకను వృద్ధిపరుపవలయుననిన నేను గృహస్థుండనగుట చేత దూరదేశంబున కేగి బోధించునట్టి సామర్థ్యంబు గలుగదయ్యె నక్కారణంబునc దేలికమాటలతో గ్రంథరూపంబున వెల్లడించిన మేలగునేమోయని సముద్రమునుc జేతులతో నీదినట్లీ కార్యంబున కుపక్రమించితి. సామాన్యజనముల కుపయోగింపవలయునను భావంబుతో

దీర్ఘసమాసంబులుగాని శబ్దాలంకారార్థాలంకారములుగాని పర్యాయపద బాహుళ్యంబుగాని దీనియందుc బ్రయోగింపనైతిని. వీలైనంతలో సంధులు సహితము విడదీసి వ్రాసినాడ. నిమ్మతంబున నిట్టిపట్టుదల నీకేల యందురేమో.

మాతులగృహంబున నేను జనించిన పదియేనవ దినంబున నర్థ రాత్రంబున నొక్క మహా సర్పంబు పడగవిప్పి తన నీడను నాపైc బ్రసరింపజేయcగా మాతల్లి నిద్రనుండిలేచి భయంబుజెంది శబ్దించె నాశబ్దంబు విని బలుమందివచ్చిచూడ సమ్మహాసర్పం బదృశ్యంబయ్యె నంతట వారందఱాశ్చర్యపడి మాతల్లిని బయటికిరమ్మన నామె వచ్చుచుండ నాసర్పంబెప్పటియట్లు పడగవిప్పి యాడుచు నందఱికిc గానిపించి మాయమయ్యె నాసమయంబునc గాంచినవారందఱిది దేవతా సర్పంబని చెప్పి స్వగృహంబుల కేగిరట. యావృత్తాంతంబు పన్నెండవ సంవత్సరంబున హరిభక్తి నారంభించిన నాకు మాతల్లి గారు వచింప నా విషయంబు మద్గురువర్యులగు వేదాల సీతారామాచార్యులవారి కెఱింగింప సమ్మహామహులు నన్నుంజూచి వత్సాయది సామాన్య సర్పంబు గాదు. ఆదిశేషుండగు ననంతాళ్వారమ్మహా పురుషుండు పూర్వము రామానుజులవారై యవతరించి చేతనోద్ధారణసల్పిన మహా యోగి. నీవు వైష్ణవమతంబున జనించుటcజేసి నిర్హేతుక కటాక్షంబుచే నిన్ననుగ్రహించి రికమీcదc దమసిద్ధాంత రహస్యంబులన్నియు నీకు స్వయముగా నెఱింగింపcగలరు. వారి పాదరాజీవంబుల నమ్మియుండుమని సెలవిచ్చిరి. తరువాత నేనాశ్చర్యాంబుధి మునింగి యఘటనఘటనా సమర్థులగు భగవద్రామానుజ యోగీంద్రులవా రీ దీనునొక వస్తువుగా నంగీకరించి యింత దయారసము జూపిరిగదాయని బ్రహ్మానందంబుజెంది యుద్దైవరుల ఋణంబు దీర్పనెంచి యిట్టి యుద్యోగంబున కారంభించి, మొట్టమొదటc బంచసంస్కారాదు లొనరించి మంత్ర మంత్రార్థంబు లుపదేశించిన శ్రీమాcతిరుమల వేదాల సీతారామాచార్యుల వారిని బాల్యంబున విశిష్టాద్వైతసిద్ధాంతం బెఱింగించిన యంతర్వేది నృసింహాచార్యులవారిని సంజయునియందు వేదవ్యాసుండును, మారనేరినంబిపై యాళవందారులును, ధనుర్దాసునిపై రామానుజులువారును

కారుణ్యము నెరపినట్లు నాయందపారానుకంప ప్రసరింపఁజేసి శ్రీవైష్ణధర్మంబులు బోధించి, తర్కవ్యాకరణ మీ మాంసవేదాంతములు యందపారపండితులై, ప్రఖ్యాతివడసి ప్రస్తుతము రేపల్లెలో విద్యార్థులకు సంస్కృత విద్య నుపదేశింపుచున్న శ్రీమాన్ సముద్రాల లక్ష్మణాచార్యులవారిని స్తుతించి వారి ముప్పురికి సాష్టాంగనమస్కృతు లాచరించి గ్రంథరచన కారంభించితిని. కావున నుభయవేదాంత కోవిదులు, భాషాభిమానులు, పరమభాగవత శిఖామణులు, కవీశ్వరులు, పండితులు మదీయ సాహసంబునకోర్చి వాగ్దోషంబులు క్షమింతురని వందన సహస్రము లర్పించుచున్నాను.

ఇట్లు విన్నవించు శ్రీవైష్ణవ శ్రీపాదధూళి,

మొవ్వ వేంకటదాసు.

శ్రీమతే రామానుజాయ నమః

- గురుపరంపరా విషయము -

శ్రీ రామానుజమతంబునందు నాచార్యులను, ఆళ్వారలను తెలిసికొననివారి కెన్ని సంవత్సరములకైన సిద్ధాంతము తెలియదు. గనుక యీ క్రింద గురుపరంపరా విషయంబును వారివారి పర్యాయనామంబులను దెలుపుచున్నాను.

శ్రీరామానుజసిద్ధాంతమునకుఁ బ్రథమాచార్యుండు నారాయణుండు.

1. శ్రీమన్నారాయణుండు.
2. శ్రీమహాలక్ష్మి
3. శ్రీవిష్వక్సేనులవారు:- వారికి సేన మొదళియాళ్వారు, సైన్యపతి, శేషాశనుఁడు, నని పేరులు.
4. నమ్మాళ్వారు - వీరికి శఠగోపులు, వకుళభూషణులు, శఠారాతి, శఠారి యను సంస్కృతనామంబులును, ఆళ్వారు, నమ్మాళ్వారను ద్రావిడనామంబులును గలవు. దేవాలయంబులందు నర్చకులు మనశిరస్సున నుంచునట్టి భగవత్పాదములు వీరినామముతోడనే. వీరు భగవంతునికిఁ బాదప్రాయులు గనుక యా నామంబు గలిగినది. వీరు గురు పరంపరలోను, ఆళ్వారులలోను వత్తురు.
5. నాథమునులు - వీరు నమ్మాళ్వారినిఁ బ్రత్యక్షము జేసుకొని తిరువాయిమొళి మొదలైన దివ్యప్రబంధంబులు సంపాదించి యోగబలంబుచే శ్రీయఃపతిని సాక్షాత్కరించినవారు.
6. పుండరీకాక్షులు - వీరికి ఉయ్యక్కొండారు అను ద్రావిడ నామంబు గలదు.
7. శ్రీరామమిశ్రులు - వీరికి మణక్కాలనంబియను ద్రావిడ నామంబు గలదు.
8. శ్రీయామునాచార్యులవారు - వీరికి బాల్యంబున యమునత్తు రయవరనియు, చోళరాజాస్థానపండితుని జయించినప్పుడు తదీయ రాజపత్ని చేఁ బిలువఁబడినప్పుడు ఆళవందారనియు, వాదిమత్తేభ సింహు లనియు యామునాచార్యులనియు, బేరులు గలవు.
9. పంచనంబు - వారికి ద్రావిడనామంబులు, సంస్కృత నామంబులు గలవు. యేవనగా :-

ద్రావిడ నామములు	**సంస్కృత నామములు**
పెరియనంబి	మహాపూర్ణులు
తిరుక్కోట్యూరినంబి	గోష్ఠీపూర్ణులు
తిరుక్కచ్చినంబి	కాంచీపూర్ణులు
తిరుమలనంబి	శ్రీశైలపూర్ణులు
మాలాధరనంబి	మాలాధరులు

వీరైదుగురు యా మునాచార్యులవారి శిష్యులు. రామానుజులవారికి గురువులు.

పెరియనంబి, రామానుజులవారికిఁ బంచసంస్కార మొనర్చి తిరుమంత్రో పదేశము చేసినవారు. తిరుక్కోట్యూరినంబి, రామానుజుల వారికిఁ జరమ శ్లోకార్థము చెప్పినవారు.

తిరుక్కచ్చినంబి, రామానుజులవారికి నాఱువార్తలు చెప్పిన వారు.

తిరుమలనంబి, రామానుజులవారికి శ్రీరామాయణ విశేషార్థంబు లెఱింగించినవారు.

మాలాధరులు, వీరు రామానుజులవారికి ద్రావిడ ప్రబంధంబు లెఱింగించినవారు.

10. శ్రీ రామానుజులవారు – వీరికి యతీంద్రులు, యతిరాజు, యతిపతి, గోదాగ్రజులు, శారదాశోకనాశనులు, శ్రీభాష్యకారులు లక్ష్మణాచార్యులు, ఇలయాళ్వారు, ఉడైవరులు, శ్రీవైష్ణవ చక్రవర్తియను నామంబులును, పర్యాయనామంబు లింక ననేకంబులు గలవు. వీరలాళ్వారివరుసలోను గలరు.

11. గోవిందభట్టరు – వీరికి యెంబారనియు పర్యాయ నామంబుగలదు.

12. పరాశరభట్టరు – వీరకిఁ బరాశరసూరి, పరాశరయోగి మొదలైన నామంబులు గలవు.

13. నంజియ్యరు – వీరికి మాధవదా సనియు నద్వైతంబు నందున్నప్పుడు వేదాంతి యనియుఁ బేరులు గలవు.

14. నంబిళ్ళ – వీరికిఁ గలివైరిదాసు, వరదరాజు, నంబిళ్ల లోకాచార్యులు, ననుపేరులు గలవు.

15. వడుక్కు త్తిరువీధిప్పిళ్ల – వీరికి శ్రీకృష్ణపాదదేశికులని సంస్కృత నామంబును గలదు.

16. పిళ్ళలోకాచార్యులు – వీరికి జగద్గురు వని, జగదాచార్యులని, లోకాచార్యులని, పర్యాయనామంబులు గలవు.

ఇమ్మహాపురుషుం డష్టాదశరహస్యంబులను గ్రంథరత్నంబులు నిర్మించి దేహాభిమానులకు గర్వభంగంబును, భగవద్భక్తుల కుజ్జీవన మార్గంబునుఁ గల్పించి భగవద్రామానుజసిద్ధాంతంబు వృద్ధిఁజెందించిన మహాయోగి.

17. తిరువాయిమొళిప్పిళ్ళ – వీరికి శ్రీశైలేశులని సంస్కృత నాముంబు

గలదు. తిరువాయిమొళి ననేకపర్యాయములు పఠించి శ్రోతల కెఱిఁగించినందున నానామంబు గల్గెనని పెద్దలు చెప్పుదురు.

18. మణవాళమహామునులు – వీరికి రమ్యజామాతృముని, సౌమ్యజామాతృముని, కాంతోపయంతృయోగి, యతీంద్రప్రవణులు, వరవరముని, శ్రీరంగరాజగురుఁడు, మొదలైన తిరునామంబు లనేకంబులు గలవు. యింతవరకు వీరవతారపురుషులు.

19. వానమామల జియ్యర్ – వీరే యిప్పటికినిఁ బ్రపంచంబునంగల శ్రీవైష్ణవ పీఠంబుల కెల్ల ముఖ్యపీఠంబని చెప్పఁగా విందుము. ఈ పరంపరను నారాయణునియొద్దనుండి యెంచగా నొకరికొకరు శిష్యులుగానుందురు. క్రిందినుండి పైకినెంచినచో నొకరికొకరు గురువులుగా నుందురు.

– ఆళ్వారల విషయము–

	సంస్కృతనామంబులు	ద్రావిడనామంబులు
1	భూతయోగి	పూదత్తాళ్వారు
2.	సరోయోగి	పోయ్‌గాళ్వారు
3.	మహదాఖ్యయోగి	పేయాళ్వారు
4.	భట్టనాథులు, విష్ణుచిత్తులు	పెరియాళ్వారు
5.	భక్తిసారులు	తిరుమలి శేయాళ్వారు
6.	కుల శేఖరసూరి	కులశేఖరాళ్వారు
7.	యోగివాహనుఁడు, మునివాహనుఁడు	తిరుప్పాణియాళ్వారు
8.	భక్తాంఘ్రి రేణువు	తొండరడిప్పొడియాళ్వారు
9.	పరకాలుఁడు	తిరుమంగయాళ్వారు
10.	శఠారాతి	నమ్మాళ్వారు
11.	మధురకవి	మధురకవియాళ్వారు
12.	యతీంద్రమిశ్రులు, వీరేరామానుజులు	ఇలయాళ్వారు
13.	గోదాదేవి, విష్ణుచిత్తతనూజ	ఆండాళు, శూడికొడుత్తు నాచ్చియారు

ఆళ్వారలనఁగా జన్మించినదాది శరీరపతనమువరకు భగవంతుని యందవగాహించిన మనస్సుగలవారని యర్థము. వీరు కృతయుగాది కలియుగమువరకు నొక్కొక్కయుగమునందు ముమ్వురు ముమ్వురు జనించిరని కొన్నిటియందును అందఱు కలియుగంబునందే జనించిరని కొన్ని గ్రంథములయందును గలదు. నూతనముగా సిద్ధాంతము దెలియఁగోరువారికి సులభముగా నుండుటకై యింతమాత్రము తెలిపితి. నీవిషయంబు లామూలాగ్రముగాఁ దెలియవలయునన్న దివ్య సూరి చరితము, ప్రపన్నపరిత్రాణము, గురుపరంపరాప్రభావము, పరమయోగి విలాసము, ఆచార్య సూక్తిముక్తావళి, ఆచార్య రత్నహారము, ఆళ్వారాచార్యుల చరిత్రము, మొదలైన గ్రంథములయందుఁ జూడవలయును.

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీసీతాలక్ష్మణభరతశత్రుఘ్నహనుమత్సమేతశ్రీరామచంద్రపరబ్రహ్మణేనమః

వరవరమునిహృదయము

ప్రథమభాగము

శ్లో॥ శ్రీరామాహృదయేశ్వరం ప్రవిమలానందాలయం కేశవమ్
పంకేజాసవందితాంఘ్రియుగళం ఘోరాఘవిధ్వంసినమ్
వైకుంఠాధిపమంబుజాతనయనం శ్రేయః ప్రదం శ్రీహరిం
నీలాంభోధరసన్ని భాంగమమలం వందే జగన్నాయకమ్ ॥

శ్లో॥ శ్రియం నీళాం ధరాదేవీం, విష్వక్సేనం ఖగేశ్వరమ్
పంచాయుధాన్యనం తం చ, వందేహం శ్రీహయాననమ్ ॥

శ్రీ రామానుజసిద్ధాంతంబునకు వైష్ణవంబనియు విశిష్టాద్వైతం బనియుఁబేరులు గలవు. పూర్వమునుండి యిది యొక రాజ్యంబువలెను దీని నుద్ధరించువారు సార్వభౌములవలెను శ్రీరంగంబు రాజధానివలెను తక్కిన పుణ్యక్షేత్రంబులు పర్యాయపత్తనంబులవలెను విరాజిల్లుచున్నవి. యీమతంబును వ్యాస, భోధాయన, టంక, ద్రమిడాచార్య, గుహదేవ, భారుచి, శఠగోప, యాయునాచార్య పంచనంబులు క్రమంబుగాఁబాలించిరి. తదుపరి శ్రీరామానుజులవారు, నెంబారు పరాశరభట్టరు, నంజియ్యరు, నంబిళ్ల, శ్రీకృష్ణపాదదేశికులు, పిళ్లలో కాచార్యులవారు, తిరువాయి మొళిప్పిళ్ల వరుసఁగాఁ బాలించిరి. తరువాత మణవాళమహామునులవారు తామ్రపర్ణీతీరంబునం గురుకాపురంబునందిరునావీరుడై యప్పిరాన్ గారికి శ్రీరంగనాచ్చియారను భార్యయందు మూలానక్షత్రంబున జనించి తిరువాయిమొళిప్పిళ్ల గారి నాశ్రయించి శిష్యుఁడై సమస్తశాస్త్రంబులం దపారపాండిత్యంబు సంపాదించి బద్ధసంసారుల నుద్ధరింపుచు శ్రీరంగంబున వేంచేసియుండిరి. మణవాళ మహామునులకు రమ్యజామాతృయోగి, సౌమ్యజామాతృ యోగి, కాంతోపయంతృయోగి వరవరమునియతీంద్ర

ప్రవణుఁడను పర్యాయనామంబు లనేకంబులు గలవు. వీరు పూర్వాచార్యుల దివ్యప్రబంధంబులకు వ్యాఖ్యానములు చేసి యుపదేశరత్నమాల మొదలగు గ్రంథంబుల సాయించి రివ్వైష్ణవ శిఖామణి శ్రీరంగంబున వేంచేసి యుండఁగా నాకానొకదినంబున సుశీలుం డను యాత్రాపరుండొక్కఁడు శ్రీరంగము నకుఁబోయి నంబెరుమాళ్లను సేవించి శ్రీవైష్ణవసమూహములచేఁ బరివేష్టింపఁబడి యుండు వరవరమునీంద్రుల దర్శించి సాష్టాంగ నమస్కారంబులు గావించి నిలబడఁగా నతనికిఁ దోచినవైభవం బెట్టి దనఁగా మణవాళమహామునుల వారర్థపంచక జ్ఞానం బనుమేడలోన నుష్ఠానం బనుసింహాసనం బెక్కి భగవద్గుణానుభవం బను పీయూషంబు భాగవతుల కొసంగుచు భక్తిరాజ్యమును పరిపాలింపుచుండిరి. వైరాగ్యమనుకోటవారి రాజ్యంబునుఁగాపాడు చుండె, దుర్మతనిరసం బనుపరిఖ దానిం బొదివి యుండె, శాంతిశమదమాది కల్యాణగుణంబులను పురరక్షకులు కోట కన్నిభాగంబులఁ గాపాడుచుండిరి. వాదమునకుఁ గవిసిన పరవాదుల జయించి పాఱదోలుటకుఁ దగినతర్కవాక్యంబులను దివ్యాస్త్రపరం పరలాచార్యుల వారియొద్ద సమృద్ధిగా నున్నవి. అట్టివైభవంబు గాంచి సుశీలుండానందకందళితహృదయారవిందుఁడై వరవరమునులం గాంచి స్వామీ మీ రెవ్వ రని యడిగెను.

అంతలో గురుపుంగవునిఁ బరివేష్టించియున్న భాగవతులా సుశీలునిం గాంచి పరదేశీ! యిమ్మపురుషుండు మణవాళ మహామునియను పేరుగల యోగిజనాగ్రగణ్యుఁడు, విశిష్టాద్వైత రాజ్యపరిపాలకుఁడు శ్రీవైష్ణవచక్రవర్తి, శ్రీమన్నారాయణ పాదరాజీవ ద్విరేఫంబు, విశదవాక్య శిఖామణి, సర్వదుర్మత శిలోచ్ఛయదంభోళి, భగవద్రామానుజ ప్రభావవేది, భగవదవతార రహస్యార్థ నిర్ణయ వాచాధురంధరుఁడు, బద్ధసంసారి జనోద్ధారణ దీక్షానిరంతరుండు, పూర్వాచార్యముఖనిర్గళిత సంప్రదాయార్థ నిర్ధారణ సార్వభౌముఁడు. మే ముజ్జీవనార్థ మిమ్మహాత్ము నాశ్రయించిన శిష్యులము నీవెవ్వండవని యడిగిరి.

సుశీలుఁడు

ఆర్యులారా నేనొకకుగ్రామ నివాసుండను. సుశీలాఖ్యచేఁబిలువం బడుదుఁ దీర్థయాత్రాపరుండనై యీదేశంబునకు వచ్చి రంగనాయకీ సహితుండగు నంబెరుమాళ్లను దర్శించి గురువుగారి ప్రభావంబు విని దర్శింప వచ్చితిని.

భాగవతులు

పుట్టినదాది నీ వింతవరకేమేమి చేసితివి ?

సుశీలుఁడు

పెద్దలయెదుట నేమనిచెప్పుదును. సిగ్గగుచున్న దైనను రోగి తన యపథ్యమును వైద్యున కెఱింగించినట్లు మదీయ దుర్ణయములు మీకు విన్నవింతు నాలకింపుడు. జన్మాది పది పంద్రెండు సంవత్సరంబులు బాల్యజాడ్యంబునం దిరిగితి నంతఁ గలిమహారాజుగారు నన్నుఁదన రాజధానికిఁ బిలిపించి గొప్పగొప్ప యుద్యోగవిధానంబులునేర్పె. నేనా యుద్యోగంబులయం దారితేరి ప్రసిద్ధిఁగాంచితి.

భాగవతులు

నీవక్కలిమహారాజుగారియొద్ద నేమేమి యుద్యోగవిధానంబులు నేర్చుకొంటివి వాని నెట్లు నిర్వహించితివి?

సుశీలుఁడు

చెప్పుచున్నాను సావధానచిత్తులరైవినుండు. మొట్ట మొదట సోమరితనంబునేర్చితి. నటుపిమ్మట వృథాకాలయాపనమందుఁబ్రవీణుండనై దివారాత్రములు జూదంబులాడితి. నూరంగల లోగిండ్లన్నియుం గలయందిరిగితి. వీధిపోట్లాటలకుఁ దీర్పులిచ్చుచుంటిని. దుర్జన సహవా సంబునం దభిరుచియు, సజ్జన సాంగత్యంబునందు వైముఖ్యముఁగలిగి యుండితి. సాధుదూషణంబు పరావమానంబు నాత్మస్తుతియు నాకు నిత్యానుసంధానంబులయ్యెఁ, బురాణంబులు పుణ్యకథలు వినువారినిఁ జెప్పువారిని యెగతాళిచేసితి. బుడ్లకుబుడ్లు సారాయి ద్రావితిఁ, బుట్లకుఁబుట్లు చేపలుదింటిని, కుక్కుటంబులను గ్రామ సూకరంబులను పొట్టేళ్ళను మేకలను

గోయించి తిన్నదికాక తినువారికిఁ బంచి పెట్టించితి. అంకమ్మ సూకలమ్మ, పోలేరమ్మ, గంగానమ్మ పోతురాజు మొదలగు క్షుద్రదేవతలకు ముడుపులు ముద్రలువేయించి కొలుపులు చేయించి మతంగస్త్రీల యుచ్ఛిష్టంబు పవిత్రంబని మేనంధరించితిఁ, బదిదుక్కులవాన పైనఁ గురిసినను మెలఁకువలేకుండ నిద్రించుటయందుఁ గుంభకర్ణుండు నాకు సాటిరాడు. బూతులు ప్రసంగించు విషయంబున నాకుంగల పాండిత్య మెవ్వరికిలేదు. అసత్యవాక్కుల కాధారభూతుండను. ధనమదంబు, కులమదంబు, విద్యామదంబు పరీక్షింపవలయునన్న దూరంబేగ నవసరంబులేదు. పరస్త్రీల వర్ణించుటలో మహాకవులు నాకు సాటిరారు. నాస్తికవాదంబున కారంభించితినేని దార్కికులు, వైయాకరణులు, మీమాంసకులు, వేదాంతులు పుస్తకంబులు ముడిచి నిరుత్తరులై గడగడ వడంకవలయు నిట్టి యుద్యోగంబులు కలిమహారాజుగారి యొద్ద నేర్చుకొని నాకు భగవంతుం డొసంగిసత్కాలక్షేపం బనుమహాధనం బంతయు నారాజుగారికిఁగట్నముగా సమర్పించితి. నాధనంబునకు మాఱుగా నా యా యుద్యోగములవల్లఁ బాపం బనుద్రవ్యం బార్జించి ఫలానుభవ మనుమేడకు బునాదు వేయు నంతలోఁబై రాజ్యములోఁ జక్కగాఁబని చేసినందున నా ప్రఖ్యాతి విని మన్మథ మహారాజుగారు యౌవన మనుతన స్నేహితునిచే నన్ను గౌరవపూర్వకముగాఁ బిలిపించి నాతోనిట్లనియె:– 'అయ్యా!నీ విది వరకు మదీయ ముఖ్యవయస్యుఁ డగుకలిమహారాజుగారి రాజ్యంబునఁ జక్కగానుద్యోగములు చేసి లాభములు గూర్చినావని వింటి నంతకంటే గొప్పజీతం బిచ్చెద నాకడ నుందువా' యనెను. నేనది విని యింతలేసివారికిఁ బూజ్యుఁడ నైతిం గదా! యని సంతోషించి, చిత్తమట్లే కానిమ్మంటి నంతటం బూవింటిజోదు సూనశరంబులచే లజ్జ యనుకవా టంబుభేదించి తన మందిరంబగు యువతీ మర్మస్థానంబున నన్నుఁబ్రవేశపెట్టె నమ్మఁదిరంబు ప్రవేశించినదాదిగా నిఁక నేమి చెప్పుదు రాత్రింబవళు లెఱుంగనైతి, బూర్వపు నాటకంబు అన్నియు మఱచితి, నిద్దుర యేడుపొలిమేరలు దాటిపోయె, శాస్త్రవాక్యంబు లన్నియుం బరిహాసంబులుగానుండె, గలికామరాజులను సహితము మఱచితిని, విసుకులజ్జారోఁత మొదలగు హితోపదేశకర్తలప్పుడప్పుడు నన్నుందేర్ప

వలయునని వచ్చిరిగాని నా తిరస్కారవాక్యంబుల కడలి పాఱిపోయిరిట్లుండ, గామరాజ్యంబున మునుపటి వంటిమందిరంబు లనేకముతోఁచె. వానిలోఁ గొన్ని తెఱవఁబడి యుండుట వలన నే నొక్కొక్క మంది రంబునం జిరకాలంబు స్వేచ్ఛావిహారంబు సల్పితి నింతలో శరీరపటుత్వమను సహాయకారి నన్ను విడిచిపోయెనది యట్లుండ నాసద్మంబునంగల సుఖవ్యాధులనుతేళ్లుమండ్రగర్భలు ఘోరసర్పంబులు నన్నుఁగఱచెనత్తఱి నిట్లనియోజించితిఁ బంచశరమహారాజు గారి మందిరంబునఁ బ్రవేశించినదాదిగా నింతవరకు మహాసౌఖ్యదాయకంబని యెంచి మత్తుండనై చరించితి నిప్పుడు విషజంతువులబాధచేఁదల్లడ మందితి నిట్టిద్దోషంబులు గల వని మొదట నెఱుంగ నైతి నిం కేమి దోషంబు లున్న వో యని వెదుక నారంభించితి నటుపిమ్మట దుర్గంధంబును రక్తంబును మాంసంబు క్రొవ్వు కండలు యెమ్ములు నరములు పుసిగుబిలి తెమడ చీమిడి మలము మూత్రము చొల్లు తొమ్మిదిరంధ్రంబులు గానంబడియె నపానవాయువు లపారంబుగా రేఁగు చుండె. దానియథార్థం బెఱింగినప్పుడు రోఁతపుట్టెం గాని చిరకాలపరిచయంబుచే నప్పుడప్పు డమ్మందిరంబున కేగవలయు ననురుచి మాత్రము తగ్గ లేదు.

అంతట మన్మథమహారాజు గారీయుదంతం బెఱింగి తనశాసనంబు మీఱినందులకుఁ గోపించి దారేషణయను తనచెలికానిచేత నన్నుసం సారాటవింబడఁ ద్రోయించె నక్కాన యందు మొదట నాకలియను చీకటితోఁగూడిన పొట్టయను పాతాళగుహ యొక్కటి కానంబడియె. దానిం బూడ్చవలయునని ప్రయత్నించి శాల్యన్నము మొదలగు నాహార పదార్థములును కందు లులవలు పెసలు మినుములు మొదలగు సూప వస్తువులు నాకుకూరలు కాయగూరలు దుంపలు క్షీరాన్నము పాలు బెల్లము పంచదార రసాలాదిఫలంబులు వివిధంబులగు పిండివంటలు నేయి పెరుగు మాంసాదులునింకననేక పదార్థంబులు బహుసంవత్సరంబు లాబిలం బునఁబడవైచితి నిప్పుదార్థంబు లార్జించుటకు వ్యవసాయము వాణిజ్యము రాజసేవ భిక్షాటన చౌర్యము మొదలగు కార్యంబు లొనర్చితి నెన్ని

ప్రయత్నంబులు చేసిన నయ్యుదరబిలంబు పూడినట్లుండి కొంత సేపటి కెప్పటియట్లు లోఁతుగానే యుండె. దీనితోఁ గ్రిందుమీఁదగుచుండ నట్టి బిలంబుల నేకంబులుతోఁచె నింతలో నాశయనుదాహం బగ్గలంబయ్యె. దారిద్ర్యంబను పిశాచంబు భయంకరముగా గర్జింపుచు వెంటఁబడియె. నాధ్యాత్మికాది తాపత్రయదావాగ్ని ముట్టడించెఁ, బుత్రమిత్రకళత్రాదులను యెండమావులుతోఁచె, వాతపిత్తజనిత రోగంబులను పులులు సింగంబులు సివంగులు తోడేళ్ళెలుంగులు సాధ్వసంబుగా నఱచె, మనోవ్యాధులను ఉరు లన్నిదిశలయందుఁ గ్రిక్కిరిసియుండె, విషయంబులను పొదలు సందులేవు, బంధువులను గోమాయువులు కూయుచుండె, నస్మృతియను రాత్రియు దుర్జనసాంగత్యమను నమావాస్యయు నజ్ఞానంబను జీకటియుఁ బ్రాప్తించె, నాపత్తులను మబ్బులుగ్రమ్మె, నపవాదంబులను ఉఱుములును వివిధభయంబులను పిడుగులును దుఃఖంబులను వర్షధారాపరం పరలును సంభవించె.

నాసమయంబునఁ జిక్కువడి చీకాకుపడి యేమిచేయుటకుం దోఁచక తబ్బిబ్బునొందుతఱి భగవత్కటాక్షంబుచే వైరాగ్యంబను సూర్యోదయంబు కొంచెము కొంచెముగాఁగనిపించె. మంచిసెబ్రలను దిశలు ప్రకాశించె నంతలో నిక్కాననంబున నావలెం దిరుగుచున్న బద్ధ సంసారుల నేకులీల్గి పాపానుగుణ్యముగా నరకముకునుఁ బుణ్యానుగుణముగా స్వర్గమునకును బోయిరని విని నాకట్టి దర్దశరాకముందే శాంతి సుఖముఁ జెందవలముననికోరి రాగా నిమ్మహాత్మని దర్శనంబయ్యె.

భాగవతులు

అయ్యా ! నీవు చాలా ధన్యుఁడవు. కలి కామరాజులయొద్ద నుండి బయలుదేఱి సంసారాటవింబడి యెకాయెకి నిచ్చటికి వచ్చితివి. మే మట్లు కా దీ కానలోఁదిరిగితిరిగి జైన చార్వాక బౌద్ధ సౌరగాణ పతకాపాలిక శాక్తేయ మాయావాద పాషండాదిరాజ్యాధిపతుల నాశ్రయించి కొలిచికొలిచి సుఖంబు గానక తుద కీ విశిష్టాద్వైతరాజ్యపరిపాలకు లగుమణవాళమహామునుల పాదంబు లాశ్రయించి భగవత్క ల్యాణగుణానుభవ మనుమహాధనము

సంపాదించి పరమపదవిఁ బ్రాపించ గల మనుధైర్యముతో విఱ్ఱవీగు చున్నాము. మొదటి నీచే నాశ్ర యింపబడిన కలికామరాజులప్రభావం బిమ్మునీంద్రులు వక్కాణింతురు వినుము.

వరవరముని

బిడ్డా ! సుఖాసీనుండ వగు మని నియమించి యట్లొనర్చినపిమ్మట నతనితోఁ గలిరాజుప్రభావంబు వర్ణింతు విను మని యిట్లనియె :-

ఇక్కలిరాజు కృతత్రేత ద్వాపర యుగంబులం దెచ్చటనోయుండి యెప్పుడో ఒకప్పుడెవరినో యొకరిని మాత్రము వేధించుచుండెడు వాఁడు. కాని శ్రీకృష్ణుండవతారంబు చాలించి శ్రీవైకుంఠంబుజేరిన దినంబున భూలోకంబునకు వచ్చి ధర్మదేవతను దన్ని పరీక్షిన్మహా రాజుచే వ్రేటుదిని డాగి యమ్మహాపురుషుండు పరలోకగతుండైన పిమ్మట మరలవచ్చి భూలోకంబున నిరాఘాటముగాఁ బ్రభుత్వము చేయుచున్నా డతని ప్రభావంబేమని పక్కాణింపుదు, దుస్సంకల్పంబు లతని భార్యలు శన్యంగారకాది పాపగ్రహంబులు చెలికాండ్రు తమో రజోగుణంబు లతని ప్రధానులు. కామ క్రోధ లోభ మద మాత్సర్యంబు లతని చారులు. ఈర్ష్యా సూయాదంభాహంకారాదు లతని బంధువర్గము. చౌర్య ద్యూత పాన జారత్వాదు లతని సేనా సమూహంబులు. యితం డీ లోకంబునఁ బాదంబు మోపినదాది సంధ్యావందనంబులు సన్నగిల్లె, నగ్నిహోత్రక్రియలడగారె, హోమ ధూమంబ లదృశ్యంబులయ్యె, జన్నంబులు సన్నంబులయ్యె, దానంబులు హీనంబులయ్యె, సంస్కృతవిద్య చాటునడాగె, నాస్తికవాదంబులు ప్రబలంబులయ్యె, నకాలంబునందతివృష్టి, సకాలంబునం దనావృష్టి సంభవించెన వైదికసిద్ధాంతంబు లద్భుతంబుగా వెలసెఁ, బురాణశ్రణ పఠనంబులు రూపుమాసె, నక్కలిరా జెవ్వరియం దావేసించునో వారికి జారచౌర్యద్యూతపానంబులయం దభిలాషవర్ధిల్లు. ద్వాపర యుగాం తంబున వేల్పులనోడించు సామర్థ్యంబుగల యాదవులు పానమత్తులై పరస్పరకలహంబుచే మడిసిరి. బలరామకృష్ణులను మాత్రమీరాజుగారు సమీపింపలేడయ్యె నిభ్భూపతిరాజ్యంబునఁబ్రవేశించి యితనికి వశ్యులై

చెడినవారిలోఁ గొందఱి నెఱింగింతు నాలకింపుము. గుంటనక్క దీక్షితులవారిరువదివేల రూప్యంబుల వెలగల మాన్యమ్ము లమ్ము కొని జూదంబులాడి నిర్ధనుండై నశ్యమమ్మి జీవింపుచున్నాడు. మర్కట జోస్యులుగారు ఖర్వారెడ్డిగారు గాలం నాయుడుగారు మృగరాజు పందయ్యగారు మయూరం మల్లంరాజుగారు లక్షాధికారులైయుండి జూదంబులనోటుపడిన ద్రవ్యంబు చెల్లించుట కాస్తినంతయుఁ బోగొట్టుకొని మసాలా గారెలమ్ముచున్నారు. ఆవునేతి పిన్నయ్య, కందిపప్పు గన్నయ్య, చిఱునవ్వుల చింపరయ్య, కొల్లిసీటి మిల్లయ్య, పరాసుల నిరంజనము, బడాయికోరు తాటయ్య మేనాలెక్కి తిరిగినవారే కాని జీవనవృత్తులు పానంబునకర్పించి యిప్పుడు తోళ్ళుని చెప్పులు గుట్టు చున్నారు. బురదగుంట వానరయ్య, బుడారేకుల మామయ్య, పొత్తుల కుటుంబరావు, పుంజీగారెల బుజ్జియ్య, పూరీల యెజ్జియ్య భోగపదవులన్నియుఁ గోడిపందెమునకు ధారపోసి యన్నమున కాపన్నులై లక్ష్మణా యని మొఱపెట్టు చున్నారు. వారిసమాచార మట్లుండ నిమ్ము. కందర్పరాజుగా రన్నియుగంబులయందు నందఱి యందును పరాక్రమంబు చూపించు నట్టిమహాశూరుఁడతనికిఁ బరి కరంబు లల్పంబులు పనులద్భుతంబులు, యెట్లంటి వేని పుష్ప కోదండమహారాజుగారికి భార్య రతీదేవి, చెఱకుతుంటసింగాణి, తుమ్మెద యల్లెత్రాడు, పూవులమ్ములు, వసంతఋతువు చెలికాడు, పండువెన్నెల పూఁదోట, కీరంబు వాహనంబు, మరాళంబులు, కోకిలంబులు, నీలకంఠంబులు పరివారంబులు, యువతీమర్మస్థానంబులతనిమందిరంబులు, స్త్రీపురుషవియోగం బతని శరసంధానకాలంబు, పెంటిపోతులం గలపుటతని దినచర్య, సురతం బతని కార్యసాఫల్యంబు సుఖవ్యాధు లతని ధనాగారంబు లిట్టి మదనమహారాజ్యంబునఁ బ్రవేశించి పనిచేసిన వారిలోఁ గొందఱిని నీగుర్తున్నకై పేర్కొనియెద నాకర్ణింపుము.

నరకాసురుండు పదియాఱువేల కన్యలందెచ్చి చెఱలోనుంచి శ్రీకృష్ణునిచేఁజచ్చి వారినతని కర్పించె, దిలోత్తమకాశించి సుందోపసుందలొకరిచే నొకరు చచ్చిరి, రావణుండీ రాజుగారికి నమ్మకమైన బంటు; మన్మథభూపతి కితనియందుగల యభిమాన మెవ్వరియందు లేదని చెప్పవచ్చు

నీ దశకంథరుండు మదనుని శాసనంబు శివసావహించి పదివేలమంది భార్యలను స్వీకరించినది చాలక దేవగంధర్వకిన్నరకింపు రుష సిద్ధవిద్యాధరరాదికాంతల నేడిపించె నింతేకాక యిందిరావతార మగు సీతామహాదేవియను వీతిహోత్రజ్వాల నెట్లెట్లో సమీపించి తెచ్చి స్వకీయోద్యానవనంబున నుంచి యయ్యగ్నిజ్వాలలచే సమస్త భోగోపకరణంబులను లక్షమంది కొడుకులను మూడులక్షల మనుమలను కోట్లకొలఁది సేనలను భస్మంబుచేసుకొని తానును భస్మంబయ్యె. సైంధవుండెమ్ములవమ్మొనర్చుకొనెఁ గీచకుండుపకీచకులగు నూటైదు గురు తమ్ములతో నేకకాలంబునందెగె.

నియ్యనంగరాజ్యంబునఁ బ్రవేశించుటవల్లనే రాజరాజనరేంద్రుండు చిత్రాంగికి వశ్యుఁడై యకృత్యంబొనర్చె నుత్తానపాదుండు సురుచిం గొలిచి ధ్రువు నరణ్యమునకుఁబనిచె. నింద్రుండు నిలువెల్లు యోనులుగలవాడయ్యె నగ్ని హోత్రుండు మునిపత్నులకై పరితపించె. విశ్వామిత్రుండు మేనకా వశుఁడయ్యె. వాయుదేవుండు కుశనాభపుత్రికలకై వ్యాకులంబొందె. బృహస్పతి మఱదలింగోరె. దమయంతి నాశించి కిరాతుండు నీఱయ్యె. శచీదేవినివలచి నహుషుండు దేవరాజ్య పదభ్రష్టుండై నదిగాక కొండచిలువయయ్యె. బైవారిలో మునీశ్వరులు దేవతలు సమర్థులు గాన మొదటఁ గామరాజ్యంబునం బ్రవేశించియుఁ దుచ్ఛంబని రోసి స్వస్థానంబుజేరి సుఖించిరి. కాని సామాన్యులు మాత్రము పైకి లేవజాలరిక్కాలంబున నా రాజ్యంబునఁ బ్రవేశించి చెడినవారు లెక్కకు మిక్కుటంబుగా నున్నారు. వారిలోఁ గొందఱి నెఱింగింతు వినుము. ప్రస్సాబత్తుల చిన్నయ్య శశిరేఖ యను వేశ్యకు దాసుఁడై లక్షరూప్యములజీవన మామె కర్పించి వ్రణరోగము సంపాదించినాడు. ప్లవంగావధానులుగారు మనోరమకు వేలకొలది బంగారువస్తువులు సమర్పించి పకోడిదుకాణముల కెకిమీడైనాడు. కాని రేకుల తుంటయ్య పిత్రార్జితం బగునూఱుయెకరముల సుక్షేత్రము పింగళ కర్పించి బీడీలకట్టలప్రభుత్వము సంపాదించినాడు. సురంగము దామరాజు స్వీయాగ్రహారంబు బాలమణికి ధారవోసి భల్లానివారింట నంట్లు

తోముచున్నాడు. కామేశ్వరలింగము తురంగాచార్యులు కొమ్మపనసదీక్షితులు ఈ రాజ్యంబును నౌకరి చేసి చేసి ముక్కులు పోగొట్టుకొని శరీరములు వ్రణమయములు కాగా నిప్పు డిప్పుడు స్వగృహంబుల జేరి భార్యల పుట్టింటసొమ్ముచే జీవనము చేయుచున్నారు.

సుశీలుఁడు

స్వామీ ! కలి మన్మథమహారాజులకడ నింతమోసమున్న దని యింతవర కెఱుంగ నైతి. దేవరవారి దివ్యానుగ్రహంబుచేఁ దెలుసుకొంటి భయం బగుచున్నది.

వరవరముని

భయపడనవసరములేదు. పడవలసిన బాధలు పడితివి గాని గొప్ప మోసము తప్పించుకొంటి వందులకు సంతోషమగుచున్నది.

సుశీలుఁడు

అదేమోనానతిండు వినగోరుచున్నాను.

వరవరముని

పై రాజులశాసనం బామరణాంతంబు వహించిన వారి నారాజులు దక్షిణ మేజస్ట్రీటుగారియొద్దకుఁ బంపింతురు.

సుశీలుఁడు

స్వామీ! ఆరాజుగారిచెంతనుండు విశేషము లేమి ?

వరవరముని

ఆ విశేషములనంతముగా నున్నవి. అక్కడకేగినవారికి మొట్ట మొదట నెత్తురు, చీము, వెంద్రుకలు, మలమూత్రములతో నిండినవై తరణీనదియందుస్నాన మటుపిమ్మట సంయమీనగరప్రవేశము, మూడామడపొడువు భయంకర శరీరము, కోఱమీసంబులు, చీకటి నూతుల వంటి కన్నులు, భయంకరాకారంబునుంగల యమధర్మరాజుగారి దర్శనము.

సుశీలుఁడు

అబ్బా ! యింతకష్టమున్నదండీ నే నేమోయనుకొన్నానే. అటు పిమ్మట యేమిజరుగును?

వరవరముని

దక్షిణమహారాజుగారి యొద్దకుఁ గలికామరాజులు ఇదివరకుఁబం పించిన రికార్డులు కొన్ని వినియుంటిమి. వాని సమాచారంబు దెల్పెద వినుము. పై రాజులచేత పంపబడిన ముద్దాయిలను చూచిన తత్క్షణమే ధర్మరాజుగారు తమకరణమగు చిత్రగుప్త గారినిఁ చిలిపించి వీరివృత్తాంతమేమని యడిగెను.

చిత్రగుప్తుగారు

అయ్యా ! కలికామరాజు లేకీభవించి న్నిటిదినము టపాలోఁ గొంతరికార్డు పంపించిరి.

ధర్మరాజు

అయ్యా ! యేదీ? ఆరికార్డు చదువండీ.

చిత్రగుప్త :- మహారాజరాజశ్రీ దక్షిణదిక్పరిపాలకులై ధర్మదేవతాస్వరూపులై పుణ్యపాపవిమర్శనశీలురై చతుర్దశ భువనాత్మక హిరణ్యగర్భాండస్థ సర్వభూతసమూహ శిక్షాచతురులగు యమధర్మరాజు గారి దివ్యసన్నిధానమునకు.

కలికామరాజు లేకీభవించి వ్రాసుకొను విజ్ఞాపనమేమనగా, అయ్యా! మా యాఫీసునుండి యీనాడు పంపించిన రికార్డులోని విశేషము లేమనగా మారాజ్యములోఁ బనిచేయువారలు మూడుతరగతులుగా నున్నారు. మొదటి తరగతివారు పాపనిష్ఠులు, రెండవ తరగతివారు పుణ్యశీలురు. మూడవ తరగతివారు విష్ణుభక్తులు. వారి ముప్వురిలోఁ బాపనిష్ఠులు మారాజ్యములో బహుకాలముద్యోగముఁ జేసి యకృత్యకరణ, కృత్యాకరణ, భగవదపచార, భాగవతాపచార, అసహ్యాపచారంబుల యందుఁబూర్ణప్రజ్ఞను సంపాదించి మాచేగొప్ప గొప్ప యోగ్యతాపత్రములును, పతకములును సంపాదించి యున్నారు. వారలనుబహుమానముల నిమిత్తమై దేవరవారి సన్నిధికిఁ బంపించు కొంటిమి. కనుక మీరుచక్కగా విచారించి, వారికి యాతన శరీరంబులను మంచికవచంబులను, నరకవాసమును పెన్షను నిప్పించ

వలయును.

రెండువతరగతివారగు పుణ్యశీలురు మారాజ్యములో నుండియు మాచట్టమునకు విరుద్ధమై తీర్థయాత్రాచరణము, పుణ్యకథాశ్రవణము దానధర్మములు, యాగాదిక్రతువులు, కృచ్ఛ్రాంద్రాయణాది వ్రతములు సత్రనిర్మాణము మొదలైననేరములు చేసినారు కనుక వారలను చీవాట్లు పెట్టిపై కోర్టువా రగుదేవేంద్రమహారాజుగారి సన్నిధికి విచారణకొఱకుఁ బంపించవలయును.

మూడవతరగతివారగు విష్ణుభక్తులు మారాజ్య మర్యాదలు విడిచి యతిరాజులవారికాలమునుండి విశిష్టాద్వైతరాజ్యములోఁ బ్రవేశించి మాకును మీకును వశులుగాక వ్యర్థులైనసంగతి మీకు విశదమైయున్నది. కాని యా నికృష్టులు మా శాసనముదప్పి చరించిననాట నుండియు సుఖమునకు దూరులైనారెట్టులనగా

దేహబలమునిచ్చునవియు మిక్కిలి రుచియునుగల మాంసాహారంబు లభించుటలేదు. తన్మయత్వము జెందునట్టు లానందమిచ్చు కల్లు సారాయము గంజాయి నల్లమందు మొదలైన దివ్యౌషధులు వారికిఁ బ్రాప్తించుటలేదు. వలచిన స్త్రీలతో నైనను భార్యలతో నైనను నిరాఘాటముగా భోగించునట్టిభాగ్యంబు వారికిలేదయ్యెఁ బరుపులు బాలీశులు తివాచీలు మేడలు మిద్దెలు వారికసహ్యములు. పుష్పంబు లత్తరు పునుగు జవ్వాది సంకుమదము చందనము కర్పూరము తాంబూలము కస్తూరి మొదలగు సుగంధద్రవ్యములు నల్లరాతిబొమ్మలకు నిత్తడి రాగిబొమ్మలకు సమర్పించి పరిమళము పోయినపిమ్మట ధరించు వ్రాంతయేకాని స్వయముగా భోగించు భాగ్యంబు వారికి లేదాయె. మొగంబునఁ గస్తూరి తిలకంబునకు మాఱుగాఁ దెల్ల మట్టి సుద్దయుఁ బసపును ధరింతురు. మెడలో బంగారు భూషణములకు మాఱుగా దొళశికొయ్య ముక్కలుదాల్చుచున్నారు. మఱియు వారి వెఱ్ఱితనం బేమని వక్కాణింతుము. భోగంబు లశాశ్వతంబులట, దేహంబులు బుద్బుదంబులట, శ్రుతిస్మృతీతిహాసపురాణముల కనుకూలముగా నడువవలయునట, అర్థపంచకమట, అష్టాదశరహస్యంబులట, ద్రావిడ

వేదపఠనశ్రవణంబులట, భగవద్భాగవతాచార్య కైంకర్యంబులట, భక్తి ప్రపత్తులట, యేమిటి వాళ్ళపిండాకూడు, వైదికమునకుఁ జాదస్తముతో మూడుహస్తంబులన్న సామెతకు సరిపోయినది.

కాని యాబాధలు పడలేక కూచిమతస్థులని కొందఱు వారిలో నుండిచీలి పైకిమాత్రం విశిష్టాద్వైతరాజ్యముపైఁ గపటప్రేమ కనపరచుచు మా రాజ్యములోఁ బ్రవేశించి లెస్సగాఁ బని చేయుచుండిరప్పుడు రామానుజ సంబంధులకును మాకునుఁ గూచిమాచి మతస్థులవిషయమై మావారంటే మావారను వివాదంబుగలిగి చాల కాలము వ్యాజ్యము జరిగినది. తత్సమయంబున రామానుజీయులు వివేక మహారాజుగారియొద్ద దావావేసి శాస్త్రవాదమను ప్లీడరుగారినిఁ దీసి కొనివచ్చిరయ్యుదంతంబు మే మెఱింగి రాజుగారికినిఁ బ్లీడరుగారికినిఁ గోపంబును లంచంబుపెట్టితిమి. లంచముదిన్న కారణంబున వాదితరపు ప్లీడరు మాపక్షముగా హీరింగుచేసి, లా, కనపర్చిరంతట వివేక మహా రాజుగారు సహితమదేవిధముగా సమ్మతించియిచ్చిన తీర్పేమనఁగాఁగూచిమాచి మతస్థులు బాహ్యంబున రామనుజీయ చిహ్నంబులు ధరించినంతమాత్రంబునఁ బ్రయోజనంబు లేదు. మైథున కైంకర్యంబులు త్రివిధప్రసాదంబులు, ద్వయవస్తువులు, రవికల యుత్సవంబులు జల పుష్పంబులు, తిరుపత్తీగలు, మెడసన్నపు గోవిందులు, ఉగ్గపు పెరుమాళ్లు, స్మశానభోజనంబులు, ద్వాదశమల ఫలాహారంబులు ప్రధాన ముగా నంగీకరించినవారుగానఁ గలికామరాజులకే హక్కుగాని రామానుజీయుల కెంతమాత్రము హక్కులేదని తీర్మానించి రాతీర్పువిని రామానుజీయులు మొగంబులు వ్రేలాడవైచుకొని ఖర్చుల ద్రవ్యంబును మహోత్సాహంబు మాకిచ్చి వారిత్రోవనుబోయిరి. ప్రతికూలురగు రామానుజీయులను మేము పూర్తిగావదలుకొని యనుకూలురగు కూచిమాచి మతస్థులను మీకడకే పంపించినాము. పాపనిష్ఠులతోఁబాటు వీరిని కూడా మీ చిత్తానుసారముగాఁజేయుడు. ఇట్లని చిత్రగుప్తుండు చదువఁగా దక్షిణదిగధిపతి పుణ్యశీలురను మాత్రము దేవేంద్రమహారాజగారి సన్నిధికిఁ బంపించిరి. తక్కిన వారినిఁ జక్కగా విచారించి మీరు భూలోకంబునం

బుట్టినదాదిగాఁ గలికామరాజుల రాజ్యములలోఁ బనిచేసినందున గొప్పగొప్ప బహుమానము లీయవలసియున్నది. కావున యాతనాశరీరకవచంబులు ధరించి నరకస్థానం బులకేగి పాపంబులను బత్తైపుడబ్బులైనదాఁక ననుభవింపు డటుమీఁద మానవులలోఁ జెవుడు గ్రుడ్డి రోగబాధలు దారిద్ర్యంబునుం గల శరీర కవచంబులును పశుపక్షిమృగాది శరీరకవచంబులును రాగలవని చెప్పి నరకస్థానంబులకుఁ బంపగాఁ బాపనిష్ఠులచ్చోటికి వెళ్లి రచ్చటఁ గుంభీపాకము క్రిమిభక్షణము లాలాభక్షణము రౌరవము మొదలగు డెబ్బది రెండు వేల విధంబులై నరకంబులు కానంబడె. నటుపిమ్మటఁ గాత్రేడు కోకలు, గొంగళ్లు, నీలికోకలు, కొంకికత్తులు, గొడ్డళ్లు, గడ్డపారలు ధరించి దోనెలవంటి కడుపులు, చేటలవంటి చెవులు, తాటిచెట్లవంటి కాళ్లు, చీకటి నూతులవంటి కన్నులు, గడ్డపారలవంటి నరములు, పాఱచిప్పల వంటి దంతములు కాలాగ్నివంటి తీక్ష్ణంబునుంగల కాలకింకరులు తోఁచి యప్పాపనిష్ఠులకుఁ బాపానుసారముగా వేదనలను బహుమతు లీయసాగిరి. ఈ విషయమును ధర్మశాస్త్రమహారాజుగా రప్పుడప్పుడు మాకుం దెలియపర్చుచుందు రట్టిదుఃఖంబులు తప్పించుకొని వచ్చితివి.

సుశీలుఁడు

దేశికశిఖామణీ ! జీవునకు భూలోకంబునందును నరకంబునందును గర్భనరకంబునందును పుణ్యక్షీణకాలంబున స్వర్గంబునందును భాధలే కలుగుచున్నవొకప్పుడును నిర్భరానందము కానంబడ దొక్కచోట నైన నిల్కడ లేదు. దిగులు లేనిగడియ లేదు. ఆహారము లేనప్పుడాకలి బాధింపుచున్నది. కడుపునిండినప్పుడు నిద్దుర డీకొనుచున్నది. అది తీరగానే కామక్రోధాదులు కల్వరపెట్టు చున్నవి. వానితో బోరుచుండ దారిద్ర్యయంబు తట్టుముట్టుగు చున్నది. దానతోఁబీకులాడు చుండఁగాఁ బెక్కుదిగుళ్లు పిక్కటిల్లు చున్నవి. రోగంబుల కంతము లేదు. వ్రణములకుఁ బరిమితి లేదు. పోట్లాటకు దరి లే దాశలకుఁ బొలిమేర లేదు. పనులకుఁ బ్రొద్దు చాలదు. ఆలోచన లద్భుతముగా నున్నవి. ఫలములు బహు స్వల్పముగా నున్నవి. పరస్పర సంబంధంబులు పరిహాసాస్పదముగా నున్నవి. బ్రతుకు నిత్యములేదు.

గొంతెమ్మకోరికల కంతములేదు. చచ్చినవానిం బారవైచి చావఁ బోవువాఁడు విఱ్ఱవీగుచున్నాడు. ఈనాటివాడు ఱేపు లేడు. ఱేఁపటి వాఁడెల్లుండి కానరాడు. ధనంబులు మెఱపులుగా నున్నవి. దేహంబులు బుద్బుదములుగా నున్నవి. భోగంబుల సంగతి విచారింపఁ బనిలేదీసంసారంబు గారడివలె స్వప్నంబువలె నెండమావులభంగి నస్థిరంబుగా నున్న దీశరీరికింతేమార్గమా వేఱొక సుఖమార్గమున్నదా?

వరవరముని

నాయనా! నీవు చెప్పినదంతయు నిక్కంబు, దీనిలో సందేహంబులే దైనను సుఖమార్గంబు గలదు.

సుశీలుఁడు

వీనికన్న సుఖమార్గమున్నచో నొక్కరైన నాచరించువారు లే రందఱు సంసారమార్గంబునే నడచుచున్నారే ?

వరవరముని

శరీరులాచరించునది లాడోబేడో శీఘ్రమున ఫలించును. నేను వచించునది చిరకాలంబునకు ఫలించు నక్కారణంబున నెవ్వరు దీని కీయకొనరు.

సుశీలుఁడు

అమ్మార్గంబు శాశ్వతానందప్రదమైనచో నేనాచరింతు నాన తిండు.

వరవరముని

ప్రథమంబున లోకంబునంగల దోషంబులెఱుంగవలయు నటుపై వైరాగ్యంబొదవు. నామీద సదాచార్యునాశ్రయించి శుశ్రూషచేమెప్పించి యతండుచెప్పినదంతయు సత్యంబని నమ్మవలయు.

సుశీలుఁడు

మీరు మాకు గురువులుగనుక మీవాక్యంబులన్నియు సత్యం బని సమ్మోదను వక్కాణింపుడు.

వరవరముని

సంసారాతపంబున బడలినవారి కాశ్రమ నివారించుట కొక కల్పవృక్షంబుగలదు. దాని నాశ్రయింపవలయు.

సుశీలుఁడు - ఆ వృక్షం బెచ్చటగలదు ?

వరవరముని

చతుర్దశభువనాత్మకమై పంచాశత్కోటియోజన విస్తీర్ణంబగు లీలావిభూతియందును నిత్యవిభూతియందును వ్యాపించియున్నది.

సుశీలుఁడు

నేనీ లీలావిభూతిలో బహుకాలమునుండి తిరుగుచుంటి నొక్క నాడైనం గానరాదే!

వరవరముని

ఆ వృక్ష మజ్ఞానమను చీకటిలోనున్న వారికిఁ గానరాదు. విపరీతజ్ఞానమను నేత్రరోగముగలవారికి విపర్యాసముగాఁ దోఁచు. నర్థపంచక జ్ఞానమను దివ్యాంజనము గలవారి కున్నదున్నట్లు గోచరించును.

సుశీలుఁడు

అప్పాదపమునకు విశాలమెంత? పొడవెంత? యేరంగుగా నుండును?

వరవరముని

విశాలముగాని పొడవుగాని తెలియదు. పరిమాణము లేదు. దానికి వేఱొక యాధారంబు లేదు. ఆదిలేదు. మధ్యాంతములు లేవు. వృద్ధి క్షయంబులులేవు. తొఱ్ఱలులేవు. జీర్ణస్వభావములేదు. కత్తులకు గొడ్డళ్లకుఁ దెగదు. వానచే నానదు. దావాగ్నికి లక్ష్యము చేయదు. భూమ్యా కాశ జలంబుల సహాయం బనవసరంబు. గాలికూగులాడదు. నీలపు రంగుగా నుండును.

సుశీలుఁడు

కల్పవృక్షము తెల్లనిదందురే. మీరు నీలవర్ణమని చెప్పుచున్నారు.

వరవరముని

తెల్లనివృక్షము స్వర్గలోకమునందుమాత్రముండును. నిత్యసంసారుల కుపయోగించును. యాచకులకీయ లేక వెలవెలఁ బాఱినదీవృక్షము. కొఱతలేకుండ నిచ్చునదిగానఁ బ్రావృట్కాలవలాహకంబుభంగి మిసిమి దేలుచు నీలవర్ణముగా నున్నది.

సుశీలుఁడు

అబ్బాయియావృక్ష మున్నదని యిదివరకెవ్వరును చెప్పలేదే ! దానిపేరేమండీ ?

వరవరముని

దాని కనంతనామములు గలవు. వలసినచో ననేక రూపంబులుగా మాఱుచుండు నది విష్ణువని, వాసుదేవుఁడని, గోవిందుఁడని, నారాయణుఁడని ముఖ్యనామంబులుగలది. మఱియు దాని ప్రభావంబు సాకల్యంబుగా నెఱుంగుటకు నాకు శక్యంబుగాదు. సరేకదా! శ్రుతి స్మృతీతిహాసపురాణంబులకు వేదాంతంబులకుఁ జతుర్ముఖ, పంచముఖ, షణ్ముఖ, సహస్రముఖ, సహస్రాక్షులకును వాగ్దేవికిని, దేవమునీంద్రులకును వాచస్పతికినిఁ దరంబుగాదు. అయినను సముద్రమున దోసెడు జలమున్నదనియు, మేరువులోఁ బిడికెడు సువర్ణమున్నదనియుఁ జెప్పినట్లు తెలిసినంతవరకు వక్కాణింతు నన్నారాయణ కల్పవృక్షమునకు నాదిలక్ష్మియను బంగారుతీగె సర్వత్ర పెనచుకొని యున్నది. వృక్షం బొక్కటియైననుఁ బాదతల హస్తతలంబు లనెడు కెందామరలును, వ్రేళ్లను నెఱ్ఱకలువరేకులును, దంతపంక్తులను మల్లెపూవులును, నాసికయను సంపెంగ పూవును, పెదవులను మంకెనపూవులును, మార్దవమను దిరిసెనపూవులును, పరిమళంబను పాటలపుష్పంబులును గలిగి శోభిల్లుచున్నది. మఱియు నప్పాదపంబు పాదాంగుళులను వేఱులును, పాదంబులను ప్రకాండంబును, బాహువులను శాఖలును, కరాంగుళులను ఉపశాఖలును, హాసంబులను పుష్పంబులును, విలాసంబులను చిగురుటాకులును, చిత్రలీలలను తీయనిఫలంబులును, కల్యాణ గుణంబులను తేనెతెట్టెలను, సర్వాధికమను పొడవును, దయారసంబను విస్తీర్ణంబును, పరాక్రమంబను రక్త కుసుమంబును, సర్వభూత సంరక్షణంబను నీడయు, సౌందర్యంబను దట్టంబును, కవిస్తోత్రంబులను పత్రంబులును గలిగి ప్రకాశింపుచున్నది. వెండియు నక్కల్పకంబు నిత్యవిభూతిలోఁ బరమపద నాథుండనియు, వ్యూహంబులలో వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధులనియు, విభవంబులయందు రామకృష్ణాదులనియు, భూతముల కాధారపడినప్పుడు

సర్వాంతర్యామియనియు, భక్తులకు గోచరించునప్పు డర్చావతారంబ నియుఁ బ్రఖ్యాతిఁ జెందియున్నది. యింకోక్కతఱి సభ్భూరుహంబు పదతలకర తలంబులను కెంపులును, వ్రేళ్ళను పవడపుఁదీవెలును, నెఱికురులను యింద్రనీలరత్నంబులును, దంతంబులను వజ్రంబులను, భుజంబులను తరంగబులును, లోచనంబులను మత్స్యంబులునుఁ, బిక్కలను మకరంబులునుఁ, బాదంబులను, కచ్ఛపంబులునుఁ, దేజస్సను జలంబును, గాంభీర్యంబనులోఁతునుంగలిగి రత్నాకరంబుతేవంబ్రకాశింపు చున్నది. వేఱొకతఱిఁ గల్యాణగుణంబులను రత్నంబులును, గాంభీర్యం బను గుహయు, సౌందర్యప్రవాహంబను సెలయేళ్లును, చిద్విలాసంబులను వేల్పులును, నేత్రంబులను సూర్యచంద్రులును, నఖంబులను నక్షత్రంబులును, లక్ష్మియను సువర్ణంబును గలిగి మేరువురీతి విలసిల్లు చున్నది.

సుశీలుఁడు

ఇదివరకవ్విష్ణ్వాఖ్య కల్పకంబు నాశ్రయించి కృతార్థులైన వారెవ్వరైనం గలరేమో యెఱింగింపుడు ?

వరవరముని

దాని నాశ్రయించి కృతార్థులైన వారు కోట్లుగలరు. వారినందఱివక్కాణింప నాతరంబుగాదు. నీనమ్మకమునకుగానుఁ కొందఱి బేర్కొని యెద నాకర్ణింపుము. నారాయణకల్పకము నాశ్రయించి బ్రహ్మరుద్రేంద్రాదిఖగంబులు తన్నామంబులు కల్యాణగుణంబులను ఫలంబు లారగించి జీవింపుచున్నవి. వ్యాసుండు వేదవ్యాసుండయ్యె, శుకుండు యోగిజనాగ్రగణ్యుండయ్యె, ముప్పదిమూడు కోట్ల నిర్జరులమృతంబు ప్రాపించిరి. వసిష్ఠుండు సర్వలోకపూజ్యుండయ్యె, నైమిశారణ్యంబునఁ బదియారు వేల ఋషులొక్కసారి ముక్తిఁగైకొనిరి, నారదుం డప్రతిమప్రభా వుండయ్యెఁ, బ్రహ్లాదుం డాహ్లాద భాజనుండయ్యె, బోయ తపస్వియై శ్రీమద్రామాయణంబు రచించి కవిజనాగ్రగణ్యుండయ్యె. ధ్రువుఁడు శాశ్వత రాజ్యంబు సంపాదించె, నంబరీష రుక్మాంగదులు మొదట రాజ్యసుఖంబులు పిమ్మట మోక్షసాంబ్రాజ్యంబునుఁ బొందిరి. అమ్మహా కల్పకంబు నిత్య విభూతిలో స్థావరముగాను లీలావిభూతిలో జంగమ స్థావరములుగానుఁ బ్రకాశించు

నక్కారణంబునఁ ద్రేతాయుగాంతబున సూర్యవంశంబను పూఁదోఁటలో రామాఖ్యఁగైకొని జనించె. లక్ష్మిసీతాఖ్యలతయై యావృక్షంబునుఁబెనచు కొనియెనప్పు డమ్మహీరుహమును బరివేష్టించి భరత లక్ష్మణ శత్రుఘ్నులను మంచి శాఖలు వృద్ధిఁజెందె నారామాఖ్య కల్పకంబునుఁ గొల్చి విశ్వామిత్రుండు యాగంబు రక్షించుకొనియె. నహల్యశాపంబు వాపుకొని భర్తంగూడె. దండకాటవియందు మునికోకిలంబులు సుఖించె.

గుహుండుశబరి జటాయువు శరభంగుఁడు మొదలగు తుమ్మెదల వ్వనస్పతియందుఁగల్యాణగుణక్షౌద్రంబులుగ్రోలి నిత్యానందంబుఁజెందిరి. సుగ్రీవవిభీషణు లఖండరాజ్య వైభవంబులందిరి. సుబాహుమారీచ తాటకా విరాధ ఖరదూషణ త్రిశిర కబంధ రావణ కుంభకర్ణ ప్రభృతిరాక్షసమూషికంబు లవ్విటపియందలి ద్వేషంబుచూపించి దానియందుఁగల బాణసర్పంబులచే నీల్గె నయ్యనోకహంబు నాశ్రయించి హనుమంతుండు భావిబ్రహ్మమయ్యె. డెబ్బదిరెండువేల్వల వానరులు కృతార్థులైరి అయోధ్యాపురవాసులను విష్కిరంబులు పునరావృత్తిరహితమైన దివ్యపదవిం బ్రాపించి రగస్త్యాదిమహామునులు తమతమకోర్కెలు నెఱవేర్చుకొని రింతేకాక యా రామాఖ్యకల్పభూజంబునందు రామాయణంబును పేరుగల యొకతేనె పెరజనించి ముల్లోకంబులయందును భోక్తలగువారి నుద్ధరింపుచున్నది. ఆతేనెపెరకు నీగలుగాని పుడకలు గానిపురుగులతుట్టెగాని మైనముగానిలేదు. బద్ధసంసారులను లంకనముల రోగుల కప్పెరలోని తేనె కొంచెముతీసి రామనామౌషధంబునకు నుపరసంబుగా నిచ్చినయెడల జనన మరణములను రోగములు నశించు నాతేనెతెట్టెలను రామాఖ్యవృక్షమునుండి వాల్మీకియను వైద్యుండు తీసి పండితులకుఁ గవులకుఁ బంచిపెట్టినాడు. ఆ రెండు తెగలవారిప్పటికి దానినే సంసారిరోగులయందు వాడి వారికి మోక్షారోగ్యమునిచ్చి తామును మోక్షంబు జెందుచున్నారు.

మఱియు నారాయణకల్పకము చంద్రవంశమును చందనారణ్యంబునఁ గృష్ణాఖ్యచే నవతరించె నా కృష్ణాఖ్యద్రుమంబును లేఁబ్రాయంబున గోపికాలతాసమూహంబు లాక్రమించె నటు పిమ్మట నావృక్షంబు రాధికయను తీవచే నాక్రమింపఁబడి పెరుగు చుండ దానినిఁ గుబ్జయను పొట్టితీవయు,

రుక్మిణీ, సత్యభామ, కాళింది, ఆగ్నజిత్తి, లక్షణ, భద్ర, జాంబవతి, మిత్రవిందయను పవడపుతీగె లల్లుకొనియె. సంతేకాక షోడశ సహస్రాంగనా వల్లీ సమూహంబు లాకృష్ణశాఖింబెనచుకొనియె నదియట్లుండ సాత్యకిబల రామధర్మజ భీమార్జున నకుల సహదేవ చందనవృక్షంబులా కృష్ణతరువును స్నేహభక్తిప్రేమలను శాఖలచే నొరసికొనుచుండె. విదుర సంజయోద్ధవా క్రూరశ్రుతదేవ బహుళాశ్వమాలాకార ప్రభృతి భక్తబంభరంబులందలి పుష్పరసంబు లాస్వాదించి ఝుంకారధ్వనులు చేసినవి. శుకవ్యాసులను నిద్దఱు వైద్యులామ్రానియందలి చిద్విలాసంబులను తేనెపెరల నాశ్రయించి యందలి తేనెను దీసి భారత భాగవత హరి వంశంబులను భాండంబులందు నింపి పండిత శిఖామణులను భోక్తల కొసంగిరి. వెండియు నమ్మహీరుహంబునందు గీతాశాస్త్రమును మకరంద నదీప్రవాహ మొకటి బయలుదేఱి పండిత మనస్సులను పైరులు పెంచి మోక్షమను ధాన్యమును పుష్కలముగా నిచ్చుచున్నది.

పూతనా శకట తృణావర్తారిష్ట ధేనుక బక ముష్టిక చాణూర శిశు పాల దంతవక్త్ర సాల్వ జరాసంధ పౌండ్రక వజ్రనాభ హంస డిభకాది గంధసింధురంబులు దురభిప్రాయంబుచే నా చెట్టును సమీపించి దాని కోపంబను సింహగర్జనంబుచేఁజచ్చె. నమ్మహీరుహమందలి నిగ్రహమను నిప్పుమంటలచేఁ బదునెనిమిది అక్షౌహిణులజనంబులను శలభంబులుగాలె నావృక్షంబు స్థావరముగా జంగమముగా నుండుశక్తి గలది గనుక కొన్ని నాళ్లు వ్రేపల్లెలోను, గొన్నినాళ్ళు మధురలోనుఁ గొంతకాలము ద్వారకయందును నివసించె నీమ్రానియందలి కనికరమను పైరగాలి కొంచెము విసరగా ద్రౌపదికి మితిలేని వస్త్రంబులును గుచేలునక పారద్రవ్యంబునుఁ గుబ్జకు సౌందర్యాదులును గరతలామలకంబులయ్యె.

నాకృష్ణద్రుమంబునందు శంఖ చక్ర గదా ఖడ్గ శిలీముఖంబులను వీతిహోత్రజ్వాలలుగల వాజ్వాలలావృక్షంబు నందున్నప్పుడును భక్తులపైఁ బ్రసరించునప్పుడును శీతస్పర్శగల వైయుండును ప్రతికూలురపై వ్యాపించునప్పుడు కాల్చి వినాశము చేయును.

ఆద్రుమంబునందు నిగ్రహమను వడగాలియు ననుగ్రహంబను మలయమారుతము నప్పుడప్పుడు జనించుచుండు నిగ్రహగ్రీష్మవాయువుచేఁ బ్రతికూలురు దుఃఖింతు రనుగ్రహమలయమారుతంబుచే నను కూలురు సుఖింతురు. వెండియు నీ సాలంబునం దనాదినుండియు మాయయను భూతంబొకటి కాపురము చేయుచున్నది. ఈ భూతావేశంబువలనే జ్ఞానుల హీనులుగాఁబండితులపండితులుగా విరాగులు సరాగులుగా ముని లంగనాలోలురుగా మాఱుచున్నారభ్భూతంబు కల్పంబులను నిమిషములుగా నిమిషంబులను గల్పములుగా జీవులను తోలుబొమ్మలుగాఁ దిర్యక్కులుగా మనుష్యులుగా దేవతలుగా మునులుగా మార్చుచున్నది. మఱియు నభ్భూతంబు శాశ్వతానంద ప్రదమగు మోక్షమునకు మార్గమీయదు. దుఃఖప్రదముగు సంసారమునకుఁ ద్రోవచూపుచున్నది. జీవులకుఁ బరస్పరానురాగ మన్యోన్యవైరము కలిగింపుచున్నది. తనరూపముగాని తానుండు చోటుగాని యెవ్వరికిం దెలియనీయదౌరా యీవిష్ణుమాయచేత మోహింపఁబడి నారదుండు స్త్రీరూపియై బిడ్డలంగనియె. దేవేంద్రుండు రాలవాన గురియించి పరాభవంబుఁజెందె. రుద్రుండు బాణునిం గావ యత్నించి మూర్ఛిల్లి తెలిసె. విరించి గోవత్సార్భకుల నంతర్థానంబు చేయించి గోడు గుడిచె. విష్ణు మాయకు లోబడి కొందఱు నాస్తికులైరి. కొందఱు భగవద్భాగవత దూషణచేసిరి. కొందఱెండమావులవంటి సంసారసుఖంబులు శాశ్వతంబనిరి. కొందఱ వైదికసిద్ధాంతంబులు మోక్షప్రదంబనిరి కొందఱసత్య కావ్యంబులు నిర్మించిరి. కొందఱు గొబ్బిపూదేనెవంటి స్వర్గసుఖంబుల కాసించిరి. కొందఱు వేదంబుల ప్రమాణంబనిరి. కొందఱు ప్రత్యక్షముగాఁ దోఁచుజగత్తు మిథ్యయనిరి. కొందఱు జ్ఞానశక్తి బలైశ్వర్య వీర్య తేజస్సులుగల రామకృష్ణావతారంబులను మనుష్యమాత్రులనిరిదియంతయు విష్ణుమాయా ప్రభావంబని యెఱుంగవలయు.

టక్కుటమారము గజకర్ణ గోకర్ణ యింద్రజాల మహేంద్రజాలాది మాయలును, కలిమాయ మన్మధమాయ రాక్షసమాయ దేవతామాయ లీ విష్ణుమాయకు బానిసలై సూర్యునిముందఱి మిణుగురుబూచులవలె నుండును. పసివారు పాలుద్రావుట యువానులు మదోన్మత్తులగుట,

కౌమారులు సంస్కృతిబద్ధులగుట, ముదుసలివారాయు ర్వృద్ధిఁగోరుట, యీనినప్పుడుదూడల నావులునాకుట, దూడలావుల పాలు గ్రోలుట విష్ణుమాయాప్రభావంబని యెఱుంగుము. కామక్రోధలోభమదమాత్సర్య యీర్ష్యాసూయాదంభాహంకారాదులును క్షుత్పిపాసాదు లవ్విష్ణుమాయా కల్పితంబులు, ధనమద విద్యామద కులమదంబులును విషయ వాంఛలును, జీవులు గర్భములో నుండుట పుట్టుట పెరుగుట నవయుట ముదియుట చచ్చుటయను షడ్వికా రంబులునుఁ దాపత్రయం బీషణత్రయంబు విష్ణు మాయా ప్రభూతంబు లిమ్మాయ వ్రతంబులకు దానతప జపంబులకు హెూమంబులకు యాగంబులకు లొంగదు. దేవతా రాధనంబులకు లక్ష్యపెట్టదు. నారాయణసాలంబు నాశ్రయించినవారిని మాత్రము విడుచును.

సుశీలుఁడు

విష్ణుమాయ గొప్పదంటి రది విష్ణువు నాశ్రయించినంగాని వదల దంటిర వ్విష్ణుసాలంబు మానవసంచారభూములలోఁ గానరాదయ్యె దాని నెట్లాశ్రయింపవచ్చును ?

వరవరముని

వత్సా ! భూలోకంబున లేకపోలేదు. సర్వభూతములయం దంతర్యామిగానున్నది. దానిని దర్శించుట శక్యంబుగాదు గాని యవ్వాసు దేవకల్పకం బయోధ్యయందు సీతాలక్ష్మణ సహిత రామరూపంబుతోను బదరికాశ్రయంబున లక్ష్మీనారాయణ నామంబుతో నీలాద్రియందు జగన్నాధనామంబుతో శ్రీకూర్మంబునఁ గూర్మనామంబుతో సింహాచలంబున నహెూబిలంబున మాల్యాద్రియందు నృసింహాఖ్యతోఁ జంద్రభాగాతీరంబునఁ బాండురంగాహ్వయముతోఁ మంగళగిరి యందుఁ బానకాలరాయడను పేరుతో భద్రాచలంబున రామనామంబుతోఁ బ్రకాశింపుచున్నది. వేంకటాచలంబున శ్రీనివాసాఖ్యతో దిగువతిరుపతియందు గోవింద రాజాఖ్యతో హస్తిగిరియందు వరదరాజాహ్వయంబుతోఁ గురు కాపురంబున వైద్యనాథనామంబుతోఁ గుంభకోణంబున శార్ఙ్గపాణ్యాఖ్యతో యాదవాద్రి

యందు సంపత్కుమారాహ్వయంబుతో ననేకపుణ్యక్షేత్రంబుల యందనేక రూప నామంబులతో విరాజిలుచున్నది మఱియు నీసాలంబు భయకావేరీతీరంబున సప్తప్రాకారమధ్యంబున నాది శేషుఁడను పాదులో శ్రీరంగరాజాహ్వయంబుతోఁ బ్రకాశింపుచున్న దీ వృక్షంబుగల ప్రదేశంబులందెల్ల లక్ష్మీలత బహువిధ నామరూపంబులతోఁ బెనచుకొని యున్న దీద్రుమంబు నర్థార్థులు వేంకటాచలంబునను నార్తులు తిరువళ్లూరియందును సేవింపు చున్నారు. మోక్షార్థు లన్ని ప్రదేశంబులలోను నాశ్రయించు చున్నారు. సంసారతపంబున బడలిన వారీ వృక్షము నీడను కొంచెము సేపు విశ్రమించి పోవుచున్నారు. మోహంబను రొంపిలో నెత్తువడిన వారీ భూజమునెన్నడు సమీపించలేరు. పూర్వముకలియుగాదిని నమ్మాళ్వారును యోగీంద్రు లిక్కల్ప భూజంబు నాశ్రయించి ప్రకృతినిఁ దిరస్కరించి తల్లి చనుబాలైనం గ్రోలక యక్కల్పకంబు నందిలి కల్యాణగుణ ఫలంబు లారగించి తిరువాయిమొళి యను ఫలంబు గోసి తనవారి కొసంగిరి. రామానుజ యోగీంద్రులు శ్రీభాష్యము గద్యత్రయమును రెండు ఫలంబులా సాలంబునుండి సేకరించి యిచ్చిరి. పెరియాళ్వారు తిరు ప్పల్లాండను ఫలంబును కులశేఖరసూరి ముకుంద మాలయను ఫలంబున గోదాదేవి తిరుప్పావను ఫలంబును నంజీయరు నంబిళ్ల భగద్విషయంబను ఫలంబును పిళ్లలోకాచార్యులవా రష్టాదశ రహస్యంబులను ఫలంబులును తక్కిన యాళ్వారాచార్యులు తమకుఁ దోఁచిన మహా ఫలంబులును తన్మహీరుహము నుండి సంగ్రహించి తదీయుల కొఱకిచ్చి రాళవందారు స్తోత్రరత్నంబను మహాఫలంబొసంగిరి.

భాగవతులు

అమ్మహాఫలంబు లన్నియుఁ దిరువాయి మొళిప్పళ్ళగారిచే నెఱింగి యిమ్మణవాళమహామునీంద్రుల వానినుండి వ్యాఖ్యానంబులను రసములనుపిండి భాగవతులకుఁ బంచియిచ్చి రామకరందంబు ప్రీతితో నారగించినవారు పరమపదంబు జేరిరి. కొందఱిప్పుడు త్రావుచున్నారు. భవిష్యత్కాలంబునను ద్రావఁగలవారుందురు.

సుశీలుఁడు

సంతోషము. గురువార్య ! దేవరవారి కేను సమకాలికుండనై పుట్టినది భాగ్యము. దాని నట్లుండనిమ్ము. విష్ణువు నొక వృక్షముగా వక్కాణించితి రది సత్యముగా వృక్షమేనా లేక యిదివరకు జత్రప్ప సిద్ధుఁడగు నాదినారాయణుండా ?

వరవరముని

పుత్రా ! నీమనస్సు దృఢమగుట కట్లువచించితి. నారాయణుని కల్యాణగుణ ప్రభావంబులన్నియు వృక్షంబునం దారోపించితినిఁగాని య వ్వాసుదేవుండు వృక్షంబుగాడు. సురనరరాక్షస తిర్యక్కులలో నొక్కండునుగాడు. స్థావరజంగమంబుల యందొక్కండుగా డద్దేవాదిదేవుండు పురుషోత్తముండు, పుండరీకాక్షుండు, లక్ష్మీపతి సువర్ణాంబరుఁడు, త్రిగుణాతీతుఁడు, సర్వశక్తుఁడు, దేవతల కమృతము నిచ్చినదాత శ్వేతవరా హమైప్రళయోదధి మగ్నమైన భూమినెత్తిన బలశాలి, విలయకాల సముద్రము మోకాలిబంటిఁ జరించుమధు కైటభులం ద్రుంచిన పరా క్రమనిధి, మందరగిరి గోవర్ధనగిరి మోచిన మేటి, సత్వగుణాశ్రయుఁడు, సముద్రమునకు సేతువు గట్టిన నేర్పరి, ఆశ్రితుల కభయ మిచ్చు నెఱ దాత, దాసులకు ధర్మార్థకామమోక్షంబు లొసంగు వలంతి, యాశ్రి తులకార్యములు నెఱవేర్చి కృతార్థుఁడ నైతి నని పొంగు నిష్కపటి, ఆశ్రితపరాధీనుఁడై మెలంగు విలాసి, ఆశ్రితుల విడిచి బ్రతుక లే నను మృదుస్వభావుఁడు. ఆశ్రితులఁ దప్పక రక్షింతు నని కుడిచేతికిఁ దోరము గట్టిన ధీరుఁడు. ఆశ్రితులదోషములు భోగ్యములుగా నెంచునట్టి వాత్సల్యనిధి. ఆశ్రితులవాంఛితంబు లెఱుంగునట్టి జ్ఞానసేవధి. ఆశ్రితవిరోధుల నిరసించు సమర్థుఁడు. ఆశ్రితుల కెంత యిచ్చినందృప్తి లేని యౌదార్యసదనము, తనకు సమానాధికులు లేని సర్వాధికారి, లీలార్థముగా సుర నర తిర్యగాదులలో నవతరించినను జ్ఞానశక్తి బలైశ్వర్యవీర్య తేజస్సుల వీడక ప్రకృతి వశ్యుఁడుగాక మాయకులోఁబడక చరించు స్వతంత్రుఁడు. కామినియెంగిలి కాసించుకాముకునివలె భక్తుల కై యెట్టి స్వల్పకార్యము లైనం జేయుసౌలభ్యనిధి. దీనికిఁ దార్కాణముగా నర్జునురథంబుదోలెను, భీష్మకునికై శాబ్ది విడిచెను. కు చేలుని చెమచే నానినయటుకులు

దాసీపుత్రునియన్నము శబరి యెంగిలిపండ్లు మహాప్రీతిలో నారగించెను. జటాయువున కగ్నిసంస్కారం బొనర్చెను. ద్రౌపదిశాకలవంబున కానందించెను. సత్యభామాతాడనంబు బహుమతిగా నంగీకరించెను. యశోదచే నులూఖలంబునఁ గట్టువడెను. కుబ్జామనోరథం బీడేర్చెను. గోపికాసమూహంబులతోఁ గలసి మొలసి నటించెను. గోపార్భకులతోఁ బసులం గాచెను. దేవకీవసుదేవులం జెఱవిడిపించి కుమారుండు పుట్టి ప్రయోజనం బేమని దీనాలాపంబు లాడెను. మాలాకారుని పూల మాలికల కాసించెను బలిచక్రవర్తి యింట దౌవారికుండయ్యె. నుడతకువరంబొసంగె. శునకమనోరథం బీడేర్చె. గృధ్రోలూఖంబుల వ్యవహారంబుఁ బరిష్కరించె సామాన్యుండగు నుగ్రసేనురాజుగాఁ జేసితాను ప్రతినిధిగానుండె. గోదాదేవిచే భోగింపఁబడిన పూలమాలికలు గౌరవాభిప్రాయంబుతో ధరించెఁ, బెరియాళ్వారి మంగళాశాసనంబు శిరసావహించెఁ, దిరుమలి శెయాళ్వారికై కుంభకోణంబునఁ బండుకొనియున్నవాఁడు దిగ్గనలేచి కూర్చుండెఁ, దిరుప్పాణియాళ్వారిశరీరంబు భోగ్యంబని మ్రింగె, నమ్మాళ్వారినిఁ బద్యంబులు చెప్పుమని యాచించెఁ, దొండరడిప్పొడియాళ్వారికిఁ గుంటెనకాయ్యెఁ, గురహవాలప్పగారి మెడపై నెక్కి నిక్కిచూచి యామునాచార్యులవారి ప్రభావంబు వెల్లడించెఁ, దిరుమలలో నల్లుడై కురుకాపురంబున శిష్యుఁడై యాదవాద్రియందుఁ గుమారుఁడై రామానుజుల వారిమహిమ లోకంబున కెఱింగించె, పరాశరభట్టరువారి భుక్తశేషంబు భోగ్యంబుగా నంగీకరించె, నంజియ్యరుగారికి సర్వస్వ దానంబుచేసె, నంబిళ్ళకై పరమపదంబులోఁ బత్రికఁ జెల్లించెఁ, బిళ్ళలోకాచార్యులవారి శ్రీ వచనభూషణమున కానందించి యేతద్విషప్ను కరులదండించె, నత్తుళా యమ్మగారి యానలకులోబడి పెరియనంబిగారి కొఱంతదీర్చె. నౌరా! యేమివాత్సల్య, మేమిసౌలభ్య, మేమిదాతృత్వము, యిమ్మహా పురుషు నాశ్రయింపని వాడెంతపండితుండైన, నెంత ధనవంతుఁడైన మునులైన, వేల్పులైన, సుఖమునుగాని, గొప్పతనమునుగాని, పొందఁజాలరా విష్ణువను చింతామణిని సంపాదింపక దారిద్ర్యధ్వంసంబుగా దా మేరువుంగొల్వక ధీరత్వము రా దానిధిని సంపాధింపక వాంఛలు నెరవేర వా సముద్రతీరంబు జేరక రత్నంబులు

దొరక వా కల్పకంబు నీడంజేరక యాయాసంబు తొలఁగదు. యిది సత్యంబు. సత్యంబు. సత్యంబు. దీనికి శ్రుతి స్మృతీతిహాసంబులు ప్రమాణంబులు.

గద్య

ఇది శ్రీసీతావల్లభప్రసాద సమాసాదిత కవితాప్రవీణ, వేదాల సీతారామా
చార్య కృపాలబ్ధ మంత్ర రత్నాను సంధాన, పవిత్రాంతరంగ నిఖిల
దుర్మతశీలోచ్చయదంభోళీభూత, సముద్రాల లక్ష్మణాచార్యాను
గ్రహ భోధిత, విశిష్టాద్వైత రహస్యార్థ ధురంధర శఠగోప,
యతిరాడ్వర వరయోగిప్రభృతి పూర్వాచార్య చరణసరోజ
భ్రమరాయమాన పయిడిపాగోత్ర మొవ్వవంశతిలక
కృష్ణార్యకృష్ణాంబా తనూజ శ్రీ వైష్ణవ విధేయ
వేంకటదాసనామధేయ ప్రణీతంబైన
వరవరమునిహృదయంబునందు
ప్రథమ భాగము
సంపూర్ణము.

శ్రీమతే రామానుజాయ నమః

వరవరమునిహృదయము

ద్వితీయ భాగము

సుశీలుఁడు

అయ్యా! మీచే వివరింపఁబడిన సర్వేశ్వరుని దేహధారులు స్వయముగా నాశ్రయింపవచ్చునా? మధ్యవర్తులు కావలయునా ?

వరవరవముని

ముందుగా సదాచార్యునాశ్రయించి వారిచే భగవత్తత్వంబు దెలుసుకొని భగవంతు నాశ్రయింపవలయును.

సుశీలుఁడు

సర్వేశ్వరు నాశ్రయింపుమంటిరి సరేగాని సదాచార్యు నాశ్రయింపనిచో లోపమేమి ?

వరవముని

మేలిమి బంగారమగ్నితప్తమైనను వెలిగారపు సంబంధంబులేక కరగనట్లు దేహి భగవంతు నాశ్రయించినను సదాచార్య సంబంధము లేక మోక్షము నొందఁజాలడు.

సుశీలుఁడు

గురువుగారును నావంటి మనుష్యుఁడేయగు, నాయనకు నిద్రాహారభయమైధునములున్నవి, భార్యాపుత్రులు బంధుమిత్రులును గలరు, శరీరమా నావలెఁబాంచభౌతికముగానే యున్నదట్టి మనుష్యుని నేను గొప్పగా నేల తలంచవలయు?

వరవరముని

మంచిగంధపుఁజెక్కయు వేపచెక్కయు నొకేరీతిగా నున్నవి. ఆవుపాలు జిల్లేడు పాలొక్కరంగుగాన్నువి. హంసలు బకంబులొక్కవన్నెగా నున్న వైనను గుణవిభాగంబునుబట్టి గౌరవత్వము నీచత్వము గలిగినట్లు దేహసామ్యంబు చేతను నిద్రాదులచేతను నీకు సమానుండైనను గురునియందు గొప్పతనమున్నది.

సుశీలుఁడు

గురుండెట్టివాఁడుగా నుండవలయునో యెఱింగింపుడు.

వరవరముని

సద్గురులక్షణంబు లనంతంబులుగలవు. గురుస్థానంబు ప్రాపించుటకు సామాన్యులకు శక్యంబుగాదట్టి పదివిఁ బ్రాపించువాఁడు సర్వశాస్త్రార్థంబు లెఱింగి జితేంద్రియత్వమార్జవంబు భూతదయశాంతిశమము దమము విష్ణుభక్తిగలిగి యుండవలయు నవైదిక సిద్ధాంతంబులు ఖండింపుచు భగవద్రామానుజ సిద్ధాంతపరుండై వేదంబులు శాస్త్రంబులు యితీహాస పురాణంబు లుపనిషత్తు లెఱింగి వానియందు నమ్మకంబు గలిగియుండ వలయు. నాస్తిక వాదముల నీసడించి దివారాత్రంబులు విరామములేక భగవత్ప్రభావంబు శిష్యులకు భోధింపుచు శిష్యుల మనంబులను సంసారవ్యాపారంబులనుండి తొలగించి శ్రియఃపతిపాదార విందంబులఁ జేర్చువాఁడుగానుండవలెను. మఱియు లోకభోగంబులయందు విరక్తియు మోక్షమునందురక్తియుఁ గలవాఁడై లోకములోఁగల పదార్థము లన్నిటికంటె భగవంతు నెక్కువగాఁ బ్రేమించువాఁడై యుండవలెను. త్రాగుడ మాంసాహారంబు వ్యర్థ కాలయాపనము వ్యర్థ సంభాషణము వాక్పారుష్యము లేనివాఁడై జ్ఞానానుష్ఠానపరుండై యుండవలయునట్టి గురువు నాశ్రయించినచో మోక్షమందవచ్చును.

సుశీలుఁడు

గురువుగారిని నాతోసమానముగా నెంచవచ్చునా లేక యేమని భావింపవచ్చును ?

వరవరముని

సమానముగా నెంచినచో మిక్కిలి దోషముగలదు యెట్లంటివేని.

శ్లో॥ విష్ణోరర్చావతా రేషు లోహభావంకరోతియః ।
యోగురోమానుషం భావ ముభౌ నరకపాతినౌ ॥

విష్ణుదేవుని యర్చావతారంబు గాంచి యిది యేలోహముతోఁ జేయఁబడిన దని విచారించినవాఁడును, గురువును మనుష్యుఁడని యెంచువాఁడును నరకము నొందుదురు.

శ్లో॥ గురురేవ పరంబ్రహ్మ, గురురేవపరాగతిః ।
గురురేవ పరావిద్యా, గురురేవ పరంధనమ్ ॥।

గురువే పరబ్రహ్మము, గురువే శ్రేష్ఠమైన గతి, గురువే శ్రేష్ఠమైనవిద్య, గురువే శ్రేష్ఠమైనధనము, అని సాత్వికతంత్రము చెప్పుచున్నది.

శ్లో॥ చక్షుర్గమ్యం గురుం త్యక్త్వా, శాస్త్రగమ్యంతుయస్స్మరేత్ ।
కరస్థముదకంత్యక్త్వా, ఘనస్థమభివాంఛతి ॥

నేత్రగోచరుండగు గురుని విడిచి శాస్త్రగోచరుండగుభగవంతుని స్మరించుట కరస్థ మగుజలమునుఁ బారఁ బోసి మేఘజలమును గోరుటవంటి దని పురాణసముచ్చయము చెప్పుచున్నది.

శ్లో॥ సులభం స్వగురుంత్యక్త్వా, దుర్లభం య ఉపాసతే ।
సిద్ధంత్యక్త్వాధనం మూఢో, గుప్తమన్వేష్యతి క్షితౌ ॥

సులభుండగు గురుని విడిచి దుర్లభుం డగుభగవంతునిఁ గోరుట చేతిలోనిధనమును బాఱవైచి భూమిలో నెవ్వరో ధనము పూడ్చిపెట్టిరని వెదకుట వంటిదనియు

శ్లో॥ శరీరం వసు విజ్ఞానం,వాసః కర్మగుణాఁ నసూꣳ
గుర్వర్థం ధారయేద్యస్తు, సశిష్యోనేతరస్మ ృతః ॥

శరీరము, ధనము, విజ్ఞానము, నివాసము, కర్మగుణప్రాణములు గురునికొఱకై యెవ్వఁడు ధరించు చున్నాడో వాఁడితరమును స్మరింపడు. అనఁగా నట్లుండవలయుననుట

శ్లో॥ నారాయణోపివికృతిం యాతిగురోః ప్రచ్యుతస్య ।
దుర్బుద్ధేః, కమలంజలాదపేతంతోషయతి రవిర్నతోషయతి॥

జలమునువిడిచిన కమలము నదివరదాఁకా మిత్రుఁడైన సూర్యుఁడు మాడ్చునట్లు గురునివిడిచిన దేహిని నారాయణుఁడు దండించును.

శ్లో॥ సాక్షాన్నారాయణోదేవః, కృత్వామర్త్యమయీంతనుమ్,
మగ్నానుద్ధరతే లోకాన్, కారుణ్యాచ్ఛాస్త్రపాణినా !
తస్మాద్భక్తి గురౌకార్యా, సంసారభయభీరుణా ॥

సాక్షాన్నారాయణుండు గురురూప మానవదేహమునఁ బొంది సంసారార్ణవమగ్నులగు జనులను కారుణ్యమువలన శాస్త్రజ్ఞానమను

హస్తముతోలేవనెత్తుచున్నాడు. దానివలన సంసారమునుదాఁటఁ గోరువాఁడు గురుభక్తి చేయవలయు నీరీతిగాననేక గ్రంథములయందుఁ జెప్పఁబడి యున్నది. కాబట్టిశరీరధారికి సదాచార్యాశ్రయము ముఖ్యము.

సుశీలుఁడు

ఇంతవరకు శాస్త్రవాక్యములచే వచించితిరి. దీని నాచరించిన వారిం బేర్కొనుడు.

వరవరముని

సావధానమతివై యాలకింపుము. గురు పరంపరల కెల్లం బ్రథమాచార్యుండు నారాయణుండు. నారాయణునికి విరించి శిష్యుఁడయ్యెను. నరమహాముని నారాయణమునికి శిష్యుండయ్యె, నారదుండు నరనారాయణుల నాశ్రయించె మఱియుఁ బరశురాముండు శంకరుని, భీష్ముండు పరశురాముని, ప్రహ్లాదుండు నారదుని, జనకుండు పంచశిఖుని, జైమిని పైల వైశంపాయన సంజయాదులు వ్యాసుని, లక్ష్మణాంజనేయులు శ్రీరామచంద్రుని, యుద్ధవార్జునులు శ్రీకృష్ణుని, గురువులుగా నాశ్రయించి కృతార్థులైరి. ఇంతయేల సాక్షాత్పరబ్రహ్మమగు శ్రీమహావిష్ణువు లోకసంగ్రహార్థమై రామకృష్ణావతారములయందు వసిష్ఠసాందీప విశ్వామిత్రులనాచార్యులుగా వరించె నిక్కలియుగంబునందు, ద్వైతాద్వైత విశిష్టాద్వైత మతస్థులందఱు గురుభక్తిచేఁ బ్రసిద్ధిఁగాంచిరి. వారిలో నమ్మాళవారియందు మధురకవియాళ్వారును, శ్రీయాళవందారు నందు దైవవారి యాండాను మారనేరినంబులును, శ్రీరామానుజుల వారియందు వడుగ నంబియుఁగావించిన గురుభక్తి యద్వితీయము.

సుశీలుఁడు

సద్గురువు నాశ్రయించినవారు ముందుగాఁ దెలుసుకొనవలసిన విషయమేమి?

వరవరముని

విపరీతజ్ఞాను లనేకవిధంబుల వక్కాణింతరు. గాని సుజ్ఞానులు మాత్రమర్థపంచకజ్ఞానం బెఱుంగవలయునని చెప్పుదురు. అదియే మనకుఁ

బ్రథానంబు. దాని విధానం బెఱింగింతు వినుము. స్వస్వరూపము, పరస్వరూపము, ఉపాయస్వరూపము, విరోధిస్వరూపము, పురుషార్థ స్వరూపమని యైదువిధంబులుగా నుండు. నందులో నొక్కొక్కటియైదు విధములుగా నుండును.

సుశీలుఁడు

వాని నన్నిటినిఁజక్కగా వివరింపుడు.

వరవరముని

స్వస్వరూప మనఁగా జీవస్వరూపము. ఈజీవస్వరూపమును గుఱించి

శ్లో॥ నజాయతే మ్రియతేవా కదాచి,
న్నాయంభూత్వాభవితావా నభూయః ।
అజో నిత్యశ్శాశ్వతోయం పురాణో
నహన్య తేహన్యమానే శరీరే ॥

అర్జునా ! యీ యాత్మపుట్టుట లేదు. చచ్చుట లే దొకప్పుడు లేకుండి మరలఁ గలుగునది కాదు. వెండియు నీ జీవుఁడు పుట్టుక లేనివాఁడు నిత్యుఁడు సదాయుండువాఁడు పురాతనుఁడు శరీరము చంపఁబడినను వీడు చంపఁబడడు.

శ్లో॥ వాసాంసిజీర్ణానియథావిహాయ, నవానిగృహ్ణాతి నరోపరాణి।
తథా శీరీరాణివిహాయ జీర్ణా, న్యన్యానిసంయాతి నవానిదేహీ॥

మనుష్యుఁడు జీర్ణము లైనవస్త్రములు విడిచి క్రొత్తవస్త్రము లెట్లు ధరించుచున్నాడో యట్లే జీవుఁడు శిథిలములైన శరీరములు విడిచి క్రొత్త శరీరములు ధరించుచున్నాడు.

శ్లో॥ నైనంఛిందంతిశస్త్రాణి, నైనందహతి పావకః,
నచైనం క్లేదయంత్యాపో, నశోషయతిమారుతః ॥

ఈయాత్మను కత్తులునఱకఁజాలవు. నిప్పుకాల్పఁజాలదు జలంబు. తడపఁజాలదు. గాలి శోషింపఁజేయఁజాలదు.

శ్లో॥ ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేన, మాశ్చర్యవద్వదతి తథైవచాన్యః।
ఆశ్చర్య వచ్చైనమన్యశ్శృణోతి శుత్వాప్యేనం వేదనచైవకశ్చిత్॥

ఒకడీయాత్మ నద్భుతవస్తువుగాఁ జూచుచున్నాడు. మఱియొకడీ యాత్మ నాశ్చర్యవస్తువుగాఁ జెప్పుచున్నాడు. ఇంకొకడీ యాత్మ నాశ్చర్యవస్తువుగా వినుచున్నాడు. వేఱొకడీ యాత్మను వినియుఁదెలుసుకొన లేడని శ్రీకృష్ణస్వామివా రర్జునున కెఱింగించిరి. (భగవద్గీత)

ఈ యాత్మలు గుణవిభజనను బట్టి యైదు విధములైన నామములచేఁ బిలువఁబడుచున్నవి. యెట్లనఁగా:- నిత్యులు, ముక్తులు, బద్ధులు, కేవలులు, ముముక్షువులు.

సుశీలుఁడు

వారివారిభేదములు విశదముగా నెఱింగింపుడు ?

వరవరముని

నిత్యులనఁగా నిత్యవిభూతియందలి శ్రీ వైకుంఠంబునందుండి యాకలిదప్పి ముసలితనము మరణము మొదలగు ప్రకృతివికారములు లేని పంచోపనిషన్మయ శరీరంబునొంది భూతభవిష్యద్వర్తమానకాలములయందు దుఃఖలేశంబునొందక సంసారదూరులై నిరంతర భగవదను భవపరులై సదానందులై స్వేచ్ఛగా విహరించు ననంతగరుడ విష్వక్సేనాది నిత్యసూరులు. నిత్యసూరులనఁగా నెప్పుడును జ్ఞాన సంకోచము లేనివారు.

ముక్తులనఁగా బహుజన్మార్జిన సుకృతప్రభావంబుచే మానవ జన్మంబునొంది భగవద్భక్తులై యవసానకాలంబున విరజాస్నానంబుచే సూక్ష్మశరీర వాసనారేణువులు వాపుకొని నిత్యవిభూతిఁజేరి నిత్య సూరులతో సమానమగు దశనుఁబొందువారు.

బద్ధులనఁగాఁ బుణ్యానుగుణంబుగా దివ్యదేహంబు దాల్చి సుఖమునుఁ బాపానుగుణముగా యాతనాశరీరంబబుదాల్చి దుఃఖమును పుణ్యపాప మిశ్రానుగుణముగాఁ బాంచభౌతిక శరీరంబుఁదాల్చి సుఖదుఃఖంబులు ననుభవింపుచు దర్శన స్పర్శనంబుల కనర్హంబైన మలంబుతోఁగూడిన శరీరమే జీవుండనియు, దేహబంధువులే రక్షకులనియు, నింద్రియానుభవంబె పురుషార్థంబనియు, గృహమే పుణ్యక్షేత్రంబనియు, నెంచి

35

శిశ్నోదరజిహ్వాపరాయణులై జ్ఞాన ప్రయత్నంబుచేయక భగవచ్చింతనలేక వృథాకాలయాపనము చేయు నిత్యసంసారులు. కేవలు లనఁగా శాస్త్రానుభవముచేఁ గల్గిన జ్ఞానముచే నాత్మస్వరూపంబు, నయ్యాత్మకుఁ బ్రకృతివలనఁ గిలిగిన దుఃఖము నెఱింగి యోగబలముచే నాత్మను సాక్షాత్కరించి ప్రార్థబానంతరము భౌతిక శరీరంబు విడిచి విరజా స్నానంబుచే సూక్ష్మశరీరంబు వాపుకొని శ్రీవైకుంఠంబున కవాచ్య స్థలంబువలెనుండు కైవల్యంబుఁ జేరి యశరీరులైయుండు జీవోపాసకులు. వీరికినిఁ బునర్జన్మంబులేదు. ముముక్షులనఁగా,

శ్లో॥ జాయమానం హి పురుషం యం పశ్యే న్మధుసూదనః ।
సాత్త్వి కోసతు విజ్ఞేయస్స్వై మోక్షార్థచింతనమ్ ॥

అను నట్లు పుట్టినప్పుడే భగవత్కటాక్షమునుఁ బ్రాపించినాలు గైదుసంవత్సరముల ప్రాయములోనె జ్ఞానము గల్గి క్రమముగా వృద్ధిఁజెంది విషయానుభవంబును విషతుల్యముగా నిరసించి భాగవత సాంగత్యంబునం దభిరుచి చేసి శ్రియఃపతి పాదారవిందధ్యానంబుచేఁ గాలంబు గడపుచు శ్రీవైకుంఠబునుఁ జెందఁగోరువారు. ఇంతవరకిది స్వస్వరూపము.

సుశీలుఁడు

పరస్వరూపమును వక్కాణింపుడు

వరవరముని

పరస్వరూపము, పర, వ్యూహ, విభవ, అంతర్యామిత్వ, అర్చావ తారంబులు.

పర అనఁగా శ్రీవైకుంఠదివ్యనగరంబునఁ దిరుమామణిమంట పమునందు శ్రీభూనీళాసమేతుండై నిత్యముక్తానుభావ్యుఁడై కోటి సూర్యప్రకాశమానుం డై సత్య జ్ఞానాది సమ స్తకల్యాణగుణ పరిపూర్ణుఁ డై వేంచేసియుండుస్థితి. ఇతనికిఁ బరమపద నాథుండని పేరు.

వ్యూహములనఁగా వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్నానిరుద్ధులు.

తొల్లి శ్రీకృష్ణుండర్జున ప్రతిజ్ఞా నిర్వహణంబునకై యర్జునునితో రథారూఢుండై యరిగి వైదిక పుత్రులుండెచ్చిన స్థానంబు వాసుదేవ వ్యూహంబు,

బ్రహ్మలోకంబు నందుండునది ప్రద్యుమ్నవ్యూహంబు, పాతాళంబున నుండునది సంకర్షణవ్యూహంబు, పాలసంద్రంబున నుండునది యనిరుద్ధవ్యూహంబు.

విభవంబులనఁగా, ధర్మము నిలబెట్టుటకు భక్తుల రక్షించుటకు దుష్టుల వధించుటకు స్వేచ్ఛతోఁజేయు లీలావతారంబులు. అందులోఁ బూర్ణావతారంబులని, యంశావతారంబులని, యావేశావతారంబులని, శక్త్యావేశావతారంబులని బహువిధంబులు. వానిలో మత్స్యకూర్మ వరాహనారసింహవామనదధి భక్తహయ గ్రీవ రామకృష్ణావతారాంబులు పూర్ణావతారంబులు.

బ్రహ్మ, శివుఁడు, వ్యాసుఁడు, నర్జునుఁడు పావకుఁడు, కపిలుఁడు, బలరాముఁడు వీర లంశావతారంబులు.

పరశురామబౌద్ధాదులావేశావతారంబులు. కకుస్థుఁడు. ముచి కుందుఁడు మొదలగువారియందు భగవంతుఁడు దనశక్తి నావేశింపఁ జేసి దుష్టసంహారంబు చేయించెను. గనుక నవి శక్త్యావేశావతారంబులు. ముముక్షువులకుఁ బూర్ణావతారంబు లుపాస్యంబులు, తక్కినవి త్యాజంబులు. అంతర్యామిత్వమనఁగా నెఱ్ఱగాఁగాల్చిన యినుపగుండునందలి నిప్పువలె నిఖిలజీవులయందు వ్యాపించియుండు స్థితి యొకటి. లక్ష్మీసహితుండై దివ్యమంగళవిగ్రహముతో హృదయకమలమునందు నుండు స్థితి రెండు మొదటిది సకలజీవులయందును, రెండవది భక్తుల యందు మాత్రముండును.

అర్చావతారము :- అర్చయనఁగా బూజ. దాని కర్హమైనది యర్చావతారము. రాగి యిత్తడి శిలా దారురూపంబులతో దేవాలయముల యందు గృహములయందు భక్తానుకూలంబులైన నామరూపంబులతో వేంచేసి తదీయపూజానమస్కారాదుల నంగీకరించురూపము. ఇంతవరకిది పరస్వరూపవిషయము.

సుశీలుఁడు

దేశికశిఖామణీ ! యిఁక నుపాయస్వరూపంబు వినఁగోరు చున్నాను.

వరవరముని

ఉపాయస్వరూపమునఁగా భగవదనుగ్రమంబు సంసాదించు సాధన విశేషము.

సుశీలుఁడు

గురుపుంగవా ! దానిని సాకల్యముగా సెలవిండు

వరవరముని

ఉపాయస్వరూపము, కర్మము, జ్ఞానము, భక్తి, ప్రపత్తి, ఆచార్యాభి మానము, ననియైదువిధములు. గంగా, యమునా, సరస్వత్యాదుల యందుఁ జేయుస్నానంబులు జపంబులు తపంబులు కృచ్ఛాంద్రాయణాది వ్రతంబులు అగ్నిష్టోమవాజపేయాశ్వమేధాది యజ్ఞంబులు వనములు వేయుట దేవళంబులు కట్టించుట సత్రములు కట్టించుట చలివెందరలు నిర్మించుట చెఱువులు, బావులు త్రవ్వించుట పెండ్లిండ్లు చేయించుట అన్నదానము, గోదానము, భూదానము, సువర్ణదానము, కన్యాదానము మొదలైనవి చేయుట యివి కర్మంబులు.

జ్ఞానమనఁగా,

శ్లో॥ అమానిత్వమదంభిత్వ, మహింసాక్షాంతిరార్జవమ్ ।
ఆచార్యోపాసనం శౌచం స్థైర్య మాత్మ వినిగ్రహమ్ ॥

గర్వము దంభములేకుండుట, జీవహింసచేయకుండుట, ఓర్పు, ఋజుస్వభావము, సద్గురువు నాశ్రయించుట, శౌచము, స్థిరత్వము, మనోనిగ్రహము, గలిగియుండుట.

శ్లో॥ ఇంద్రియార్థేషు వైరాగ్య, మనహంకార ఏవచ ।
జన్మమృత్యు జరావ్యాధి, దుఃఖదోషానుదర్శనమ్ ॥

శబ్దాది విషయములయందు విరక్తికలిగియుండుట, అహంకారము లేకుండుట, పుట్టుక, మరణము, ముసలితనము, వ్యాధులు, దుఃఖములు వీనిలోగల దోషము లెఱింగి వానినిఁ దప్పించుకొన యత్నించుట.

శ్లో॥ అసక్తి రనభిష్వంగః, పుత్రదారగృహాదిషు ।
నిత్యంచ సమచిత్తత్వ, మిష్టానిష్టోప పత్తిషు ॥

ఆశలేకుండుట, పెండ్లాము పిల్లలు యిల్లు వీనియం దనురాగము లేకుండుట, యిష్టమైనది రానప్పు డనిష్టమైనది ప్రాప్తించి నప్పుడు చిత్తచాంచల్యము లేకుండుట.

శ్లో॥ మయిచానన్యయోగేన, భక్తిరవ్యభిచారిణి ।
వివిక్త దేశసేవిత్వ, మరతిర్జన సంసది ॥

అన్యముగానిదియు, వ్యభిచారము లేనిదియు నగు భక్తినాయందుఁజే యుట, భాగవతసహవాసము లేనప్పుడు నిర్జనస్థానమున వసించుట, బలుమంది జనులుండుచోటికిఁ బోవలెనను రుచిలేకుండుట.

శ్లో॥ అధ్యాత్మజ్ఞాన నిత్యత్వం, తత్వజ్ఞానార్థదర్శనమ్ ।
ఏతత్ జ్ఞాన మితిప్రోక్త మజ్ఞానం యతతోన్యథా ॥

పరమాత్మజ్ఞానము, తత్వజ్ఞానము నిత్యము కలిగియుండుట. ఇది జ్ఞానమని చెప్పఁబడుచున్నది. దీని కితరమైనది యజ్ఞానమునని శ్రీ కృష్ణస్వామివారు ఫల్గుననకుపదేశించి రింతేకక,

శ్లో॥ జన్మకర్మచ మేదివ్యమేవంయోవేత్తి తత్వతః ।
త్యక్త్వాదేహం పునర్జన్మనైతిమామేతి సోర్జున ॥

నాయవతారంబులు నవతారములయందుఁ జేసిన పనులు ప్రాకృతములుకావనియు దివ్యములనియు నెవ్వఁడు తెలిసికొను చున్నాడో యట్టివాఁడు దేహమును విడిచినపిమ్మటఁ బునర్జన్మము నొందక నన్నే పొందుచున్నాడనియు,

శ్లో॥ యథైధాంసిసమిద్ధోగ్నిర్భస్మసాత్కురుతేర్జున ।
జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసాత్కురుతేతథా ॥

లెస్సగామండుచున్న నిప్పు కట్టెల నెట్లుకాల్చునో జ్ఞానాగ్ని దుష్కర్మంబుల నట్లు భస్మము చేయుచున్నదనియు

శ్లో॥ నహిజ్ఞా నేనసదృశం, పవిత్రమిహవిద్యతే ।
జ్ఞానముతో సమానముగాఁ బవిత్రము చేయున దెద్దియు లేదనియు,

శ్లో॥ తేషాం జ్ఞానీనిత్యయుక్త, ఏకభక్తిర్విశిష్యతే ।
ప్రియోహిజ్ఞానినోత్యర్థ, మహం సచ మమప్రియః

జ్ఞాని యందఱికంటె శ్రేష్ఠుఁడు. జ్ఞానికి నేను మిక్కిలి ప్రియుఁడను వాఁడు నాకు మిక్కిలి ప్రియుఁడు అని సర్వేశ్వరుఁడు కొని యాడెను. (భగద్గీత)

పైనఁ జెప్పినవన్నియు జ్ఞానలక్షణంబులు. జ్ఞానము కొందఱికి మిణుగురు బూచివలెను, కొందఱి జ్ఞానము నక్షత్రకాంతివలెను, కొందఱి జ్ఞానము మణికాంతివలెను, కొందఱి జ్ఞానము దీపకాంతివలెను, కొందఱి జ్ఞానము చంద్రునివలెను, కొందఱి జ్ఞానము సూర్యునివలెను ప్రకాశించు. నన్నిటిలో సూర్యనివంటి జ్ఞానము గొప్పది. ఇట్టి జ్ఞానము సంపాదించిన పిమ్మట హృదయకమలమందుఁగాని సూర్యమండల మందుగాని వేంచేసియుండు పరమపురుషుని ధ్యానించుట జ్ఞానమనఁబడుచున్నది.

సుశీలుఁడు

స్వామీ ! యీజ్ఞానయోగము చాలా దుష్కరముగా నున్నది. మాబోటి మందమతులకు సాధ్యముగాదు. భక్తిస్వరూపమును వక్కాణింపుడు.

వరవరముని

భక్తియనఁగా నెడతెగనిప్రేమ మాప్రేమను భార్యాపుత్రులయందుండు నపుడు కామమనియు, సంసారంబునందుండు నప్పు డాశయనియు, సమానులపైనుండునప్పుడు ప్రేమమనియు భగవద్భాగవతాచార్యులపై నుండునప్పుడు భక్తి యనియుఁబెద్దలు చెప్పుదురు.

సుశీలుఁడు

ఒక్కదానికిన్ని పేరులుండునా, విపర్యాపముగా నున్న దే !

వరవరముని

విపరీత మెంతమాత్రము లేదొక్క మనుష్యుండన్నకుఁదమ్ముఁడై తమ్మునకన్నయై తండ్రికిఁ గొడుకై కుమారునకుఁ దండ్రియై మామ కల్లుఁడై యుల్లునకు మామయై యున్నాడు. బంగార మొక్కటియైభూషణములుగా మాఱినప్పు డనేకనామము లొందుచున్న దట్లే భక్తియు నొక్కొక్కదానిపైఁ బ్రసరించునప్పు డొక్కొక్కపేరు గైకొనుచున్నది.

సుశీలుఁడు

చిత్తము సాయించండి.

వరవరముని

ఆభక్తిలో జగత్కారణుండగు విష్ణువునందుఁజేయుభక్తి శ్రేష్ఠ మనిపించుకొనుచున్నది.

శ్లో॥ ఆరాధనానాం సర్వేషాం, విష్ణోరారాధనంవరం ।
ఆరాధనములన్నిటిలోను విష్ణ్వారాధనంబు శ్రేష్ఠమనియు,

శ్లో॥ సంసారవిషవృక్షస్య, ద్వేఫలేహ్యా మృతోపమమ్ ।
కదాచిత్కేశవేభక్తిః, తద్భక్తైర్వాసమాగమమ్ ।

సంసారమను విషవృక్షంబున నమృతోపమానంబులగు రెండు ఫలములున్నవి. కదాచిత్తుగానైనఁ గేశవునియందు భక్తిచేయు టొకఫలంబు. తదీయుల నారాధించుట రెండవఫలంబనియుఁజెప్పఁబడియున్నది.

శ్లో॥ శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనమ్ ।
అర్చనం వందనందాస్యం సఖ్యమాత్మ నివేదనమ్ ॥

శ్రవణము కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము, వందనము, దాస్యము, సఖ్యము, ఆత్మని వేదనమునని భగవంతునియందుఁ జేయు భక్తి తొమ్మిది విధములని ప్రహ్లాదులవారు చెప్పిరి.

శ్లో॥ మద్భక్తజనవాత్సల్యం, పూజాయాంచానుమోదనం ।
స్వయ మభ్యర్చనంచైవ, మద్ధరే దంభవర్జనమ్ ।
మత్కథాశ్ర వణేభక్తిః స్వరనేత్రాంగవిక్రియా ।
మమాను స్మరణంనిత్యం, యచ్చమాంనోపజీవతి ॥

నాభక్తులయందు వాత్సల్యము, నాపూజలయందు ననుకూలము తాను స్వయముగా నన్నుఁబూజించుట, నావిషయమున దంభము లేక వర్తించుట, నాకథలు వినుటయందురుచి, తత్సమయంబున గద్గద స్వరము మొదలైన యంగవికారములు నిత్యము నన్ను స్మరించుట నన్ను విడిచి బ్రతుక లేకపోవుట, యీ యెనిమిది విధములైన భక్తి లక్షణము లెవ్వనియందుండునో వాఁడు మహానుభావుఁడని నావలెఁబూజ్యుఁడని శ్రీమహావిష్ణువు చెప్పెను.

శ్లో॥ అనన్యాశ్చింతయంతో మాం, యేజనాఃపర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం, యోగక్షేమంవహామ్యహం ॥

ఏజను లితరచింతలు లేనివారై లెస్సగా నన్నుపాసింపు చున్నారో నాతో నిత్యసంబంధము గలయట్టివారియొక్క యోగక్షేమములు నేను వహింపుచున్నాను.

శ్లో॥ యాంతిమద్యాజినోఽపిమామ్ ।
నన్నుఁ బూజించువారునన్నే చేరుదురు.

శ్లో॥ సమోహం సర్వభూతేషు, నమేద్వేష్యోస్తిన ప్రియః ।
యేభజంతితుమాం భక్త్యా, మయితేతేషు చాప్యహమ్ ॥

సర్వభూతములయందు నేను సముండను. నాకు ద్వేషింపఁదగిన వాఁడుగాని ప్రియుఁడుగాని లేడు. ఎవ్వరు నన్ను భక్తితో భజింపు చున్నారో వారు నాయందుందురు. నేను వారియందుందును.

శ్లో॥ అపిచేత్సు దురాచారో, భజతే మామనన్యభాక్ ।
సాధురేవసమంతవ్య, స్సమ్యగ్వ్యవసితోహిసః ॥

మిక్కిలి దురాచారుఁడైనను వేఱుచింతలేక నన్ను భజించు వానిని సాధువనియే తలంపవలయు నెందుకనఁగా వాఁడు క్షుద్రదేవతా ప్రీతిలేని మంచి మనోనిశ్చయము గలవాఁడుగదా.

శ్లో॥ క్షిప్రంభవతిధర్మాత్మా, శశ్వశ్శాంతింనిగచ్ఛతి ।
కౌంతేయప్రతిజానీహి, నమేభక్తప్రణశ్యతి ॥

నాభక్తుఁడు శీఘ్రమున ధర్మాత్ముఁడగుచున్నాడు. ఎల్లప్పుడు శాంతినిఁ బొందుచున్నాడు. నాభక్తుఁడు చెడడని నీవు ప్రతిజ్ఞ చేయుము.

శ్లో॥ మాంహిపార్థవ్యపాశ్రిత్యయేఽపిస్యుఃపాపయోనయః ।
స్త్రియో వైశ్యస్తథాశూద్రా స్తేపియాంతి పరాంగతిమ్ ॥

పార్థా ! నన్నాశ్రయించినవారు స్త్రీలైనను, శూద్రులైనను, పాపయోనులైనను మోక్షము జెందుదురు.

శ్లో॥ యోమామజమనాదించ, వేత్తిలోకమహేశ్వరమ్ ।
అసమ్మూఢస్సమర్త్యేషు, సర్వపాపైః ప్రముచ్యతే ॥

ఎవ్వఁడునన్నుఁబుట్టకలేనివానిగా, నాదిలేనివానిగా,

సర్వలోకములకు గొప్పప్రభునిగా నెఱుగుచున్నాడో వాఁడు మనుష్యులలో జ్ఞానియై సర్వపాపములచేత విడువఁబడుచున్నాడు.

శ్లో॥ మచ్చిత్తామద్గతప్రాణా, బోధయంతఃపరస్పరమ్ ।
కథయంతశ్చమాంనిత్యం, తుష్యంతిచరమంతిచ ॥

నాభక్తులు నన్ను విడనాడి బ్రతుకలేనివారై నాకథలొకరి కొకరు తెలియఁజేసికొనుచు నానందింపుచు గ్రీడింపుచున్నారు.

శ్లో॥ తేషాంసతతయుక్తానాం, భజతాం ప్రీతిపూర్వకమ్ ।
దదామిబుద్ధియోగంతం, యేనమాముపయాంతితే ॥

నన్నునిరంతర మెవ్వరు భజింతురో యట్టివారికి నన్నుఁ బొందునట్టి జ్ఞానమును నేనేయిచ్చుచున్నాను.

శ్లో॥ నవేదయజ్ఞాధ్యయనైర్నదానై ।
ర్న చక్రియాభిర్న తపోభిరుగ్రైః ।
ఏవం రూపశ్శక్యఅహం నృలోకే ।
ద్రుష్టుంత్వద న్యేన కురుప్రవీర ॥

అర్జునా! వేదాధ్యయనము, యజ్ఞములు, పుణ్యకర్మములు, తపస్సులు మొదలైనవానిచేత నావిశ్వరూపమును జూడలేరు. భక్తుఁడవైన నీవు మాత్రము చూచితివి.

శ్లో॥ భక్త్యాత్వనన్యయాశక్య, అహమేవం విధోర్జున ।
జ్ఞాతుంద్రష్టుంచ తత్వేన, ప్రవేష్టుంచపరంతప ॥

అన్యముగాని భక్తిచేతనే నావిశ్వరూపము తెలిసికొనుటకుఁ జూచుటకుఁ బ్రవేశించుటకు సాధ్యమైనది.

శ్లో॥ యేతుసర్వాణికర్మాణి, మయిసన్న్యస్యమత్పరాః ।
అనన్యేనైవయోగేన, మాంధ్యాయంత ఉపాసతే ।
తేషామహం సముద్ధర్తా, మృత్యుసంసారసాగరాత్ ।
భవామినచిరాత్పార్థ, మయ్యావేశితచేతసాం॥

ఎవ్వరు నాయందు సమస్తకర్మములు సమర్పించి మత్పరులై నాయం దావేశించిన మనస్సుగలవారై యితర చింతలు లేనివారై భక్తితో నన్ను

పాసింపుచున్నారో వారిని మృత్యురూపమైన సంసారము నుండి బహుత్వరగా దాఁటింపుచున్నాను.

శ్లో॥ మయ్యేవమనాథత్స్వ, మయిబుద్ధిం నివేశయ ।
నివసిష్యసిమయ్యేవ, అత ఊర్ధ్వం నసంశయః ॥

అర్జునా ! నాయందు మనస్సుంచుము. బుద్ధిని నివేశింపఁజేయు మటుపిమ్మట నాయందే యుండఁగలవు. (భగవద్గీత)

అంబరీషున కపకారము గావించి తన్ను శరణుజొచ్చిన దుర్వాసుంగాంచి భగవంతుడు

శ్లో॥ అహం భక్తపరాధీనో, హ్యస్వతంత్ర ఇవద్విజ ।
సాధుభిర్గ్ర స్తహృదయో, భక్తై భక్తజనప్రియః ॥

నే నస్వతంత్రుఁడైన సేవకునివలె భక్తులకుఁ బరాధీనుండను. సాధువులైన భక్తులు నా హృదయమును వశీకరించిరి. నేను భక్త ప్రియుఁడను.

శ్లో॥ నామాత్మానమాశాసే, మద్భక్తై సాధుభిర్వినా
శ్రియంచాత్యంతికీంబ్రహ్మన్, యేషాంగతిరహంపరా ॥

ఓ బ్రాహ్మణుఁడా ! నాకు మేనుగాని, యెల్లప్పుడు న్నెడబాయని రమాదేవిగాని నా భక్తులకంటెఁ బ్రియంబుగాదు. శరీరమునైనఁగములనైన విడుతుంగాని దాసుల విడువఁజాలను. వారికి నేనేగదా పరమగతి.

శ్లో॥ యేదారాగారపుత్రాప్తాన్, ప్రాణాన్ విత్తమిమంపరమ్ ।
హిత్వామాం శరణంయాతాః కథంతాం స్త్యక్తుముత్సహే॥

ఎవ్వరు భార్యలను గృహంబులను కుమారులనుఁ బ్రాణములను ద్రవ్యమును విడిచి నన్ను శరణుఁజొచ్చుచున్నారో యట్టి దాసుల విడుచుటకు నే నెట్లుత్సహింతును.

శ్లో॥ మయినిర్బద్ధహృదయాస్సాధవ స్సమదర్శినః ।
వశీకుర్వంతిమాం భక్త్యా, సత్స్రియః సత్పతింయాథా ॥

సమదర్శనులైన సాధువులు నాయందు మనస్సునిలిపి పతివ్రతలు భర్తలను వశీకరించినట్లు సాధువులు భక్తిచే నన్ను వశీకరింపుచున్నారు.

శ్లో॥ మత్సేవయాప్రతీతంతే, సాలోక్యాది చతుష్టయమ్ ।
నేచ్ఛంతిసేవయాపూర్ణాః, కుతోన్యత్కాలవిప్లుతమ్ ॥

నాభక్తులు నాసేవచేఁ బూర్ణులై సాలోక్యాదుల నైనం గోరరు. కాలపక్వములై నశించు నితర భోగంబులు గోరుట లెక్కడిది.

శ్లో॥ సాధవోహృదయంమహ్యం, సాధునాం హృదయం హ్యాహమ్।
మదన్యం తేనజానంతి, నాహం తేభ్యోమనాగపి ॥

సాధువులు నాయొక్క మనస్సు ననుసరింతురు. సాధువులయొక్క మనస్సు నేనేయగుదును. వారు నాకంటె నన్యము నెఱుంగరు. వారి కంటె నన్యము కొంచెమైనను నేనెఱుంగనని శ్రీయఃపతిదుర్వాసునితో వచించెను.

శ్లో॥ నాలంద్విజత్వం దేవత్వమృషిత్వంచా సురాత్మజాః ।
ప్రీణనాయముకుందస్య నవృత్తంనబహుజ్ఞతా ॥

ఓరాక్షసులారా ! బాడబత్వముగాని నిర్జరత్వముగాని మునిత్వముగాని మంచినడతగాని అనేక శాస్త్రము లెఱింగిన తెలివిగాని నారాయణుని ప్రీతి కొఱకుఁ జాలవు.

శ్లో॥ నదానం నతపోనేజ్యా, నశౌచం నవ్రతానిచ ।
ప్రీయతేఽమలయాభక్త్యా, హరిరన్య ద్విడంబనమ్ ॥

దానతపోయజ్ఞ శౌచవ్రతములు శ్రీనివాసుని సంతోషింపంజేయలేవు. నిర్మలమైన భక్తిచేత హరిసంతోషింపుచున్నాడు. లాఁతి సాధనములు విడంబనములు.

శ్లో॥ దైతేయాయక్షరక్షాంసి స్త్రియశ్శూద్రావ్రజౌకసః ।
ఖగామృగాపాపజీవాస్సంతిహ్యచ్యుత సంగతాః ॥

దైత్యులు, యక్షులు, రాక్షసులు, స్త్రీలు, శూద్రులు గొల్లలు, పక్షులు మృగములు, పాపజీవులు విష్ణునిఁగొల్చి మోక్షమును జెందిరి,

శ్లో॥ మన్యేఽధునాభిజనరూప తపశ్రుతౌజ ।
స్తేజః ప్రభావబలపౌరష బుద్ధియోగాః ।
నారాధనాయహిభవంతిపరస్యపుంసో ।
భక్త్యాతుతోష భగవాౘ గజయూథపాయ ॥

ఓ భగవంతుడా ! మంచి కులము సౌందర్యము తపస్సు పాండిత్యము హృషీకపాటవము తేజస్సు ప్రభావము బలము పౌరుషము బుద్ధియోగము పరమపురుషుఁడవైన నిన్ను సంతోషింపఁజేయుటకుఁ జాలవని

40

తలంచుచున్నాను. గజేంద్రుని భక్తిచేత సంతోషించితివి గాన భక్తియే గొప్పదని భావము.

శ్లో॥ విప్రాద్ద్వి షడ్గుణయుతా దరవిందనాభ ।
పాదారవింద విముఖాచ్ఛ్వపచంవరిష్ఠం ।
మన్యేతదర్పిత మనోవచనేహితార్థ ।
ప్రాణం పునాతిసకులం నతుభూరిమానః ॥

శ్రీహరీ ! నీ పాదభక్తి విముఖుండగు పండ్రెండు మంచిగుణములుగల విప్రునికంటెను మనోవాక్ప్రాణధనంబులు నీకర్పించిన స్వపచుండు శ్రేష్ఠుండని తలంపుచున్నాను. ఎందుకనగా నీదాసుండగు చండాలుండు తనకులమునుఁ బవిత్రము చేయుచున్నాడు అని ప్రహ్లాదుఁడు వచించెను. పైనఁజెప్పిన పండ్రెండుగుణము లేవియనఁగా:- శ్రీధరీయ వ్యాఖ్యానమునందు

శ్లో॥ జ్ఞానంచసత్యందమ స్తపశ్చ, హ్యామాత్సర్యం హ్రీ
స్తితీక్షానసూయా, యజ్ఞశ్చదానం చధృతిశ్శమశ్చ,
వ్రతానివైద్వాదశబ్రాహ్మణస్యే ॥ అని యున్నది.

శ్లో॥ దివివాభువి వామమాస్తువాసో, నరకేవా నరకాంతకప్రకామం।
అవధీరిత శారదారవిందౌ, చరణౌతే మరణేపిచింతయామి॥

ఓ కృష్ణా ! నాకు స్వర్గమునందుఁగాని భూమియందుఁ గాని నరకమందుఁగాని నివాసమగుంగాక. అనఁగా నన్నెక్కడ నైన నుంచుము. శరత్కాలపద్మములను దిరస్కరించు నీ పాదద్వయంబు మరణకాలమందును స్మరింతును.

శ్లో॥ నాహంవందే తవచరణయోర్ద్వంద్వ మద్వంద్వహేతోః ।
కుంభీపాకం గురుమపిహరే నారకం నాపనేతుం ।
రమ్యారామామృదు తనులతానందనే నాపిరంతుం ।
భావేభావే హృదయభవనే భావయేయం భవంతం ॥

ఓకృష్ణా ! శీతోష్ణాది ద్వంద్వములచేఁ గలుగు కష్టములు నివారించుకొనుటకును కుంభీపాకాది గొప్పనరకబాధలు తొలంగించుకొనుటకును మృదులతలవంటి తనువులుగల రంభాదికాంతలతో

భోగించుటకును నిన్నుఁగూర్చి నమస్కరించలేదు. అనఁగా నా యా ఫలములిమ్మని కాదనుట. మఱెందులకనిన జన్మజన్మంబునందును హృదయభవనంబున నిన్నుఁ జింతించుటకు సెలవిమ్ము.

శ్లో॥ నాస్థాధర్మే నవసునిచయే నైవకామోపభోగే ।
యద్యద్భవ్యమ్ భవతు భగవన్ పూర్వకర్మానురూపం ।
ఏతత్ప్రార్థ్యం మమబహుమతం జన్మజన్మాంతరేపి ।
త్వత్పాదాం భోరుహయుగగతా నిశ్చలాభక్తిరస్తు ॥

నాకు ధర్మార్థకామములయందుఁ గోరిక లేదు. పూర్వ కర్మానుసారముగా రాఁదగినవి వచ్చుఁగాక. నేను వాంఛించునదేమనిన జన్మ జన్మంబునందునుఁ దామరలవంటి నీపాదములయందు నిశ్చలమైనభక్తి నాకుఁ గల్గుఁగాక యని కుల శేఖరాళ్వారు సాయించిరి.

శ్లో॥ నదేహంనప్రాణాన్నచ సుఖమ శేషాభిలషితం ।
నచాత్మానం న్యాత్మిమపితవశేషత్వ విభవాత్ ।
బహిర్భూతం నాధక్షణమపిస హేయాతు శతధా ।
వినాశంతత్సత్యం మధుమదన విజ్ఞాపనమిదమ్ ॥

ఓశ్రీహరీ ! నీదాస్యమనకు వ్యతిరిక్తమైన యెడల శరీరముగాని ప్రాణములనుగాని సమస్త జీవులచేఁ గోరఁబడు సుఖములనుగాని ఆత్మాత్మీయములనుగాని దేనిని సహింపను. ఇది నావిజ్ఞాపనమని శ్రీయాళవందారు సాయించిరి. ఈ ప్రమాణములచేత భక్తివిషయము నీకుఁ జక్కఁగాఁదెలియవచ్చును.

సీ॥ మధుసూదనుండను మదపుటేనుగుఁ
బట్టఁ బ్రబ[1]లావపాతమిా పరమభక్తి
వనజాక్షుఁడను బలీవర్ద[2]ంబు బంధింప
నవ్యశుల్బ[3]ంబీ యనన్యభక్తి
పురుషోత్తముండను పులిని స్వాధీనంబు
గావింపబో నీయఖండభక్తి
శ్రీమనోహరుఁడను సేవధిఁ గనిపెట్ట
భవ్యాంజన బీయపారభక్తి

1 ఏనుగులను బంధించుటకు కుత్రవ్వుగుంట 2 ఎద్దు 3 త్రాడు

కంజనేత్రుఁడనెడు కాముకు వలపింప
వన్నెలాడి సుప్రసన్న భక్తి
భక్తికంటె వేరుపాయంబుచే జీవ
తతికిఁ గానరాదు తమ్మికంటి ॥

సీ॥ తీరినప్పుడు చేసి తీరకుండిన మాను
కొనునట్టివానిది కుంటిభక్తి
పామరజనబోధ పాటించి హరిని వీ
డ్కొన్నవానిది నెఱా గ్రుడ్డిభక్తి
కష్టములీనిచేఁ గల్గెనాకనియెంచి
నిరసించువానిది నీచభక్తి
యెన్నాళ్ళకును వాంఛ లీలేదు నాకని
మానినవాని దున్మాదభక్తి
లోకవాంఛలెల్లఁ బోకార్చి సరసీజ
నయను గొల్చునది యనన్యభక్తి
యట్టి భక్తి చేత నపవర్గధామంబు
నందవచ్చు సంశయంబు లేదు ॥

సీ॥ మొనసి లౌకికభోగములకు కేశవుఁ
గొనియాడునదిలంచగొండి భక్తి
బహుకాల మిలమీద బ్రతికింపుమనుచు దా
మోదరుగొల్చుట మూఢభక్తి
చెలఁగిలా[1]ఁతులు సంతసించుటకై పరం
ధామునర్చించుటల్ దంభభక్తి
తనచిత్తమును వేఱుతావుననుంచి శ్రీ
కాంతునివేడుట కలుషభక్తి
యేలతెచ్చుకొంటి నీ మిడిమేలంబు
నెంతకాలమని భరింతు దీని
ననుచుఁ బంకజాక్షునందుఁ జేసెడుభక్తి
ఫలము లేనిదంద్రు బ్రహ్మమునులు ।

1 ఇతరులు

సీ॥ హరివిడనాడి చిల్లరవేలుపులఁబ్రాపుఁ
గోరి చేయునది నిస్సారభక్తి
సరసిజాక్షునితో నితరదేవతలఁబోల్చి
రా[1]ఁణగొల్చుట లపరాధభక్తి
శ్రీకాంతునవతార చేష్టలు ప్రాకృత
రీతి నెన్నుట విపరీతభక్తి
తన దురాచారవర్తనమువీడక మురా
రాతి నర్చించుట రోఁతభక్తి
శిష్యవర్య ! యిట్టి చెడుత్రోవలన్నియు
విడిచి ప్రాణనాథువిడువకుండఁ
గొల్చు సాధ్విబోలె గోవిందు నర్చించు
వాని రక్తిశ్రేష్ఠ మైనభక్తి ॥

వ॥ మంత్రాంతర సాధనాంతర ప్రయోజనాంతర దేవతాంత రంబులవిడిచి భక్తినిష్ఠుడైనవానికి జనార్ధనుండు వశ్యుండగు. విష్ణువెవ్వరికి స్వాధీనుండగునట్టి వానికి దుష్కరంబైన కార్యంబులేదు.

సుశీలుఁడు

స్వామీ ! యోగంబు గొప్పదందురే మీరు భక్తి గొప్ప దనుచున్నారేమి ?

వరవరముని

బిడ్డా ! యోగం బదృశ్యంబగుటకునుఁ బరకాయ ప్రవేశంబు జేయుటకును వాయువేగ మనోవేగంబులుగలిగి కోరినచోట్ల కేగుటకు నాయుస్సుఁ బెంచుటకు నొకేపర్యాయ మనేక శరీరంబులు దాల్చుటకు నింక ననేక మహిమలు సంపాదించుటకుఁ బనికివచ్చుంగాని విష్ణుభక్తివలె శాశ్వతానంద ప్రదమగు మోక్షమీయఁజాదు. దీనికి దార్కాణంబుగా యోగియైన దుర్వాసుఁడంబరీషున కోడెంగదా! ఇంతవరకు భక్తిస్వరూపంబు, భక్తునియొక్క గౌరవము, భక్తులయందు భగవంతునకుండు ప్రేమ యెఱింగించితిని.

1 ప్రీతితో

సుశీలుఁడు

ఇఁకనుఁ బ్రపత్తిస్వరూపంబునుఁ బ్రపన్నుని వైభవంబును వక్కాణింపుడు.

వరవరముని

భక్తిముదిరినచోఁ బ్రపత్తియని పేర్కొందురు. భక్తియందుఁ జేతనునికిఁ గొంత స్వాతంత్ర్యముండును. ప్రపత్తియం దదిలేదు. ప్రపన్నుఁడు దేహరక్షణభారము నాత్మరక్షణభారము శ్రియఃపతియందుంచి నిర్భరుఁడై నిర్భయుఁడైయుండు నిందులో నార్తుఁడని దృప్తుఁడని రెండు తెగలుగానుందురు. ప్రారబ్ధానంతరము మోక్షము గోరువాఁడు దృప్తుఁడు. తలఁచినప్పుడే మోక్షముఁగోరువాఁడార్తుఁడు. నమ్మాళ్వా రార్తులు, యామునరామానుజాదులు దృప్తులు.

సుశీలుఁడు

ప్రపన్నుండైనవాడు బ్రతికినంతకాల మేమి చేయుచుండవలయును?

వరవరముని

కాసారభూత మహదాహ్వయాది యాళ్వారులను పరాంకుశ పరకాలనాథయామున రామానుజాది పూర్వాచార్యులనుఁ గొనియాడుచు వారిశ్రీసూక్తు లితరులకు బోధింపుచుఁ దిరువాయి మొళిమొదలైన ద్రావిడ ప్రబంధంబులను శ్రీరామయణాది యితిహాసంబులను విష్ణుపాద్మాది సాత్విక పురాణంబులను భగవద్గీతాది దివ్య శాస్త్రంబులను పఠింపుచు శ్రీరంగము, వేంకటాద్రి, హస్తిగిరి, కురుకాపురము, యాదవాద్రి, వానమామల, శ్రీవిల్లిబుత్తూరు, శ్రీపెరుంబూధూరు, మొదలగు దివ్యక్షేత్రంబుల యందలి భగవద్వైభవంబు వీక్షింపుచు మంత్రరత్నాను సంధానంబు చేయుచుఁబ్ర పన్నుండు కాలయాపనంబొనర్పవలయు. నదియట్లుండఁగాఁ బూర్వ మర్జునుండు తిరుత్తేరుతట్టియందు గీతాశాస్త్రంబువిని పూర్వోత్తరసందర్భంబు తెలియక దుఃఖించె నంతట భక్తవాత్సల్యజలధియగు శ్రీకృష్ణుండదివిని బిడ్డా ! నేను చెప్పిన శాస్త్రంబులోని విషయంబు గొప్పదగుటచే నీవు గ్రహింపఁ జాలవైతి వందువలన సులభోపాయం బెఱింగింతు వినుము.

శ్లో॥ సర్వధార్మా౯ పరిత్యజ్య, మామేకం శరణం వ్రజ ।
అహంత్వా సర్వపాపేభ్యో, మోక్షయిష్యామి మాశుచః ॥

సర్వధర్మా౯ = సమస్తపుణ్యములను, పరిత్యజ్య = పూర్తిగావదిలి, మామ్ = నన్ను, ఏకం = ఒక్కనినే, శరణం వ్రజ = శరణము జెందుము. అహం = నేను, సర్వపాపేభ్యః = సమస్తపాపములనుండి, మోక్ష యిష్యామి = విడిపించెదను మాశుచః = దుఃఖించవలదు.

సమస్తపుణ్యఫలములు నిన్ను రక్షించుననెడు అభిప్రాయంబు వదలి నేనేరక్షకుఁడనని యు నాకంటె వేఱురక్షకులు లేరని దృఢసంకల్పముతో శరణాగతిచేయుము. అనఁగాఁ బుణ్యఫలాసక్తి నీవు వదులుము పాపముల నుండి నేను వదలించెదను. పుణ్యపాప వివర్జితమైన మార్గమవలంబించి నన్ను శరణు జెందినచో మోక్షమందవచ్చునని యర్థము.

పెరుమాళ్లుసహితము తన్ను శరణుజెందుమని చెప్పెనేగాని కర్మములు, వ్రతములు, యోగాభ్యాసము చేయుమని చెప్పలేదు. ప్రపత్తియన్నను శరణాగతియన్నను, భావ మొక్కటే. శరణాగతికి నాఱంగంబులు గలవు. యెట్లనఁగా

శ్లో॥ ఆనుకూల్యస్య సంకల్పః, ప్రాతికూల్యస్యవర్జనమ్ ।
రక్షిష్యతీతివిశ్వాసో, గోప్తృత్వవరణం తథా ।
ఆత్మనిక్షేపకార్పణ్యే, షడ్విధాశ్శరణాగతిః ॥

ఆనుకూల్య సంకల్పము, ప్రాతికూల్యవర్జనము, శరణ్యుఁడు రక్షించుననెడు విశ్వాసము, ఆత్మసమర్పణము, గోప్తృత్వవరణము, కార్పణ్యము.

ఆనుకూల్య సంకల్పమనఁగా శరణ్యుఁడైనవానికి హితవైన పనులుచేయుట. ప్రాతికూల్యవర్జనమనఁగా శరణ్యునికి హితవుకాని పనులుమానుట. శరణ్యుఁడు తప్పక రక్షించుననెడు విశ్వాసము, రక్షకుని పలానివాఁడని వరించుట, ఆత్మసమర్పణముచేయుట, కార్పణ్యమనఁగా దీనత్వము. ఇట్లాఱంగములతోఁ గూడినది శరణాగతి యనఁబడును.

సుశీలుఁడు

దేశికసార్వభౌమా ! యీప్రపత్తికి దేశకాలఫల నియమంబులు గాని అధికారి నియమంబులుగాని గలిగినచో సెలవిండు.

వరవరముని

కర్మంబులకు ఫలనియమంబు నధికారి నియమంబుకలదు గాని ప్రపత్తికిలేవు.

సుశీలుఁడు

ఫలాది నియమంబు లేకపోవుట విశదముగా నెఱింగింపుడు.

వరవరముని

వేలుపులు రావణసంహారంబుకొఱకుఁ బెరుమాళ్ళనుగూర్చి శరణాగతిచేసిరి. లక్ష్మణస్వామి రామప్రాప్తి కొఱకును, భరతాళ్వారు స్వరూపహాని నివర్తించుటకును దండకాటవిమునులు ఖరాదిరాక్షస నాశనంబుకొఱకును, గాకాసురుండు ప్రాణరక్షణంబునకును, విభీషణాళ్వారు రామప్రాప్తికిని, గజేంద్రుండు మోక్షంబునకు శరణాగతిజేసిరి. గనుక ఫలనియమంబులే దిట్లే యాచారాది నియామకంబులులేవని యీ వృత్తాంతములచే నెరుంగనగుఁ గాని విషయనియామకంబు గలదు.

సుశీలుఁడు

విషయనియమమనఁగా నర్థముకాలేదుగనుక బాగుగా సెలవిండు

వరవరముని

ఎవ్వనివిషయమందీ ప్రపత్తిచేసిన ఫలించునో యెవ్వని విషయములో ఫలించదో దానిం దెలియవలయు నెట్లనఁగా జ్ఞానము, దయా సామర్థ్యము లుగల వానియందుఁ జేసిన ప్రపత్తి ఫలించును. లేనిచో నిష్ఫలమగును.

సుశీలుఁడు

దాని నుదాహరణ పూర్వకముగా సెలవిండు

వరవరముని

మనకొకయాపత్తు గలిగినప్పుడు దూరదేశమందుండు మనుష్యునిఁగూర్చి శరణుజెందుదుము. అతనికి మనవిషయమును దెలుసుకొను జ్ఞానము లేనందునను, తటాలున వచ్చునట్టి దయలేనందునను,

వచ్చినను రక్షించుసామర్థ్యము లేనందునను, ప్రపత్తి వ్యర్థమగును దీనికిఁదార్కాణముగా రోగదారిద్ర్యాది బాధలచేఁ దల్లడిల్లు బంధువులంగని మనవారలెందఱో నివారింపజాలక దుఃఖించుచుండుట మనము చూచుచుంటిమి గదా. కావున సర్వజ్ఞుడును దయాసముద్రుండునగు శ్రియఃపతినిఁగూర్చి శరణాగతి చేయవలయు. నట్లు చేయునప్పుడు స్వశక్తినుపయోగించుట, స్వరక్షణేచ్ఛ, స్వప్రయత్నము మానవలయు నట్లుగానిచో భగవంతుని విషయమందును శరణాగతి ఫలింపదు. దీనికిఁ బ్రమాణములిచ్చు చున్నాను వినుము.

పూర్వము గజేంద్రుఁడు మొసలిచేఁ బట్టువడి యాజలచరంబును వధించి నన్ను నేను రక్షించుకొనఁజాలనాయని వేయిసంవత్సరంబులు పోరి జయంబు గానక విసికి స్వరక్షణేచ్ఛవదలి భగవంతుని శరణాగతి చేయఁగా నమ్మహాపురుషుండు సపరివారంబుగాఁగొలని కడుకువచ్చి మొసలినిఁజంపి గజేంద్రుని రక్షించె. దీనిచే స్వరక్షణేచ్ఛ కూడదని తేలుచున్నది.

ఇంద్రజిత్తాంజనేయులవారిపై బ్రహ్మాస్త్రంబుఁ బ్రయోగించి బంధింపఁగా దానిని నమ్మలేక రాక్షసులు జనపనారమోకులచేఁ గట్టి స్వశక్తినుపయోగించి రంతట నవ్విరించనాస్త్ర మొకదానిపై నాధారపడి యుండునది కానందున శిరియ తిరువడిని విడిచె. ఇంద్రజిత్తును రాక్షసులును నిష్ప్రయోజకులైరి. స్వశక్తినుపయోగించుటఁ బనికి రాదని దీనిచేఁ దేలినది.

సభామధ్యంబున దుశ్శాసనుండు వలువలు విడువఁగా ద్రౌపది శ్రీకృష్ణునిఁగూర్చి శరణాగతి చేయఁగోరి యొకచేతితోఁ జీరఁబట్టుకొని యొంటి చేతితోఁ బ్రపత్తిచేసెఁబ్రపత్తి పూర్తికానందున జగదీశుఁడు రక్షింపఁడయ్యె. నింతలో యాజ్ఞసేని చేయి నొప్పిపుట్టుటచేఁ గోకవదలి రెండు చేతులెత్తి ప్రపత్తిచేయఁగా గోపాలశేఖరుండక్షయ వస్త్రంబులొసంగి కాపాడె. నిందుచే బ్రపత్తికి స్వప్రయత్నము కూడదని తేలుచున్నది.

భార్యపుత్రబంధుమిత్రాదులను లంకను సమస్తభోగ్య పదార్థంబులను విడిచి శ్రీరామచంద్రునికి శరణాగతిచేసిన విభీషణాళ్వారు శాశ్వత రాజ్యభోగముల ననుభవించునట్టి మహానుభావుఁడయ్యెను.

వానరులు శ్రీరామచంద్రునియందు భరన్యాసముచేసి రాక్షస యుద్ధంబునఁ జావకయుఁ జచ్చినవారు పునర్జీవితులయ్యు నిహలోకంబు నఁగీర్తియుఁ బరలోకంబు శాశ్వతానందంబునుఁ బొందిరి.

శుక్రాచార్యుల దుర్బోధవినక వామనమూర్తియందు భరన్యాసము చేసిన బలిచక్రవర్తి పూర్ణానందముచే మెలంగుచు నిప్పటికిని యపారరాజ్య సుఖంబు లనుభవింపుచున్నాడు. మఱియు నొక్కదృష్టాంతంబుసెప్పెద నాలకింపుము.

కాంచీపురంబున సుబుద్ధియను నొకబ్రాహ్మణుడు భార్యతో నివసింపుచు నొక్కనాడు శ్రీభగవద్గీతాశాస్త్రంబున

శ్లో॥ అనన్యాశ్చింతయంతోమాం, యేజనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం, యోగక్షేమంవహామ్యహమ్ ॥

ఏజను లితరచింతలు లేనివారై లెస్సగానన్ను పాసించుచున్నారో నాతో సంబంధముగలయట్టి వారియొక్క యోగక్షేమములు నేను వహింపుచున్నానని చెప్పిన భగవద్వాక్యము తెలుసుకొని భళీ ! సర్వేశ్వరుండింత దృఢముగావక్కాణించియుండ దేహరక్షణకై బహువిధ ప్రయాసలేలయని సర్వప్రయత్నంబులుమాని గీతాధ్యయనము చేయుచు గీతార్థవిచారణ పరుఁడైయుండె. నత్తఱిలక్ష్మీకాంతుండతని యధ్యవసాయుంబునకుమెచ్చి నిరంతరము మనుష్యరూపంబున దినవెచ్చము లిచ్చుచుండె. సుబుద్ధికిఁ గాలంబు సుఖలీలఁగడచుచుండె. నిట్లుండఁ బురుషోత్తముం డొక్కనాడతని మనోనిశ్చయం బారయనెంచి పదార్థంబుతేమియునీయడయ్యె నందులకు సుబుద్ధి కోపించి అయ్యో! భగవద్గీతా శ్లోకంబునమ్మి, మోసపోయితి. నన్నంబులేక కుటుంబ మీదినమల్లాడు చున్నది. యప్పిచ్చువారైన లేరని పలుతెఱంగులఁ జింతించి యా పద్యంబుపై గీటువెట్టి వాడుకచొప్పునఁ దేవప్పెరుమాళ్ళదర్శనంబునకేగి దర్శింప నయ్యాదిదేవునిముఖంబున నొక్క గీటు గానంబడియె నందుల కాశ్చర్యపడి యవ్విప్రుం డర్చకులతోఁ బెరుమాళ్ళముఖమున గీటెవరు పెట్టిరని ప్రశ్నింపగా వారికి గానరామి నతనితో నీకుఁ బిచ్చిపట్టినదాయేమి? గీటులేదు. నీ ముఖము లేదు. పొమ్మని రంత నబ్బాడబుం డింటికి వచ్చునంతలో ముకుందుఁడొకధనికుని వేషమూని

ధనధాన్య రత్నాంబరాదులు బండ్లమీద నెత్తించుకొనివచ్చి సుబుద్ధియింటc బడవేయించి యతని భార్యంబిలిచి యిట్లనియె తల్లీ! నీ భర్తకుc జిరకాలపరిచితుండనై సమస్త పదార్థంబు లిచ్చుచుంటి నీనాడాలస్యమైనందున నామొగంబున గంటముతోcగీచెc జూడుమని చూపcగా ముఖంబున నెత్తురు గారుచుండె. నామె నివ్వెఅపడి చూచుచుండ నమ్మహాపురుషుం డదృశ్యుం డయ్యె. నింతలో నింటికివచ్చిన సుబుద్ధికీ సమాచారంబుదెల్ప నబ్బూసురుcడు వ్యాకులమొంది భళీ ! యీవచ్చిన పరంధాముcడు భగవద్గీతాది దివ్యశాస్త్రములయందు గీటువెట్టుట నామొగంబునcబెట్టినట్లని దేవాలయమునందును మదీమ గృహిణిచెంతను నిదర్శనంబు చూపించె. దేవతల కమృతంబిచ్చినవాని మనస్సు నొవ్వజేసితిని. నావంటి పాతకుండు లేడుగదా! యని చింతించి గీతాశ్లోకము నెప్పటియట్లు సవరించి వ్రాసి యెప్పటియట్లు భగవద్గుణానుభవంబుచేc గాలంబు గడపి పరమ వైష్ణవసాయుజ్యమునొందె.

ఒకానొక పల్లెటూరునందు సాత్వికుండను బ్రాహ్మణుండు నిరంతరము తెల్లవారుజామనలేచి స్నానమొనర్చి శ్రీమద్రామాయణము పారాయణము చేయుచు నుంఛవృత్తిచే జీవింపుచుండె. నిట్లుండ నతనికిc గుటుంబుము భారమగుటచే దారిద్ర్యంబు తట్టుముట్టయ్యె. దాని కోర్వలేక చావంగోరి యబ్బూసురుండొక నిశాసమయంబున గృహంబువిడిచి యొంటరిగా బయలుదేరిపోయి కిష్కింధారణ్యంబుc బ్రవేశించి పంపాసరోవరంబున స్నానంబాచరించి రామాయణ యుద్ధకాండమునందిలి,

శ్లో॥ సకృదేవప్రపన్నాయ, తవాస్మీతిచయాచతే,
అభయం సర్వభూతేభ్యో, దదామ్యేతద్వ్రతం మమ ॥

అనcగా నెవ్వడు నన్నుcగూర్చి యొకేసారి నీవాcడనని పూర్ణ ప్రపత్తిచేసి యాచించునో, వానికి సర్వభూతములవల్లనుండి యభయ మిచ్చెదనని చక్రవర్తి తిరుమకనారు ప్రతిజ్ఞ చేసిన శ్లోకార్థంబనుసంధించు కొని మృగములవలని భయంబువిడిచి రామాయణపారాయణ కుపక్రమించె నయ్యవసరంబున నొక్కవానర మరటిపండ్ల గెలదెచ్చి యతనికి సమర్పించి, చదివినంతసేపు విని యెచ్చటికోపోయె. నా సాత్వికుండాశ్చర్యంబునమునింగి

45

కదళీఫలంబులు శ్రీరామునకు నివేదించి తత్ప్రసాదంబుచే క్షుద్బాధనడం చుకొని రెండవదినము పారాయణమున కుపక్రమింప నిరువదివేల కోcతులువచ్చి విని పనస జంబూ ద్రాక్ష ఫలంబులవ్వారిగా సమర్పించె. నీరీతి మూడుమాసంబు లచ్చట రామాయణమర్థముతో వివరింపుచుండ శ్రీరామకష్టము వినినప్పుడు దీనానంబులతో నేడ్చుచు, వానరోత్సాహంబు రాక్షసనాశనంబు వినినప్పుడు సంతోషింపుచుc గాలంబుcగడపి పట్టాభిషేకమహోత్సవము నాcడు వక్తయగు బ్రాహ్మణునకు ననర్ఘ్యరత్నంబులు దెచ్చి సమర్పించె. నంత నాసాత్వికుం డిదియంతయు శ్రీరామచంద్రా నుగ్రహంబు గదాయని యుప్పొంగి యారత్నంబులుగైకొని వానరముల నాశీర్వదింపనక్కోcతులన్నియు నమస్కారంబులు గావించి గురువియోగమున కోర్వలేక దుఃఖించె. నామర్కటములతోcగలిగిన చిరకాలపరిచయంబుచే సాత్వికుండు దుఃఖించి యెట్టకేలకు వీడ్కొని స్వగృహంబుజేరి మితిలేనిభోగంబు లనుభవించి యఖండరామభక్తి చేసి తుదుకు సకుటుంబముగాc బరమపదంబునకేగె. భరన్యాస మెంతయాధి క్యమిచ్చెనో చూచితివే ! యిది ప్రపత్తిస్వరూపము.

కర్మముచే జనకాదిరాజులును, జ్ఞానముచే జడభరతాదులును, భక్తిచేc బ్రహ్లాదాదులనుc, బ్రపత్తిచే వ్యాస వాల్మీకి నారదాది మునులును, విష్ణుచిత్తకుల శేఖరాది యాళ్వారలును, శఠగోపనాధయామున రామానుజాదియాచార్యులును భగవత్కృపాపాత్రులైరి ప్రపత్తినిరపాయమైనది. భక్తికూడ దానిలో నంతర్భూతము గనుక నిరపాయమే. తక్కిన మార్గములన్నియు నపాయకరంబులు. కర్మఠులు, జ్ఞానులు యోగులు, వారిభారము వారే వహింపవలయును. భక్త ప్రపన్నుల భారము భగవంతుcడువహించును.

సుశీలుcడు

ఆచార్యాభిమానమంటిరే దాని విధానంబు సెలవిండు

వరవరముని

పై నాల్గింటియందు శక్తి లేనివాcడు దయాజ్ఞానానుష్ఠానంబులు గల యొక శ్రీవైష్ణవు నాశ్రయించి తదభిమానములో నొదిగి తత్సరి

చర్యానిరతుఁడైయున్నచో విభీషణాళ్వారిమంత్రులవలె వీడును భగవత్కృ పాపాత్రుఁడగును యింతవర కుపాయస్వరూపంబు.

సుశీలుఁడు

విరోధిస్వరూపక్రమంబానతిందు.

వరవరముని

ఈ యుపాయంబు లనుష్ఠించఁబూనినప్పుడు దానికి విఘ్నము చేయునదేదిగలదో దానికి విరోధిస్వరూపంబని పేరు. ఆ విరోధి స్వరూపము స్వరూపవిరోధి, పరత్వవిరోధి, ఉపాయవిరోధి, పురుషార్థవిరోధి, ప్రాప్తివిరోధియని యైదు విధంబులు.

స్వరూపవిరోధియనఁగా

శ్లో॥ ఉత్క్రామంతం స్థితంవాపి, భుంజానంవాగుణాన్వితమ్ ।
విమూఢానానుపశ్యంతి, పశ్యంతిజ్ఞాన చక్షుషా ॥

శరీరమునుండి ప్రాణములు లేచునప్పుడుగాని, శరీరమందున్నప్పుడుగాని, భోగము లనుభవించునప్పుడుగాని, గుణములతోఁ గూడినప్పుడుగాని, శరీరమువేఱు జీవుఁడు వేఱని మూఢులు తెలుసుకొనలేరు. జ్ఞాననేత్రముగలవారు తెలుసుకొందురని గీతాచార్యు లానతిచ్చిరి. గనుక శరీరమే జీవుండనియెంచుట, ప్రణవమునం దకారవాచ్యుఁడైన నారాయణునకు జీవుండు దాసుఁడని చెప్పుచుండ నట్టిజీవుని యితరులకు దాసుండని యెంచుట, తనకుఁదానే స్వతంత్రుండని తలంచుట, యివి మూడు స్వరూపవిరోధులు. దేహాత్మభ్రమ, అన్యశేసత్వము, స్వాతంత్ర్యము నని యీ మూటికిఁబేరులు.

పరత్వ విరోధియనగా – (గోవిందుడు) నారాయణుడే పరాత్పరుడను భావముతోకాక యితరదేవతలు రక్షకులని, త్రిమూర్తులు సమానులని, ఎవరిని కొలిచిన ఫలమొకటేఅను భావము కలిగియుండుట.

ఉపాయవిరోధియనఁగా – నుపాయములలో శ్రేష్ఠమైనది ప్రపత్తి. దానికంటె గొప్పదిగలదని భ్రమించుట, ప్రపత్తిచేసినాను నాకు మోక్షంబునకుఁ గొఱంతలేదని అహంకరించి భగవదనుగ్రహమే మోక్ష సాధనమని యెంచకపోవుట, యివి యుపాయవిరోధులు.

పురుషార్థవిరోధియనఁగా – బురుషార్థములలో శ్రేష్ఠమైనది. మోక్షమదియే భగవత్కైంకర్యము. భగవత్కైంకర్యముకాక వేఱొకటి కోరుట పురుషార్థవిరోధి.

ప్రాప్తివిరోధియనఁగా శరీరి భగవత్ప్రాప్తికై యత్నముచేయుచున్నప్పుడు దాని నడ్డగించువారందఱు ప్రాప్తివిరోధులు. యెట్లనగా మొదట శరీరంబునంగల నిద్రాహారభయమైథునంబులు, తరువాత 'నసంసారాత్పరోరిపుః' అనునట్లుసంసారము, దుష్టులగుభార్యాపుత్రబంధుమిత్రాదులు, లోకంబునంగల సంసారవర్ధకులు తమవంకకుఁ ద్రిప్పుకొనఁగోరినదేవతలు, అకృత్యకరణకృత్యాకరణ భగవదపచారభాగవతాపచారాసహ్యాపచారంబులు, యివెల్లను ప్రాప్తివిరోధులు.

సుశీలుఁడు

ఇఁకనుఁ బురుషార్థ స్వరూపంబును గూర్చి సెలవిందు.

వరవరముని

పురుషార్థస్వరూపమనఁగా ధర్మము, అర్థము, కామము, కైవల్యము, మోక్షము.

ధర్మమనఁగా దేహసంరక్షణముగా నాచరించువృత్తి. మానవుండైనవాఁడెట్లు నడచిన సార్థకమో సౌఖ్యమో యెట్లు చరించినఁ బాపములేదో బ్రతికినంతకాలము దేహయాత్రయెట్లు జరుగునో అదియు, మాతృధర్మము, పితృధర్మము, కన్యాధర్మము, సహోదరధర్మము, గృహస్థధర్మము మొదలైనవి తెలుసుకొని సక్రమముగా నడచుట, సామాన్యధర్మము విశేషధర్మములయొక్క భేద మెఱుంగుట.

అర్థమనఁగా వ్యవసాయము ధేనుపోషణము మొదలైన వ్యాపారములచే ధనధాన్యములు సంపాదించి అతిథులకు నభ్యాగతులకు వేల్పులకుఁ బితరులకు యాగాదులకు సత్పాత్రములకు నుపయోగించుట. కామమనఁగా ధనము ధాన్యము చేలములు మానికంబులు పెండ్లాము పిల్లలు దొడ్లు తోఁటలు తొఱ్ఱులు గొఱ్ఱెలు గుఱ్ఱంబు లేనుంగులు మొదలగు వానిచేఁగలుగు నింద్రియ సుఖంబు లిహలోకకామము. స్వర్గలోకంబున నందనవనాదులలో రంభాది కాంతలచేఁ గలుగు సుఖము పారలౌకికము. ఇదికామము.

కైవల్యమనఁగాఁ బ్రకృతిబంధమువదలించుకొని వైకుంతమున కవాచ్యస్థలమువ లెనుండు లోకంబునొంది జీవుఁడుండువరకు శరీరము లేక సుఖదుఃఖములు లేక యుండుట.

మోక్షమనఁగా బంచాశత్కోటియోజన విస్తీర్ణంబైన బ్రహ్మాండమును, సప్తావరణములు, మూలప్రకృతినిదాఁటి విరజాస్నానంబుచేఁ బ్రకృతిబంధమును వదలించుకొని పంచోపనిషణ్మయ శరీంబు ధరించి భగవత్ప్రాప్తినొందుట. యిప్పటికర్థపంచకంబు ముగిసినది. యిది తిరుమంత్ర, ద్వయమంత్ర, చరమశ్లోకములయందు సంగ్రహము గానున్నది.

సుశీలుఁడు

స్వామీ! వేల్పుల నేకులుండఁగా మీరొక్క విష్ణువునే గొప్పగాఁ జెప్పుచున్నారు. కారణమేమి ?

వరవరముని

నేనుమాత్రమే కాదు సామాదివేదంబులును, మన్వాదిస్మృతులును, రామాయణ భారతాదియితిహాసంబులును, విష్ణుపాద్మభాగవతాది సాత్త్వికపురాణంబులును, నారద వ్యాస వాల్మీకాది మునికుల సార్వభౌములును, ఉపనిషత్తులును, భగవద్గీతాశాస్త్రంబును, ప్రహ్లాదాది భక్తులును, జడభరతాది జ్ఞానయోగులును, భూతసరోమహదా హ్వయ విష్ణుచిత్తాది యాళ్వారులును, శఠగోపనాథయామున రామానుజాది వైష్ణవశిఖామణులును, ద్వైతాద్వైతాది మతకర్తలును విష్ణువే సర్వోత్కృష్ట దైవంబని కొనియాడుచున్నారు. మహాకవులు, పండితులు, నిదేమార్గమవలంబించిరి.

'ఏకోవైనారాయణోఆసీత్' = నారాయణుఁడొక్కడేయుండెను. దివ్యోదేవో 'ఏకోనారాయణః' = దివ్యులకు దేవుడు నారాయణుఁడొక్కఁడే 'నారాయణో జగన్మూర్తి' = నారాయణుఁడు జగచ్ఛరీరి. ఇత్యాది వాక్యంబులచే శ్రుతి వక్కాణింపుచున్నది.

శ్లో॥ ఆలోక్యసర్వశాస్త్రాణి విచార్యచపునఃపునః ।
ఇదమేకం సునిష్పన్నంధ్యేయో నారాయణస్సదా ॥

సర్వశాస్త్రములు మరలమరల విచారించినను నారాయణుఁ డొక్కడే ధ్యానింపఁబడఁదగినవాఁడు. ఇదియొక్కటియే మంచి మార్గము.

శ్లో॥ సత్యంతస్యంపునః సత్యముద్ధృత్యభుజముచ్యతే ।
వేదశాస్త్రాత్పరంనాస్తి, నదైవం కేశవాత్పరం ॥

వేదశాస్త్రముకంటే శ్రేష్ఠమైనదిలేదు. కేశవునికంటె దైవములేదు ఇట్లని భుజమెత్తి చెప్పఁబడుచున్నది సత్యము. సత్యము. సత్యము

శ్లో॥ నారాయణో జగత్సర్వం, సర్వకాలే ప్రజాయతే ।
పరాదపిపరాశ్చాసౌ, తస్మాన్నాస్తి పరాత్పరః ॥

సర్వకాలమునందు సర్వజగత్తును నారాయణుఁడు పుట్టించుచున్నాడు. ఆ కారణమువలన వేఱొక పరాత్పరుండులేడు.

శ్లో॥ ఏక ఏవజగత్స్వామీ, శక్తిమానచ్యుతప్రభుః ।
తదంశాశ్శక్తిమన్యోన్యే, బ్రహ్మేశానాదయో మరాః ॥

శక్తిమంతుండును ప్రభువునగు నచ్యుతుఁడొక్కఁడే సర్వజగత్తునకు స్వామి. బ్రహ్మరుద్రాదు లతనియంశముచే శక్తిమంతులైరి.

శ్లో॥ వేదేరామాయణేచైవ, భారతేభరతర్షభ ।
ఆదౌమధ్యే తథాచాంతే, విష్ణుస్సర్వత్రగీయతే ॥

వేదాధ్యయనమునందును, రామాయణ భారతములు చదువునప్పుడును, ఆదిమధ్యాంతములయందు విష్ణువు కీర్తింపఁబడు చున్నాడు. అనఁగా విష్ణుస్తోత్రముచేసికాని వానిఁజదువరనుట.

శ్లో॥ ధ్యాయేన్నారాయణం దేవం, స్నానాదిషుచకర్మసు ।
బ్రహ్మలోక మవాప్నోతినచేహాజాయతేపునః ॥

స్నానాదికర్మలు చేయునపుడు నారాయణుని ధ్యానము చేయవలెనట్లు చేయువాఁడు బ్రహ్మలోకమునుఁ బొందుచున్నాడు. మరల నీలోకంబునఁబుట్టడు. అని దక్షుఁడుచెప్పెను.

శ్లో॥ నారాయణం పరిత్యజ్య, హృదిస్థం ప్రభు మీశ్వరం ।
యోఽన్యమర్చయతేదేవం, పరబుద్ధ్యాసపాపభాక్ ॥

హృదయమందున్నవాఁడును ప్రభువు నీశ్వరుఁడైన నారాయణుని వదలి యితరదేవతను పరబ్రహ్మమును బుద్ధితో నెవ్వఁడర్చించుచున్నాడో

వాఁడు పాపములకు స్థానమగునని ప్రాజాపత్యస్మృతి చెప్పుచున్నది.

శ్లో॥ యేద్విషంతి మహాత్మానం, నస్మరంతి చ కేశవమ్ ।
న తేషాం పుణ్యతీర్థేషు, గతిస్సం సర్గిణామపి ॥

ఎవ్వరు కేశవుని ద్వేషించి స్మరింపరో, వారికిఁ బుణ్యతీర్థాదులయందు స్నానము చేసినను గతిలేదు అని భారతము చెప్పుచున్నది.

శ్లో॥ యేఽన్యందేవం పరత్వేన, వదన్త్యజ్ఞాన మోహితాః ।
నారాయణా జ్జగన్నాథాత్తే వైపాషండినఃస్మృతాః ॥

ఎవ్వరజ్ఞానముచే మోహితులై జగత్ప్రభువైన నారాయణుని కంటె వేఱొక పరాత్పరుండున్నాడని చెప్పుదురో వారు పాషండులనబడుదురని బ్రహ్మాండ పురాణము చెప్పుచున్నది.

శ్లో॥ యస్తునారాయణందేవం, సమత్వేనాభిమన్యతే ।
సతుతేనావమానేన, నరకాన్నాతివర్తతే ॥

ఎవ్వఁడు నారాయణు నన్యదేవతా సమానునిగాఁ దలంచు చున్నాఁడో వాఁడెన్నటికి నరకమునుండి దాఁటలేడు.

శ్లో॥ యేతుసామాన్యభావేన, మన్యంతే పురుషోత్తమం ।
తేవైపాషండినోజ్ఞేయాః, నరకార్హానరాధమాః ॥

ఎవ్వరు పురుషోత్తముని సామాన్యునిగాఁ దలంచుచున్నారో వారు పాషండులని నరకమునుఁ బొందుట కర్హులని తెలియవలయును.

శ్లో॥ యఃపుత్రః పితరంద్వేష్టి, తం విద్యాదన్యరేతసం ।
యోవిష్ణుం సతతంద్వేష్టి, తం విద్యాదంత్యరేతసం ॥

ఏ పుత్రుఁడు సదా తండ్రిని ద్వేషించునో వాఁడన్యబీజమునకుఁ బుట్టినవాఁడని తెలియవలయు. నెవ్వఁడు విష్ణువును సదా ద్వేషించు చున్నాడో వాడంత్యజాతివాని బీజమునకుఁ బుట్టినవాఁడని తెలియవలయును.

శ్లో॥ విష్ణుభక్తి విహీనోయ, సర్వశాస్త్రార్థవేద్యపి ।
బ్రాహ్మణ్యం తస్యనభవే, తస్యోత్పత్తి నిరూప్యతాం ॥

ఎవనికి విష్ణుభక్తి లేదో వాఁడు సర్వశాస్త్రార్థములు తెలిసినవాఁడైనను వానికి బ్రహ్మత్వము రాదు. రాకపోఁగా వాని జన్మమొట్లు గల్గెనాయని విచారింపవలయును.

శ్లో॥ చతుర్వేద్యపియో విప్రో, వాసుదేవం నవిందతి ।
వేదభారభరాక్రాంత, స్సవైబ్రాహ్మణగర్దభః ॥

ఏవిప్రుఁడు నాలుగువేదములు తెలుసుకొన్నవాఁడై వాసుదేవు నెఱుంగడో వాఁడు బ్రాహ్మణనామధారియగు గాడిదె.

శ్లో॥ బ్రహ్మాదయస్సురాస్సర్వే, విషుమారాధ్యతేపురా ।
స్వంస్వంపదమను ప్రాప్తాః, కేశవస్యప్రసాదతః ॥

బ్రహ్మాదిదేవతలు పూర్వము విష్ణువునారాధించి యా కేశవుని దయచేఁదమతమ పదవులు పొందిరి. యీ ప్రమాణము లిట్లుండఁగా రామాయణం వేదసమస్తమని పేర్కొనఁబడిన యాదికావ్య మేమి చెప్పుచున్నదో వీక్షింపుడు.

శ్లో॥ కోన్వస్మిన్ సాంప్రతంలోకే, గుణవాన్కశ్చవీర్యవాన్ ।
ధర్మజ్ఞశ్చకృతజ్ఞశ్చ, సత్యవాక్యోదృఢవ్రతః ॥

ఇప్పుడీలోకమునందు గుణవంతుండు వీర్యవంతుఁడు ధర్మములు తెలిసినవాఁడు చేసిన మేలుమఱువనివాఁడు. సత్యవాది దృఢవ్రతుఁడెవ్వఁడనియు మఱికొన్ని ప్రశ్నలచేఁబరాత్పరుఁ డెవ్వఁడని యడిగిన వాల్మీకిని గుఱించి :-

శ్లో॥ ఇక్ష్వాకువంశప్రభవో రామోనామ జనైశ్రుతః ॥

ఇక్ష్వాకువంశంబునఁ బుట్టిన శ్రీరామచంద్రుఁడే పరాత్పరుఁడని నారదుండు చెప్పెను.

శ్లో॥ అహంవేద్మి మహాత్మానం, రామం సత్యపరాక్రమమ్ ।
వసిష్ఠోపి మహాతేజా యేచేమే తపసిస్థితాః ॥

ఓదశరథుఁడా ! యీరామచంద్రుని ప్రభావము అనఁగా పరబ్రహ్మమగుట నేనెఱుంగుదును. సరస్వతీవల్లభ పుత్రుఁడైన వసిష్ఠుఁడును గొప్పతపస్సంపన్నులగు నగస్త్యాది మహామును లెఱుంగుదురని విశ్వామిత్రుఁడు చెప్పెను. దీనిచేఁ దపశ్శక్తి లేనివానికి రామపరతత్వము గోచరింపదని తేటపడుచున్నది.

శ్లో॥ ఆకాశప్రభవోబ్రహ్మ, శాశ్వతోనిత్యఅవ్యయః ॥ విష్ణునాభీ కమలంబునఁబుట్టిన బ్రహ్మనాకాశంబున జనించెనని వసిష్ఠుడు చెప్పుటచే

నారాయణుఁ డాకాశముభంగి సర్వవ్యాపకుఁడని నిర్దోషుఁడని శాశ్వతుఁడని తేలుచున్నది.

ఒకానొకప్పుడు శివకేశవుల యం దెవ్వరధికులని దేవతలు బ్రహ్మనడుగగా మీరే తెలుసుకొండని విష్ణుశంభులకురణంబు కల్పించె. నత్తఱిశివుఁడోడె. విష్ణువు గెల్చినక్కారణంబున

శ్లో॥ అధికంమేని రేవిష్ణుం, దేవాస్సర్షిగణాస్తథా ॥

దేవతలును, మునులును, విష్ణుని సర్వాధికునిగా నెఱింగిరని పరశు రాముండు చెప్పెను.

తీర్థీయవ్యాఖ్యానమందుసహితము

శ్లో॥ విష్ణుపరాక్రమై జ్జడీకృతం, ధనుః శితకంతంద్రుష్ట్వా
సకలజగద్వ్యాపకం విష్ణుం, శితికంఠాత్పరాక్రమైః ।
జ్ఞానశక్త్యాదిభిశ్చ అధికం, సర్వోత్తమంమేనిరే ।

అనియున్నది.

శ్లో॥ తేవయం భవతారక్ష్యాః, భవద్విషయవాసినః ।
నగరస్థోవనస్థోవా, త్వంనోరాజాజనేశ్వరః ॥

మేము నీ దేశనివాసులము. నీచే గాపాడఁబడఁ దగినవారము. రాజ్యమందున్ననుఁ, గాననమందుండినను, నీవే మాకుఁ బ్రభుండవని దండకామునీంద్రులు శరణాగతిచేయుటచే రాముని పరత్వమునుఁ దెలిపినవారైరి.

శ్లో॥ రామోవిగ్రహవాన్ ధర్మా, స్సాదుసత్య పరాక్రమః ।
రాజా సర్వస్యలోకస్య, దేవానాం మఘవానివ ॥

శ్రీరాముఁడు విగ్రహముదాల్చిన ధర్మము, సాధువు, సత్యపరాక్రమములు గలవాఁడు. దేవతలకు దేవేంద్రునిరీతి సర్వలోకములకు నాథుఁడు. అని మారీచుఁడు చెప్పెను.

శ్లో॥ త్వమప్రమేయశ్చ దురాసదశ్చ, జితేంద్రియశ్చోత్తమధార్మికశ్చ ।
అక్షయ్యకీర్తిశ్చ విచక్షణశ్చ, క్షితిక్షమావాౝ క్షతజోపమాక్షః॥

నీవు ప్రమాణములచే నిర్ణయింప నలవిగానివాఁడవు, పొందనలవి గానివాఁడవు, యింద్రియముల జయించినవాఁడవు, దర్మాత్ములలో

శ్రేష్ఠుఁడవు, నాశములేని కీర్తిమంతుఁడవు, మహాపండితుండవు, నేలభంగి నోర్పుగలవాఁడవు, యెఱ్ఱని లోచనాంతములు గలవాఁడవని తార నుతించెను.

శ్లో॥ బ్రహ్మాస్స్వయంభూ శ్చతురాననోవా ।
రుద్ర స్త్రి నేత్రస్త్రిపురాంతకోవా ।
ఇంద్రోమహేంద్రస్సురనాయకోవా ।
త్రాతుం నశక్తాః యుధిరామవధ్యం ॥

స్వయంభువై నాలుగు మోములుగల బ్రహ్మగాని, త్రినేత్రములు గలిగి త్రిపురాసురసంహార మొనర్చిన రుద్రుండుగాని, దేవతలకుఁ బ్రభువై వృత్రాసురునిఁ జంపిన యింద్రుండుగాని, రామునకు వధ్యుఁడైన నిన్నుఁగా వలేరు. 'త్రాతుంనశక్తాః' అను బహువచన ప్రయోగముచే ముగ్గు రేకీభవించియుఁ గావఁజాలరని శ్రీయాంజనేయులవారు రావణునికిఁ జెప్పిరి.

శ్లో॥ సర్వలోకశరణ్యాయ, రాఘవాయమహాత్మనే ।
నివేదయ తమాంక్షిప్రం, విభీషణ ముపస్థితమ్ ॥

సర్వలోకములకు సర్వభూతములకు రక్షకుఁడై రఘుకులము నందవతరించిన పరమాత్మయగు రాములవారికి నా విషయము చెప్పుడని వానరులతో విభీషణాళ్వారు విన్నవించిరి.

ఇదేవిధముగా నతికాయుఁడు, మాల్యవంతుఁడు, మందోదరి, మొదలైనవారు రాక్షసులైనను రాముని పరత్వమును గొనియాడిరి. రావణవధానంతరము దేవతలతోను మునులతోను లంకకువచ్చిన బ్రహ్మశ్రీరాముని సవినయంబుగా గాంచి నిర్జరుల సమక్షంబున 'సీతా లక్ష్మీర్భవాౝ విష్ణుః' అని యారంభించి, నీవు విష్ణుండువు, సీత మహాలక్ష్మి రావణసంహారంబునకై లోకంబున నవతరించితివి. నీ నేత్రములు సూర్యచంద్రులు, నీ నాలుక సరస్వతి, నీ నిట్టూర్పు వాయువు, నీవే సర్వలోకాధిపతివి, నిన్నారాధించినవారికిఁ బరాభవంబు లేదని స్తుతించె. నందులకు రుద్రాదిదేవతలు శిరసాహించి యంగీకరించిరి. యితిహాస రత్నమని విఖ్యాతిఁగాంచిన రామాయణమంతయు విష్ణుపరత్వమునే స్థాపించుచున్నదిగదా! ఇఁక భారతవిషయ మాలోచింతము.

మయసభామధ్యంబున భీష్మునాజ్ఞచే యుధిష్ఠిరుండు శ్రీకృష్ణుల వారి కగ్రపూజనొసంగగా శిశుపాలుండు సహించక వాసుదేవుని దూషింపుచుండె.

నాసమయంబున లక్షలకొలఁదిగానున్న సభవారేమియుం బలుకక యూరక చూచుచుండి రయ్యవసరంబున సహదేవుండు దీనికి వీరందఱు సమ్మతించిరా యేమను సందేహముతో విజృంభించి

శ్లో॥ కేశవం కేశిహంతారమప్రమేయ పరాక్రమం ।
పూజ్యమానం మయాయేవః కృష్ణంస సహతేనృపాః
సర్వేషాం బలినాం మూర్ధ్ని మయేదం నిహతం పదమ్ ॥

అప్రమేయ పరాక్రముండును కేశియను రక్కసునిఁ జంపినవాఁడును, కేశవుండునగు శ్రీకృష్ణుని మేము పూజించినందు కీ సభలో నెవ్వరుసహింపరో వారిశిరంబున నిది మోపెదనని యెడమ పాదమెత్తెను. దానికి సంతోషించి దేవతలు సహదేవునిపైఁ బూలవాన గురియించిరి. యింతలో.

శ్లో॥ కృష్ణంకమలపత్రాక్షం, నార్చయిష్యంతియేనరాః ।
జీవన్మృతాస్తుతేజ్ఞేయాః నసంభాష్యాఃకదాచన ॥

కమలపత్రములవంటి కన్నులుగల శ్రీకృష్ణు నెవ్వరు పూజింపరో వారు బ్రతికియుఁ జచ్చినవారు. అనఁగా శవములతో సమానులు. యెప్పుడైనను వారితో మాటలాడరాదని జ్ఞాననిధియైన బ్రహ్మపుత్రుఁడు నారదుండు చెప్పెను.

భారతారణ్యపర్వంబున సౌగంధిక పుష్పంబున కేగు భీమునితో, విష్ణువే జగత్కారణవస్తువనియుఁ బరబ్రహ్మమనియు నతండు గృతయుగంబునఁ దెల్లని రూపంబుతోఁ ద్రేతాయుగంబున నెఱ్ఱని రూపంబుతో ద్వాపరంబునఁ బచ్చనిరూపంబుతోఁ గలియందు నల్లనిరూపంబుతో జగత్తును రక్షించునని నవవ్యాకరణపండితుండగు హనుమానులు వచించిరి.

శ్లో॥ గ్రహచంద్రార్క నక్షత్రా, ఖందిశోభూర్మహోదధిః ।
వాసుదేవస్య వీర్యేణ విధృతాని మహాత్మనః ॥

స్వర్గము సూర్యచంద్రులు నక్షత్రములు ఆకాశము దిశలు భూమి సముద్రము, వాసుదేవుని యొక్క శక్తిచేత ధరింపఁబడుచున్నవి.

శ్లో॥ ససురాసురగంధర్వం, సయక్షోరగరాక్షసం ।
జగద్వశేవర్తతేదం, కృష్ణస్యసచరాచరమ్ ॥

సురాసురగంధర్వయక్షోరగరాక్ష సాదులతోఁగూడిన చరా చర ప్రపంచమంతయు శ్రీకృష్ణుని వశములోఁ బ్రవర్తింపుచున్నది.

శ్లో॥ ఇంద్రియాణిమనోబుద్ధి, స్సత్వం తేజోబలం ధృతిః ।
వాసుదేవాత్మకాన్యాహుఁ క్షేత్రంక్షేత్రజ్ఞఏవచ ॥

ఇంద్రియములు, మనస్సు, బుద్ధి, సత్వము, తేజస్సు, బలము, ధైర్యము, క్షేత్రము, క్షేత్రజ్ఞుఁడు వాసుదేవాత్మకములని చెప్పుదురు.

శ్లో॥ ధర్మస్యప్రభురచ్యుతః, ధర్మమునకచ్యుతుండు ప్రభువు.

శ్లో॥ ఋషయః పితరోదేవా, మహాభూతానిధాతవః ।
జంగమాజంగమంచైవ జగన్నారాయణోద్భవమ్ ॥

మునులు, పితృదేవతలు, దేవతలు, మహాభూతములు, ధాతలు, జంగమస్థావరములు వీనితోఁగూడిన జగత్తు నారాయణునివలనఁబుట్టినది.

శ్లో॥ యోగోజ్ఞానం తథాసాంఖ్యం, విద్యాశిల్పాది కర్మచ ।
వేదశాస్త్రాణి విజ్ఞాన మేతత్సర్వం జనార్దనాత్ ॥

యోగము, జ్ఞానము, సాంఖ్యము, విద్యా, శిల్పాది కర్మములు, వేదములు, శాస్త్రములు, విజ్ఞానము, విష్ణునివలనఁబుట్టినవి.

శ్లో॥ ఏకోవిష్ణుర్మహద్భూతం, పృథగ్భూతాన్యనేకశః ।
త్రిలోకాన్ వ్యాప్యభూతాత్మాభుంక్తే విశ్వభుగవ్యయః ॥

తక్కినభూతము లనేకమున్నను విష్ణు వొక్కడే మహాభూతము అవ్యయుండైన విష్ణు వీ విశ్వమును భోగింపుచున్నాడు.

శ్లో॥ విశ్వేశ్వరమజందేవం, జగతః ప్రభవావ్యయమ్ ।
భజంతియే పుష్కరాక్షం, నతేయాంతిపరాభవం ॥

విశ్వమున కీశ్వరుఁడు పుట్టుకలేనివాఁడు, జగత్తులనుఁ బుట్టించువాఁడునైన కమలాక్షు నెవ్వరు భజింతురో వారు పరాభవమునుఁ బొందరు; అని ధర్మరాజునకు భీష్ముండు చెప్పెను. (భారతానుశాసనిక పర్వము.)

కామ్యకవనంబున శ్రీకృష్ణ సహితులైన పాండవులుండగా మార్కండేయుం డచ్చటికివచ్చి బహువిధపురాణగాథలు వక్కాణించి ధర్మరాజుతో యుధిష్ఠిరా ! పూర్వమొకప్పుడు ప్రళయంబుగల్గిలోక మంతయు

జలమయంబుగాఁగా నేను నిలువ నీడలేక యల్లాడుచుఁబోయిపోయి యొక్కచోట వటపత్రశాయియైన బాలునిఁగంటి. నబ్బాలుఁడు నన్నుఁగాంచి మార్కండేయా ! చాల డస్సితివి. నానోటిలో విశ్రమింపుమనియె. నందులకే నాశ్చర్యపడి యిబ్బాలుండెవ్వఁడు యితని నోరెంత నేను విశ్రమించు టెట్లని విచారింపుచుండ నాప్రయత్నము లేకయే లోనం బ్రవేశించి బ్రహ్మాండమంతయు నుండుటఁగాంచి చిరకాలము సుఖించి మరల బయలికి వచ్చిన నన్నుఁగాంచి యబ్బాలుండు మునీంద్రా! నేను సర్వజగత్కారణుండగు నాదినారాయణుండ నని వచించి యదృశ్యుండయ్యె.

శ్లో॥ యఃసదేవోమయాదృష్టః, పురాపద్మాయతేక్షణః ।
సఏషపురుషవ్యాఘ్రః, సంబంధీతేజనార్దనః ॥

ఏ దేవునిఁబూర్వయుగక్షయ కాలంబుననేనుగాం చితినో ఆపద్మాక్షుండు పురుష శ్రేష్ఠుఁడు జనార్దనుండితండె. యిప్పుడు నీకు సంబంధుఁడైనాఁడు.

శ్లో॥ అస్యైవ వరదానాద్ధి స్మృతిర్న ప్రజహాతిమామ్ ।
దీర్ఘమాయుశ్చ కౌంతేయ స్వచ్ఛందమరణం మమ ॥

ఈ దేవునివరప్రభావమువలననే జ్ఞాపకశక్తి నన్ను విడువలేదు. దీర్ఘాయువును స్వచ్ఛందమరణమును బొందినాను.

శ్లో॥ సర్వేషామేవ భూతానాం, పితామాతా చ మాధవః ।
గచ్ఛధ్వమేనం శరణం శరణ్యం కౌరవర్షభ ॥

ఓ ధర్మరాజా ! సర్వభూతములకుఁ దల్లియుఁ దండ్రియు నై లక్ష్మీపతి యై రక్షకుఁడైన యీ కృష్ణుని శరణు జెందు మని మార్కండేయుండు చెప్పెను. (భారతారణ్యపర్వము.)

శ్లో॥ పరంబ్రహ్మ పరంధామ పవిత్రం పరమం భావాన్
పురుషం శాశ్వతం దివ్య మాదిదేవ మజం విభుమ్ ॥
ఆహుస్త్వామృషయస్సర్వే దేవర్షిర్నారదస్తథా ।
అసితో దేవలో వ్యాసో స్వయంచైవ బ్రవీషిమే ॥

ఓకృష్ణా ! నీవు పరబ్రహ్మవు, పరంధాముఁడవు, పరమపవిత్రుఁడవు నిన్ను సర్వవ్యాపకుఁడగు పురుషునిగా నాదిదేవునిగాఁ బుట్టుకలేని వానిగా

విభునిగా సర్వమునులు నట్లే అసితుఁడు, దేవులుఁడు వ్యాసుఁడు చెప్పుచున్నారు. నీవు నట్లే చెప్పుచున్నావు

శ్లో॥ సర్వమేతదృతంమన్యే, యన్మాంవదసి కేశవ ।
నహితేభగవన్ వ్యక్తిం, విదుర్దేవానదానవాః ॥

నీవు నా కొఱకై (నన్నుఁగూర్చి) యేమి చెప్పితివో యిది నిజమని నమ్ము చున్నాను. నీస్వరూపమును సర్వదేవతలు రాక్షసులు నెఱుంగరు.

శ్లో॥ త్వమాదిదేవః పురుషః పురాణ ।
స్త్వమస్యవిశ్వస్యపరం నిధానమ్ ।
వేత్తాసి వేద్యంచపరంచధామ ।
త్వయాతతం విశ్వమనంతరూప ॥

కృష్ణా ! నీవాది దేవుఁడవు, పురాణపురుషుఁడవు, యీవిశ్వమున కాధారుఁడవు, సర్వజ్ఞుఁడవు, తెలియఁబడఁదగినవాఁడవు. అంతములేని రూపము గలవాఁడా ! యీ విశ్వమంతయు నీచే వ్యాపింపబడియున్నది.

శ్లో॥ పితాసిలోకస్య చరాచరస్య, త్వమస్యపూజ్యశ్చ గురుర్గరీయాన్ ।
సత్వత్సమో స్త్యభ్యధికః కుతోన్యో లోకత్రయేప్యప్రతిమ ప్రభావ ॥

అసాధారణ ప్రభావముగలవాఁడా, చరాచరములతోఁ గూడిన లోకమునకుఁ దండ్రివి, పూజ్యుండవు, గురుండవు, గొప్పవాఁడవు. ముల్లోకంబులందు నీకు సమానుఁడులేడు. అధికుండెక్కడనుండునని యర్జునుఁడు నుతించెను (భగవద్గీత.)

శ్లో॥ సర్వస్యచాహం హృదిసన్నివిష్టో ।
మత్తఃస్మృతిర్జ్ఞా నమపోహనంచ ।
వేదైశ్చసర్వైరహమేవవేద్యో ।
వేదాంతకృద్వేద విదేవచాహమ్ ।

అర్జునా ! నేను సర్వభూతముల హృదయమందున్నాను. జ్ఞాపకము జ్ఞానము ఊహ వారికి నావల్లనే గల్గుచున్నవి. నేను సమస్తవేదముల చేతఁ దెలియఁబడఁ దగినవాఁడను వేదాంతములు చేసినవాఁడ వేద విదుండను నేనె.

శ్లో॥ యస్మాత్క్షరమతీతోఽహ మక్షరాదపిచోత్తమః ।
అతోఽస్మి లోకే వేదేచ ప్రథితః పురుషోత్తమః ॥

ఎందువల్ల నేను క్షరు నతిశయించి యక్షరునకంటే నుత్తముఁడనై యున్నానో యందువలన లోకమునందును వేదమునందును పురుషోత్తముఁడని ప్రసిద్ధిఁ జెందితి నని శ్రీకృష్ణస్వామివారు చెప్పిరి. (భగవద్గీత)

శ్లో॥ నారాయణసమం దేవం నభూతం నభవిష్యతి ।

నారాయణునితో సమానుఁడైనదేవుఁడు భూతకాలమునందును భవిష్యత్కాలమునందును లేడని సూతుండును, సజ్జనుండు నిన్ను స్మరింపక జీవింప లేడని ధ్రువుండును, నళినాక్షుండను నిధానంబుఁ గంటి నని ప్రహ్లాదుండును, జలమును విడిచినమత్స్యమురీతి నిన్ను విడిచి బ్రతుకఁ జాల నని లక్ష్మణుఁడును, నీ ప్రభావంబు విని సంతోషించుటకై శరీరంబునిలుపుదునని హనుమయు, సంసారోత్తారకంబులైన నీపాదంబులు నాహృదయంబున నెల్లప్పుడు నిల్పుమని నారదుండును, మహాయోగులు చిరకాలము శ్రమపడి దాఁట, రాని సంసారవార్థినినీ భుక్తశేషానుభవముచే సులభంబుగ దాటుదునని యుద్ధ వుండును, నా జీవితంబును రాజ్యంబును సుఖంబును నీయందే గలవని విభీషణుండును, శ్రీకృష్ణునిఁజూడక మాజీవంబులు నిలువవని గోపికలును; నీవు లేని స్వర్గంబు నాకరణ్యంబని సీతామహాదేవియు, నీకు దాస్యంబు చేయనిచో నాజన్మమెందుకని రుక్మిణీదేవియు భగవంతుని యందుఁదమకుఁగల ప్రీతిని వెల్లడించిరి. మఱియు వేంకటాచలంబుననొక రాయిగాఁ బుట్టింపుమని కుల శేఖరాళ్వారును, నీదాసుల గృహంబునఁ గీటకజన్మ మిమ్మని యాళవందారును, శ్రీరంగంబునఁ గుక్కగాఁ బుట్టింపుమని పరాశర భట్టరువారును, నాకులధనమై భోగ్యమై తల్లివై తండ్రియైయుండు నీ శ్రీపాదంబులెప్పుడు శిరస్సున నలంకరించుకొందునో యని యుదైవరులును, నీపాదంబులు నాకన్నులలో దూరెనని నమ్మా ళ్వారును, గోపికనై హరింగొల్వ

నైతినని పెరియాళ్వారును శ్రియః పతియందుఁ దమకుఁ గల గాఢభక్తిని వెల్లడించిరి.

సుశీలుఁడు

మీ రిన్నివిధముల వక్కాణించుట చేతఁ దేలినవిషయ మేమో తెలియలేదు. సారాంశం బెటిఁగింపుడు.

వరవరముని

శరీరాంతర్గతుండైన జీవుఁడొకడున్నా డనియు, నతండు భగవత్పరతంత్రుఁడనియు, జగదీశ్వరుండు విష్ణువనియు, నీజీవుం డవ్విష్ణునిఁదప్ప నన్యదేవతల నర్చింపరాదనియు, వేలుపులు, నిరాబారులు చదువరులు సర్వభూతములు నారాయణునికి శేషభూతులనియు, గోవిందు నాశ్రయించి తదనుగ్రహంబుగాంచినం గాని జీవునికి శాశ్వతానందము గలుగదనియుఁ, గేశవు నవతారంబు లప్రాకృతంబులుగాని కర్మవశ్యములు గావనియు, భగవద్రామానుజ సిద్ధాంతంబు గొప్పదనియు, విష్ణుని దూషించువాడు సంతతదుఃఖంబును, విష్ణుభక్తులు శాశ్వతా నందమునుఁ బొందుదురనియు నొక్కివక్కాణించితిని.

సుశీలుఁడు

రామానుజసిద్ధాంతంబు గొప్పదేనా ?

వరవరముని

అడుగవలసినపనిలేదు.రామానుజసిద్ధాంతంబు సారమైనది గనుకనే, అద్వైతసిద్ధాంత సార్వభౌముండగు యజ్ఞపురుషుఁడు, యాదవ ప్రకాశులు శ్రీరామానుజులవారిని, సర్వవిద్వజ్జన కోలాహలుండని పొగ డొందిన యక్కియాళ్వారు యామునాచార్యులవారిని, షణ్మత స్థాపకబిరుదాంకితుం డగువేదాంతి శ్రీభట్టరువారిని, శ్రీరంగముదనారు కూరేశుని, నంబూరి వరదరాజునంజియ్యరును, ఆశ్రయించి శిష్యులైరి. వైష్ణవులలోఁ బ్రసిద్ధులై యన్యమతంబునఁ బ్రవేశించినవా రొక్క రైనం గానరారు. కావున నీవును రామనుజ సిద్ధాంతమునందే నిలువుము.

గద్య

ఇది శ్రీసీతావల్లభ ప్రసాదసమాసాదిత కవితాప్రవీణ వేదాల సీతారామా
చార్యకృపాలబ్ధ మంత్రరత్నానుసంధాన పవిత్రాంత రంగ, నిఖిలదుర్మత
శిలోచ్ఛయదంభోళీభూత సముద్రాల లక్ష్మణాచార్యాను గ్రహబోధిత
విశిష్టాద్వైతరహస్యార్థధురంధర, శఠగోపయతిరాడ్వర వరయోగి
ప్రభృతి పూర్వాచార్య చరణసరోజ భ్రమరాయమాన
పయిడిపాలగోత్ర మొవ్వవంశతిలక కృష్ణార్య
కృష్ణమాంబాతనూజ శ్రీవైష్ణవవిధేయ
వేంకట దాసనామ ధేయ ప్రణీతం
బైన వరవరమునిహృదయము
నందు ద్వితీయభాగము
సంపూర్ణము.

శ్రీమతేరామానుజాయనమః

వరవరమునిహృదయము

తృతీయభాగము

సుశీలుఁడు

ఈమతమును పూర్వమునుండి యెవ్వరు పాలించిరి ?

వరవరముని

వ్యాస, బోధాయన, టంక, ద్రమిడాచార్య, గుహదేవ, భారుచి నాథముని, యామునా చార్యులాదిగాఁగల మహానుభావులు పాలించిరి. దానిని రామనుజ యోగీంద్రు లుద్ధరించిరి ?

సుశీలుఁడు

రామానుజ యోగీంద్రులనఁగా నెవ్వరు? వైష్ణవసిద్ధాంతము నెట్లుద్ధరించిరి?

వరరవరముని

రామనుజ ప్రభావంబు సాకల్యంబుగా వర్ణించుటకు సాధ్యంబు గాదైనను సంగ్రహంబుగా వివరింతు నాలకింపుము. పూర్వము కలిప్రభుత్వంబుచే జనులందఱు నాస్తికులై నిరీశ్వర వాదమతంబులఁ బ్రవేశించి నరకమున కేగుచుండఁగా నా విషయంబు శ్రీవైకుంఠంబున నుండు లక్ష్మీదేవి వీక్షించి దుఃఖంపఁగా శ్రీమనన్నారాయణుం డామెంగని నీ దుఃఖమునకు గారణంబేమనియడిగె నంతనప్పెరిపిరాట్టివారితో నాథా ! మనకు నిత్యవిభూతి; లీలావిభూతి యని రెండు విభూతులు గలవు. నిత్యవిభూతిలో నుండువా రపారసుఖంబు లందుచున్నారు. లీలా విభూతియందుండువారిలో నన్నములేక కొందఱు, వస్త్రములు లేక కొందఱు, కామక్రోధాదులచేఁగొందఱు, పరస్పర విరోధంబులచేఁ గొందఱు; దేహమే జీవుఁడని తలంచి పాపకార్యములచేసి పలుమాఱు నరకముల పాలగు చున్నారు. వారును నా బిడ్డలేగనుక పరమపదంబున కేలరాగూడదని వాపోవుచున్నాననెను.

జనార్దనుం డదివిని ప్రాణేశ్వరీ! నీవు చెప్పినది నిక్కంబు. కాని జీవులు ప్రళయకాలమందు మిణుగురు పుర్వులవలెనుండఁగా నేను వారి మేలుగోరి కరణకళేబరంబు లిచ్చితిని. కలుపుదీయుటకిచ్చిన కఱ్ఱుతోఁ గన్నులు పొడుచుకున్నట్లు దేహధారు లక్కరణకళేబరంబులచే నర కాగ్నిపాలై రెట్లంటివా మదీయునామోచ్చారణ కిచ్చిననాలుకతో నబద్ధంబులు బరుషంబులు వల్కసాగిరి. నన్నుఁబూజించుట కిచ్చిన చేతులతో దుష్కార్యంబు లొనరించిరి. నన్నువలగొనుటకిచ్చిన పాదములతోఁ బోరానిచోట్లకుఁ బోవఁదొడంగిరి. నా గాథలాలకించుట కిచ్చినచెవులతో వ్యర్థాలాపములు వినుచున్నారు. నన్నుఁగాంచుట కిచ్చిన నేత్రములతో నాటకాదులుచూచు చున్నారు వారిట్లుండఁగా మఱియొకమార్గంబు జూపింతమని నేనుయోజించి మహామునులయం దావేసించి భారత భాగవత రామాయణాది పుణ్యగ్రంథంబులు రచింపఁజేసితిని. మేతాలుపులు వానిం జదువకపోగా దూషింపసాగిరి. శ్రీరంగము, వేంకటాద్రి, యాదవాద్రి, హస్తిగిరి మొదలగు దివ్యక్షేత్రములయందు నర్చారూపముతో నేనవతరింపఁగా రాలుదేవుఁడాయనిరి. గంగా కావేరి మొదలగు పుణ్యనదుల నుద్భ వింపఁజేయఁగా నీటివల్ల మఱికి పోవునేగాని పాపంబు పోవునాయనిరి. ఇదిగాదని నేను రామావతారం బెత్తగా రాముఁడు దేవుఁడైనచో సీతావియోగంబేల యనిరి. కృష్ణావతారం బెత్తగా శ్రీకృష్ణుఁడు పరమాత్మయైనచో జారచోరత్వంబు లేలయనిరి. నేను జీవుల మేలుగోరి యేమేమి చేసితినో యవన్నియు వారి దుఃఖంబునకుఁ గారణంబయ్యె నింక నేనేమి చేయుదు నని వాసుదేవుండు విచారపడఁగా నాదిలక్ష్మియు నిరుత్తరయై యూర కుండెను. తత్సమయంబున లక్ష్మీనారాయణుల వ్యసనంబుఁ గాంచి సహింపలేక శేషుండు లేచి నిలుచుండి బద్ధాంజలి యై దేవాదిదేవా ! మీరు చింతపడవలసిన పని లేదు. నే నొక్కయుపాయంబు సెప్పెద నాలకింపు మెట్లంటిరా భూలోకంబున మనుష్యుండ నై పుట్టి మానవులకు భక్తిప్రపత్తులు బోధించి మీవంకకుఁ ద్రిప్పెద నుభయ విభూతలయందు నాయధి కారంబు చెల్లునట్లు వరంబును మోక్షా ధికారంబును యిమ్మనియె. నంతటఁ బరవాసుదేవుం డానందించి వత్సా !

54

నీవు త్రేతాయుగంబున లక్ష్మణుండ వై ద్వాపరంబున బలరాముండ వై యీ వైకుంఠంబున సర్వవిధకైంకర్య నిర్వాహకుండవై సాయపడితి విప్పుడు చేతనోద్ధారణ చేసెదనంటివి. భూలోకంబునకుఁ బొమ్ము నీ యిష్టానుసారముగా బ్రవర్తింతు ననియె నటుపిమ్మట ననంతాళ్వారు లీలావిభూతిలో మర్త్యలోకంబునకువచ్చి శ్రీపెరుంబూధూరునందు నాసూరికేశవాచార్యుని పత్నియగు కాంతిమతీదేవికిఁ గలియుగాది 4118 (౪౧౧౮)వ సంవత్సరంబున నార్ద్రానక్షత్రమున జనించి యాదవ ప్రకాశు నికడ విద్యాభ్యాసంబుచేసి తిరుక్కచ్చినంబిగారిచెంత నాఱువార్త లెఱింగి వివాహంబుచేసుకొని పదియాఱవయేట సన్యాసంబు పరిగ్రహించి పెరియనంబిగారిచేఁ బంచసంస్కారంబులును తిరుమలనంబిచే రామాయణ విశేషార్థంబులును తిరుక్కోట్యూరినంబిగారిచేఁ జరమశ్లోకార్థంబును మాలాధరులచే ద్రావిడ ప్రబంధంబులును గ్రహించి శ్రీభాష్యము మొదలగువేదాంత గ్రంథములను గద్యత్రయంబును రచించిరెండు మాఱులు భూప్రదక్షిణంబు గావించిరి. మఱియు నీయోగీంద్రుండు శారదాపీఠంబునకేగి సరస్వతీదేవి యిచ్చిన గొప్పగొప్పప్రశ్నలకు సమాధానంబిచ్చె నద్దేవిచే భాష్యకారులు, శారదా శోకనాశనుఁడను బిరుదులును హయగ్రీవ విగ్రహంబును సంపాదించెఁ దనపైఁబిశాచ ప్రయోగంబుచేసినవారికిఁ బిచ్చి పుట్టించి గర్వభంగం బొనర్చె. విష్ణువర్ధనుని కులగురువులగుశైవుల వేలకొలది నొక్కసారి యోడించి వైష్ణవులఁగావించె. మతాంతరులచేఁ గలంక మొందినతిరుమలను దిద్దుబాటుచేసి వైష్ణవంబుగావించె. నూటయెనిమిది దివ్యతిరుపతులకుఁబోయి మంగళాశాసనంబు గావించె. సుందరభుజ స్వామివారికి రెండు వేల పుట్ల వెన్న చే దీపారాధనంబు చేసి గోదాదేవి మ్రొక్కుబడి చెల్లించి యా దేవిచే వరంబులొందె. శ్రీవిల్లిబుత్తూరిచెఱువులోని కోట్లకొలఁది జలజంతువులకు మోక్షం బొసంగె. లక్షలకొలందిజనులతో నేగి ఢిల్లీపతిని జయించి సెల్వప్పిళ్ళను దెచ్చి యాదవాద్రియందుఁబ్రతిష్ఠించి సుల్తాను కూఁతు న ద్దేవున కిచ్చి వివాహంబు గావించె. వైష్ణవద్వేషి యైనచోళ భూపాలుని కంఠంబునఁ బురుగులు వడి ముఱిఁగి చచ్చు నట్లు సంకల్పించె దేవప్పెరుమాళ్లచేఁ గూరేశుని నేత్రంబు లిప్పించెఁ బూర్వా చార్యులయొక్కయు

నాళ్వార్లయొక్కయు మహాత్మ్యంబు వెల్లడించె. శ్రీరంగరాజస్వామివారి సంపదలు వృద్ధిఁ జెందించె శ్రీశ్రియఃపతులయొక్క ప్రభావంబుచేఁ జేతనుల మానసంబులు రంజింపఁ జేసి సంసారబంధంబులు దొలఁగించి హరి కాత్మలాభంబు నాత్మలకు భగవల్లాభంబు నొసంగె. వేదంబులకు శాస్త్రంబులకు ఋజుమార్గంబున నర్థంబులు వక్కాణించి యవైదిక సిద్ధాంతంబులు నిర్మూలంబు గావించి కుమతంబులను బురదలోఁబడియుండు పరబ్రహ్మను లేవనెత్తి వైదికమత మార్గంబు జూపించి సుఖింపఁజేసెఁ గోట్లకొలఁది మానవులను రాజాధిరాజులను శిష్యులుగా నేలి పరమపదంబునకుఁబనిచె నిమ్మహాయోగికి సమక్షంబునఁ బరిచర్యచేయు వారైదువందల త్రిదండ సన్యాసులు యేడువందల యేకాంగులు నీగురుశిఖామణిబ్రహ్మ, క్షత్రియ, వైశ్య శూద్రులకేకాక మాల మాదిగ యెఱుకల యేనాదులకుఁ గూడ సిద్ధాంతమును బోధించి కృతార్థులంజేసి దయాసముద్రుఁడని కీర్తివహించె నమ్మహానుభావుని దివ్యశాసనంబుచే నిప్పటికినిఁ దిరునారాయణ పురదేవాలయములోఁ బంచమజాతివారు సంవత్సరమునకు నాలుగు దినంబులు దర్శన స్పర్శన తీర్థప్రసాదములందుచున్నారు. మఱియు నీ వైష్ణవచక్రవర్తి లీలావిభూతియందు నూటయిరువది సంవత్సరములుండి జగంబు హరిభక్తిచేనింపి యొక్కనాడు లక్ష్మీసహితుండగ రంగరాజస్వామివారి సన్నిధికేగి యాస్వామితో దేవా! నేను బ్రతికినంతకాలము జీవకోటిని దిద్దుబాటుచేసితి నిఁకఁబరమపదంబున కేగుచున్నాను. నాయనంతరము యిట్టికష్టముచేయు వారుండరు. గనకు నామతంబుఁజేరి శుద్ధాంతఃకరణులై మంత్రాంతర సాధనాంతర ప్రయోజనాంతరంబుల రోసి నీ భక్తిచేయువారికిఁ బరమ పదంబిచ్చుచుండవలయు వారికొఱకు నేనేఁ బ్రపత్తిచేయుదు నని వేడఁగా నంబెరుమాళ్ళు రంగనాయకి యనుమతంబున నవ్వరంబొసంగి యతీంద్రు నింకను లీలావిభూతి యందుండుమని బోధించెం గాని వారు దానికీయకొనక రంగేశా ! కలియుగంబున మానవ జీవితమునకు నూఱు సంవత్సరంబులు పరిమాణంబు. నేను నూటయిరువదేండ్లుంటిని. శరీరరంబున రోఁతపుట్టుచున్న దింతేకాక లీలావిభూతియుందలి జీవులు

కోట్లకొలఁది వైకుంఠంబునకుం జనిరి. అచ్చట నిత్యసూరులకును పోయిన జనుల కెట్టి స్నేహంబుగల్గెనో యేమివైభవంబు జరుగుచున్నదో చూడవలయునని మనస్సు తొందరపడుచున్నది. సెలవిమ్మని రంగేశ్వరు ననుమతివడసి శిష్యులకుఁ జరమధర్మంబు లుపదేశించి తిరుమేను చాలించి శ్రీవైకుంఠంబున కరిగె నమ్మహాత్ముని తిరుమేనిప్పటికిని శ్రీరంగంబునఁ గలదు.

సుశీలుఁడు

రామానుజీయులలోఁ గొందఱు కల్లు, మాంసము మొదలైనని వాడుచున్నారు. అదిమతసాంప్రదాయమేనా ?

వరవరముని

అది చాలా దోషము. యేశాస్త్రమునందునులేదు. లోకము లోని సామాన్యులే త్రాగుబోతులను మాంసాహారులను రోఁతఁగాఁ జూచుచున్నారు. వేదాంతమున కెట్లుపయోగించు నందులోఁ బరమ వైదిక సిద్ధాంతమైన రామానుజమతసాంప్రదాయ మెట్లగును.

సుశీలుఁడు

మద్యమునకు మాఱుగాఁ దీర్థమును మాంసమునకు మాఱుగాఁ బ్రసాదంబునుఁ గల్పింపఁబడెనని చెప్పుదురే ?

వరవరముని

బలు బాగా యున్నది. 'పణ్యస్త్రీణాం పరస్త్రీణాం పుష్పదోషం నవిద్యతే' యని యొకజూరుఁడు చెప్పెనట్లే జిహ్వాచాపల్యంబు గల వారు నీ వడిగినట్లు వచింతురు ప్రాజ్ఞులైనవా రొప్పుకొనరు.

సుశీలుఁడు

పవిత్రమైన రామనుజసిద్ధాంతంబున కీ కలంక మొట్లు కలిగెనో సెలవిండు.

వరవరముని

రామానుజులవా రుండునప్పుడు కూచి మాచి కొఱవి యనుపేరులు గలకాంతలు వారికి శిష్యురాండ్రై యొక్కనిశాసమయంబున వారిని మోహించి రతికేళి కై యాచించి రంత నయ్యోగీంద్రుఁడు కోపించి సమ్మెటలచేఁ గొట్టించి

పాఱదోలె నా స్త్రీ లసూయాపరులై రామనుజమతంబునకుఁ గలంక మాపాదింపఁ గోరి, రా అనఁగా రక్తము, మా అనఁగా మాంసము, ను అనగా నురుగు, జ అనగాజలము నని రామానుజశబ్దంబునకు విపరీతార్థంబులుదీసి బోధింపగా జిహ్వాచాపల్యము గుహ్యాచాపల్యంబు గలవారంగీకరించి రక్కారణంబున నాదుష్టమతంబు లోకమంతయు వ్యాపించి బుద్ధిమంతులను సహితము చెఱచుచున్నది. ఆదురాచారంబులు నంగీకరించినవారు నరకమును బొందురు రీవిషయంబు నీకుఁగలి కామరాజుల రికార్డులో వివరించితి నది మనవిరోధుల కుండనిమ్ము. రామానుజీయులు పరిశుద్ధులు, వైదికులు, సదాచారనియమముగలవారు, ఆహారనియమమును పాటించువారు. అట్టివారు భూతదయానాశనంబగు పను లెన్నడును చేయరు, చేసిరేని రామానుజులవారి దయకు దూరులై యథో లోకంబుఁగాంతురు.

సుశీలుఁడు

అది యట్లుండనిచ్చి పరమపదంబున కేగునట్టి మార్గంబును తద్దేశవైభవంబునుఁ దెలుపుడు.

వరవరముని

ఇదివర కప్పరమపదంబుఁ జేరినయొకానొకయోగిజనాగ్రేసరుని వృత్తాంతం బెఱింగింతు వినుము. దానిచే నీవాంఛ ఫలించు నెట్లంటివా రామానుజులవారి కాలంబున నమ్మహాత్మునిశిష్యులలోఁ గూరత్తాళ్వారని పేరొందిన మహాపురుషుండు గలడతండు పాండిత్యంబున బ్రహ్మదేవుఁడై, వైరాగ్యంబున శుకుండై, భక్తికిఁ బ్రహ్లాదుండై, కైంకర్యంబున శిరియతిరుపడియై, సర్వదుర్మతశిలోచ్చయదంభోళి యై గురుభక్తియం దద్వితీయుం డై భగవత్కల్యాణగుణామృతపానమత్తుం డై శ్రీరంగంబున వసింపుచు నొక్కనాడవ్వేల్పును స్తోత్రంబుచే మెప్పించి పరమపదమున కుత్తరువు నొంది గృహంబున కేగి శ్రీరామానుజాను జ్ఞనుఁగొనొ భార్య యైన ఆండాళ్లమ్మకుఁ బరాశభట్టరు వ్యాసభట్టరులకు జ్ఞానోపదేశంబుచే నూఱట దెలిపి

శ్లో॥ యోనిత్యమచ్యుతపదాంబుజయుగ్మరుక్మ
వ్యామోహతస్తదితరాణితృణాయమేనే ।
అస్మద్గురోర్భగవతో స్యదయైనసింధో ।
రామానుజస్య చరణౌ శరణంప్రపద్యే ॥

అని గురుధ్యానమొనర్చి సుషుమ్నా నాడీద్వారముగుండా శిరఃకపాలంబు భేదించుకొని ప్రణవరథం బారోహించి ముందుగా నర్చిస్సను వాని లోకంబుఁజేరి వారిచేఁ బూజితుండై కూరేశుం డహస్సను వాని లోకంబునకేగి యతనిచేఁ బూజితుండై శుక్లపక్షాభిమాని లోకంబుజేరి యటుపిమ్మట నుత్తరాయణాభిమాని లోకంబును వాయులోకంబునుఁ జేరి వారిచేఁ బూజితుండై సూర్యమండలంబుఁ బ్రవేశించి దాఁటి చంద్రమండలంబు దాఁటి పోవుచుండఁగా మార్గంబునఁ జప్పరంబులు చలి పందిళ్ళు వేసి తోరణములుగట్టి మేలుకట్లచే నలంకరింపఁ బడియుండె. నవ్వైష్ణవశిఖామణి వానినెల్ల వీక్షింపుచు స్వర్గలోకంబుఁ జేరఁగా నచ్చటనుండు స్త్రీపురుషాదులైన దేవతలెదుర్కొని కర్పూర నీరాజనంబు లిచ్చియు యాగాదిఫలంబు లర్పించియుఁ బూలమాలికలొసంగియుఁ బూజించి యీలోకంబునఁ గొంతకాలము నివసించి సనాథంబుగాఁ జేయుమని ప్రార్థించిరి. దేవేంద్రుండు సహితము నమస్కారంబు లొనరించి స్తుతించె నంతఁ గూరేశగురుండు వారి నందఱిని సవినయంబుగా వీడ్కొని బహుదూరంబు గమనించి సత్యలోకంబున కేగె.

నయ్యవసరంబున బ్రహ్మదేవుం డెదురుగాఁ జనుదెంచి సపరివారుండై పూజించి మనతల్లిదండ్రు లైనశ్రీశ్రియఃపతులసన్నిధి కేగు చుంటివి, నీవు కృతార్థుండవు, మా కింకను ప్రారబ్ధవ్యయంబు కాలేదు. నే నియ్యాధిపత్యము వహించినదాది యెందఱోముక్తులీ త్రోవను వెళ్లిరి. నాకుమాత్ర మది ప్రాప్తించలే దని యంగలార్పఁగా నతని నూఱడించి శ్రీవత్సాంకమిశ్రులు బ్రహ్మాండకటాహంబు భేధించుకొని యుటుపిమ్మట భూమ్యావరణము దానికిఁ బదింత లైనజలావరణము దానికంటెఁ బదింత లైనపావకావరణము దానికిఁబదింత లైనవాయ్వా వరణము నంతకంటెఁ బదింత లైనయాకాశావరణము దానికిఁ బదింతలైన అహంకారావరణము దానికి దశగుణోత్తరం

బైనమహదావరణము దాఁటి తరుపరి నూ అమావాస్య లొక్కసారి వచ్చి మబ్బులు క్రమ్మిన నెట్లుండునో యిట్టి చీఁకటిగలిగి లక్షయోజనంబుల పరిమితిచేనుండు మూలప్రకృతిఁ గడచి కూరేశగురుండు కొంతదూరము వెల్తురులో నడచి యమృతప్రవాహంబైన విరజానదిని సమీపించె. విరజానది –రజమనఁగా దుమ్ము అదిలేనిదివిరజానది. అమ్మహానది లీలావిహభూతికి నిత్య విభూతికిఁ బొలిమేరగా నుండును. లీలావిభూతి ప్రకృతివికారములతోఁ గూడినది నిత్యవిభూతి శాశ్వతముగా నుండునది.

సుశీలుఁడు

వానిసంగతు లట్లుంచి యాముక్తుం డేమయ్యెనో యెఱింగింపుడు చాలా కుతూహలముగా నున్నది.

అమ్మహాత్ముండు విరజాస్నానంబుగావించి యిరువదినాలుగు తత్వంబులతోఁగూడిన సూక్ష్మశరీరమును వదిలి చిరకాలమునుండి తాననుభవించిన సంసారదుఃఖంబు నడంచుకొని స్వస్వరూపమునుఁ బొంది వేయిసూర్యులకాంతితో విరజ కవ్వలి తీరంబుజేరె. నంతలో నిత్య సూరులు దివ్యవిమానంబుదెచ్చిరి. తరువాత దివ్యసుందరవిగ్రహుండును శంఖచక్రాది దివ్యాయుధధరుండును శ్యామవర్ణుండునగు నమానవుండు వచ్చి తన దివ్యహస్తముచే ముక్తజీవుని స్పర్శించె. నాతాకుడుచే నాజీవునకుఁ గలిగిన యానంద మింతయని వక్కాణింపం దరంబుగా కుండె. నటుపిమ్మట నాముక్తజీవుండు రాహువుచే విముక్తుఁడైన సూర్యునివలెను, బురదగడిగిన మానికంబువలెనుఁ, బుటమువెట్టిన బంగారమువలెను, బ్రకాశింపుచుఁ బదియాఱుసంవత్సరముల వయస్సు గల పంచోపనిషన్మయమైన శరీరంబునఁ బ్రవేశించె. నాశరీరంబు మిక్కిలి సువాసనగలిగియుండె. శిరీషకుసుమంబు భంగి మిక్కిలి మృదులముగానుండె. నెంతకాలమునకైన జీర్ణముగాని స్వభావంబుతో నుండె. నద్దివ్యదేహంబగ్ని చేఁ గాలదు. వాయువుచే శోషింపదు. పర్వతములు, లోష్టములు, పాషాణములు, లోహములు, సర్వాస్త్రశస్త్రములామేనిం దాఁకెనేని యావస్తువులు చూర్ణంబగునేగాని మేనికిమాత్రము కొంచెమైనను బాధలేదు శిథిలంబుగాదు. మఱియు నమ్మేనికి బాల్యయౌవన కౌమార వార్థక్యంబులులేవు కామ క్రోధాదులు క్షుత్పిపాసాజ

రామరణాదులు లేవు. వేయిమాటలేల యాతనాశరీరంబువలె దుఃఖంబుగాని భౌతికశరీరంబువలె సుఖదుఃఖబులుగాని దేవశరీరంబుభంగిఁ బతన భయంబుగాని దానికి లేదు. శీతోష్ణములు మానావమానంబులు కలిమిలేము లా వపువునకు లేవు. చెవుడు గ్రుడ్డి కుంటితనము రోగంబులు తాపత్రయాదు లత్తిరుమేని కెన్నటికిని గలుగవు. అట్టిదివ్య విగ్రహం బక్కూరేశగురుండు ప్రాపించి జీర్ణ మైనతడిబట్ట విడిచి నూతన మైయమూల్య మైనపోడిబట్టను ధరించినవానిపోల్కి నుప్పొంగుచు విరజ కవ్వలిదేశంబు చూడఁగా నది యిసుక బురద మట్టి రాలు గులకరాలు చవుడు లేని దై బంగారుమయ మై యుండె, వజ్రవైదూర్యాదిమణు లెచ్చోటఁజూచినన వ్వారిగా నుండె. నింతలో నిత్యసూరులక్కూరే శునిఁ బరబ్రహ్మభుక్తశేషంబు లైనవస్త్రమాల్యాభరణాదులచే నలంకరించి దివ్యవిమాన మెక్కించి తీసుకొనిపోవుచుండ నొక్కచోట నవ రత్నఖచిత మై లక్షయోజనములపరిమితి గలగోపురంబు కానిపించె. నవ్వైష్ణవశిఖామణి విమానంబుడిగ్గి గోపురంబు నకును జయవిజయులకును కుముద కుముదాక్షుఁడు మొదలైనవారికి నమస్కరించి వారిచే దీవెనలు గైకొని గోపురంబుదాఁటి వైకుంఠపత్తనంబు ప్రవేశించి గురుపరంపరా నిలయమునకేగి వారికి సాష్టాంగ నమస్కారంబు లొనరింపఁగా నాసామాజికు లుప్పొంగి వత్సా! భగవద్రామానుజ సంబంధముచే ననాయాసంబుగా నీదేశంబునకు వచ్చితివి.

అనాది సంసారబంధంబు సడలించుకొంటివి. రామనుజ సంబంధులుగానివా రెంత భక్తులైన శ్వేతద్వీపంబునకు, గోలోకంబునకు, సంతానలోకంబునకు వాసుదేవానిరుద్ధాది వ్యూహంబుల కేగుదురు గాని యీలోకంబునకు రాజాలరు. రామనుజ యోగీంద్రుండు చిర కాలమునుండి కంటికి నిద్ర కాలికి సుఖము లేక కష్టపడుచున్నా డమ్మహాత్మునకు క్షేమమా యని విచారించి తండ్రీ! పెరుమాళ్లను దర్శింపుమనగా నమ్మహాత్ముండు వారలను సవినయంబుగా వీడ్కొని, గరుడాళ్వారు విష్వక్సేనులవారు వారివారి మందిరంబులకుఁగొని చనిభార్యాసహితులై సత్కరింప నాసన్మానమునుబొంది వైకుంఠనగరంబున మరలఁగొంతదవ్వరుగగా

బంచశతదివ్యాప్సరసలువచ్చి కస్తూరి మొదలగు సుగంధద్రవ్యంబులచేఁ గూరేశునిముంచి సరసాలాపంబులాడిరి. వారిచే సల్లాప సుఖంబను భవించి విష్వక్సేనులతోను గరుడాళ్వారితోను గలసి తిరుమామణి మంటపంబునకేగి చూడఁగా దాని ప్రభవంబున కంతము లేదయ్యె. నవతర్నఖచితంబులగు బంగారు స్తంభంబులు వజ్రఖచితంబులగు కుట్టిమంబులు గరుడపచ్చలదూలంబులు శక్రోపలంబులచే నిర్మాణమగు మెట్లుగలిగి లీలావిభూతిలోని మేతాల్పులందఱేకమై వచ్చిన నొక్కకంబంబు చాటున దాపఁజాలి యనేకసూర్యులకాంతితోఁ బ్రకాశింపుచుండె. మఱియు నద్దివ్యసౌధంబున గర్భగృహంబులు గవాక్షంబులు నరమరలు బల్లలు నాసనంబులు బంగారు మయంబులైయుండె. బావులు దిగుడుబావులు కోనేళు చెఱువులు రత్నఖచితంబులై లక్షలు కోట్లు గలిగి యుండె. నా జలాశయంబు బరిమళయుక్తమైనచల్లని తేటనీరు మిక్కిలి లోతుగా నుండె. నానీటియందు బంగారు తామరలు కలువలు సౌగంధికంబులు గుమగుమ వాసింపుచుండె. నా పుష్పములయందు విహరించురాయంచలు నీటికోళ్లు చక్రవాకంబులు కన్నెలేళ్లు బకంబులు బలాకంబులు నీటియేనుఁగులు హాటకమయంబులై తనరారుచుండె. నద్దివ్యసౌధంబున నుద్యానవనంబు లనంతముగా నుండె నొక్కొక్క వనంబున మితిలేని పనసలు దానిమ్మలు నిమ్మలు నేరేండ్లు మారేండ్లు ద్రాక్షలు మామిళ్లు వెలగలు సురపొన్నలనటులు చందనకల్పపారిజాత హరిచందనవృక్షములు క్రిక్కిఱిసియుండె. మల్లెలు మొల్లలు, సంపెంగలు, కలిగొట్టుప్రాకులు, గులాబీలు మిక్కుటంబుగాఁబూచియుండె. నొక్కొక్క చెట్టునఁ దావులీను పూవులు తీయని ఫలములు, మొగ్గలు, చిగురుటాకులు, తీవలాకులు, కాయలు, పిందెలు తేనెపెరలు నిండి మెండుకొనియుండె. నాయాచెట్లయందుఁ గీరంబులు, కోకిలంబులు, పావురంబులు, గోరువంకలు, నెమళ్లు పాటలుపాడుచు నాటలాడుచు వేదార్థంబులు చెప్పుచుఁ బురాణంబులు వినిపింపుచు శాస్త్రవాక్యంబులు ప్రసంగించుచుండె. నాపక్షులన్నియు హాటకమయంబులై రత్నమయంబులై సొబగారుచుండె.

మఱియు నత్తిరుమామణి మంటపంబునం దత్తరు పునుగు జవ్వాది చందనము కస్తూరి కర్పూరము మొదలగు పరిమళ ద్రవ్యంబులు ఘుమఘుమవాసింపుచు సమస్త ప్రదేశములయందుఁ గుప్పలు కుప్పలుగా నుండెఁ దేనెకాలువలు క్షీరాన్ననదులు నలుదెసల వెలయుచుండె. నట్టి మంటపమధ్యంబున నొక్క దివ్యభవనంబున హాటకపర్యంకంబునఁ గోటిచంద్రులవంటి తెలుపుగల యాదిశేషుఁడను పేరుతో ననంతాళ్వారుండిరి. యమ్మహాపురుషునికి వేయి పడగలు గలిగియుండె. నొక్కొక్క పడగయందుఁ గెంపులు, గరుడచ్చలు, నింద్రనీల మణులు, వైదూర్యములు, వజ్రములు, ముత్తెములు, పవడంబులు, గోమేధికపుష్యరాగంబులు, వేనవేలుగాఁ బ్రకాశింపుచుండె. నయ్యాది శేషతల్పంబునం దష్టదళంబులుగల పుండరీకముయొక్క కర్ణికారాసనం బున నొక్క మూలపురుషుండు వేంచేసియుండె. నాస్థలంబునకుఁ గూర త్తాళ్వారేగిసేవింపఁగాఁ దోచినవైభవం బెట్టిదనఁగా –

సుశీలుఁడు

ఆదిశేషునిపై మూలపురుషుండున్నాడంటి రతండెవ్వఁడో నాకుఁదెలియలేదు, విశదముగా సెలవిండు.

వరవరముని

అతండె యాదినారాయణుండు, లక్ష్మీపతి, పరబ్రహ్మము, పరవాసుదేవుఁడు ఉభయవిభూతుల కేకచ్ఛత్రాధిపతి.

సుశీలుఁడు

ఇప్పుడు చక్కఁగాఁదెలిసినది. యానందంబుచేఁ జిత్తంబు పరాయత్తంబగుచున్నది. కన్నుల వెంట నానందబాష్పంబులుద్భవింపుచున్నవి. శరీరంబునఁ బులకలెగయుచున్నవి. యెంతసేపు విన్న దేవర వాక్యామృతమునందుఁ దృప్తిలేకున్నది. తరువాత వృత్తాంతం బెఱింగింపుడు

వరవరముని

కూరేశుండు ముందఱ బద్ధాంజలియై నిలువ నా లక్ష్మీపతి త్రిలోకపావనియైన గంగనుఁగాంచినవియు, యోగులహృదయములందు

బ్రహ్మరుద్రాదినిర్జరుల కిరీటంబులయందును నూతనమర్యాదఁజెందు నవియు లక్ష్మీదేవికి భక్తులకు మూలధనంబులైనవియుఁ గెందమ్ములంబోలు పాదంబులునుఁ, జక్కని పిక్కలును, సమంబులైన జానువులును బంగారపరటికంబంబులవంటి తొడలును, గుండ్రని నునుపైన పిఱుదులును, సింహమధ్యమువంటి నడుము, ననంతకోటి బ్రంహ్మాండంబుల కాధారమైన పొట్టయు, బ్రహ్మకుత్పత్తిస్థానమై సౌందర్య ప్రవాహము యొక్క సుడివలెనుండు నాభియు, బ్రళయోదధి మగ్నమైన భూమిని మందరగోవర్ధనపర్వతంబులను లేవనెత్తి నవియు రామావతారంబున సీతా కుచంబులయందునుఁ గృష్ణావతారకాలంబునం దష్టభార్యల యొక్కయుఁ షోడశ సహస్రాంగనల యొక్కయి గోపికా సమూహంబుల యొక్కయు గుచద్వంద్వముల యందును, మర్యాదగాంచినవియు, శ్రీభూనీళాకుచంబులయం దెల్లప్పుడు లాలింపఁబడునవియు, దేవతలకమృతం బిచ్చినవియు దాసుల కభయంబిచ్చునవియు నేనుఁగు తొండములతోఁ బన్నగంబులతో సమానంబగు బాహులును, కౌస్తుభరత్నము శ్రీవత్సము లక్ష్మీదేవితోఁగూడి విరాజిల్లు విశాలవక్షస్థలంబును, శంఖముతో సమానమై మూడు మడతలుగలిగిన కంఠమును, రాకాచంద్రునిఁ దిరస్కరించు తిరుముఖ మండలంబును, పుండరీక సదృశములై యాకర్ణాంతము లైశోభిల్లులో చనంబులును తళతళమెఱయు మకరకుండలములతోఁ గూడిన శ్రీకారములవంటి చెవులును, సంపెంగవంటి నాసికయు, దర్పణములవంటి కపోలంబులును, పొన్నకాయవంటి శిరంబును, ఇంద్ర నీలములవంటి వెండ్రుకలును, సర్వేశ్వరత్వమును బ్రకటించు రత్నకిరీటంబును, శంఖము చక్రము శార్ఙ్గము కౌమోదకి నందకమనెడు పంచాయుధములును నీలమేఘవర్ణంబును, గోటిసూర్యులకాంతి, కోటిమన్మథుల సౌందర్యమును గలిగి వెండికొండపైఁ దోఁచుఁ బ్రావృట్కాల వలాహకంబు భంగిఁబ్రకాశింపుచు దేవీసహస్రములతోఁ గూడిన శ్రీభూనీళాసమేతుఁడై వేంచేసియుండె.

ఇంతేకాక దీనులరక్షించు దయతో నాశ్రితుల దోషంబులు భోగ్యంబులుగా నెంచు వాత్సల్యంబుతో దాను గొప్పవాఁడయ్యు నీచులతోఁ

59

గలసి మెలసి వర్తించు సౌశీల్యంబుతో నెట్టికార్యమునైన సులభముగాఁ జేయునట్టి శక్తితో సాపరాధుల నాదరించు క్షమతో గుటిలురఁబ్రోచు నార్జవంబుతో విశ్లేషభీరువుల నాదరించు మార్దవంబుతో నాశ్రితుల విడువ ననుస్థైర్యముతోఁ గొలిచినవారి కెంత యిచ్చినఁ దృప్తిలేని యౌదార్యముతో మూడుకాలములయందును సమస్త బ్రహ్మాండములలో జరుగు విషయంబు లాశ్రితుల వాంఛలనాయాసంబుగా నెఱుగు జ్ఞానంబుతో, మందరోద్ధరణాది కార్యంబు లొనర్చియు బడలికలేని బలంబుతో, నవాఙ్మానస గోచరంబగు నైశ్వర్యంబుతోఁ బ్రతికూలురఁగ్రిందు పరచునట్టి తేజస్సుతో, సర్వశత్రు సంహారం బొక్కత్రుటిలోఁ జేయఁజాలిన శౌర్యంబుతో, మేరుమందరంబులఁ దిరస్కరించు ధైర్యంబుతోఁ దలచినపని వ్యర్థముగాకుండ నెరవేర్చు సత్యసంకల్పంబుతో, రోషవేళల సురాసురులనైన నల్లాడించు పరాక్రమంబుతో నవార్యవీర్యంబుతో, నంగనలనేకాక పురుషుల మోహింపఁజేయు సౌందర్యంబుతో, శిరీషకుసుమంబునుఁ బరాభవించు సౌకుమార్యంబుతోఁ, గలిగొట్టుపూలు సంపెంగలు మల్లెలు మొల్లలు మొదలైన వాని నీసడించు దివ్యపరిమళంబుతో, వెన్నలవంటి నవ్వుతోఁ, జిద్విలాసంబులతో, సుముద్రమువంటి గాంభీర్యముతోఁ, జంద్రునివంటి చల్లఁదనముతో, నిత్యసంసారుల నిత్యసూరులతో, సమానముగాఁ జేయునట్టి సామర్థ్యముతో, బాలసూర్యున కప్పులీయఁ జాలుకాంతిగల పీతాంబరముతో, హారంబులతో, నుంగరంబులతోఁ, గంకణంబులతోఁ నంగదంబులఁతో గటిసూత్రకే యూరంబులతో వెలయుచున్న శ్రియఃపతిని కన్నుల కఱవుదీఱ సేవించి ' సమస్త పరివారాయ శ్రీమతేనారాయణాయనమః' యని స్తుతించి శేషతల్పంబున కెక్కుచుండఁగా నారాయణుండు, 'కస్త్వంనీవెవ్వండ' వని సరసాలాపంబుపల్కె. నంతలో 'అహంబ్రహ్మాస్మి'నేను పరబ్రహ్మను బొలవచ్చుచున్నా'నని చెప్పి పెరుమాళ్ళను సమీపించి తదీయ దివ్యపాదారవిందంబులయందు శిరస్సుమోపి లేచి నిలుచుండఁగా శ్రీమహావిష్ణువాతనిఁ గౌఁగిలించి తొడమీఁద గూర్చుండఁ బెట్టుకొని బిడ్డా సంసారంబుతిరస్కరించి శ్రీరంగంబున నిలిచి రామానుజాజ్ఞచే నన్నాశ్రయించి బహుకాలము

సేవించితివి. నీభక్తికిఁ బ్రతిఫలముగా నెప్పుడో మోక్ష మీయవలసినది. చేతన రక్షణకై యింతవరకు ముఱికిశరీరముతో నుంచి నందులకుఁ గోపింపవలదని వినయముతో సంభాషింపఁ గూరేశుండానంద బాష్పములువిడిచి పునఃపునః ప్రణామంబు లొనరించి దేవా! నిత్య సంసారినైన నన్ను నిత్యసూరుల గోష్ఠిలోఁ జేర్చియు నిట్టి యుపచార వాక్యంబులు వల్కుచున్న నీవాత్సల్యంబునకుఁ దగినట్లు సంభాషింపఁ జాలనని సిగ్గునఁ దలవంచగా మాధవుండతని శ్రీదేవికిచ్చి నీకుమారుని లాలింపుమనియె. నంతట జగజ్జగని కూరేశుం గౌగిలించి పాలీయఁగా నయ్యమృతధారలు గ్రోలి చతుర్భుజములు శంకచక్రాది దివ్యాయుధములు ధరించిశ్రియః పతియాజ్ఞనొంది నిత్యసూరులతోఁ గలసి క్షణక్షణమునకు వృద్ధి నొందిన యానందవార్ధి నోలలాడుచుండె. దీనికి వైకుంఠమనియు మోక్షస్థానమనియుఁ బేరులు.

సుశీలుఁడు

ఈపదంబు కూరేశునివంటి జ్ఞాననిధులకుఁదక్క సామాన్యులకు లభింపదేమోయని నామనంబున సందేహము గలుగుచున్నది.

వరవరముని

సంశయ మక్కఱలేదు. నిష్కల్మష హృదయముతో రామానుజ సిద్ధాంతమునఁజేరి రామానుజులవారియందు భక్తి గలిగి చరించువారికిఁ దప్పకుండ శ్రీ వైకుంఠంబు ప్రాప్తించును.

సుశీలుఁడు

ఇప్పటికి నా సందేహంబులన్నియు నిర్మూలం బయ్యె నని చెప్పఁగా మణవాళమహాముని లతనికిఁ బంచసంస్కారంబులు చేసి మంత్రమంత్రార్థంబు లుపదేశింప నతండు మహాభాగవతుం డై గురు పాదారవిందధ్యానరతుండై కొల్చి యుండె. మణవాళమునీంద్రులును భగవత్కల్యాణగుణామృతవర్షంబుచే ప్రాణిసస్యములం బోషింపుచు శ్రీరంగంబున సుఖంబుగా నుండిరి.

గద్య

ఇది

శ్రీ సీతావల్లభ ప్రసాదసమాసాదితకవితాప్రవీణ వేదాలసీతారామాచార్య
కృపాలబ్ధమంత్రరత్నాను సంధాన పవిత్రాంతరంగ, నిఖిల దుర్మత
శిలోచ్చయదంభోళీభూతసముద్రాలలక్ష్మణాచార్యాను గ్రహబోధిత
విశిష్టా ద్వైతరహస్యార్థ దురంధర, శఠగోపయతిరాడ్వర
వర యోగిప్రభృతి పూర్వాచార్యచరణ సరోజభ్రమ
రామయాన పయిడిపాలగోత్ర మొవ్వవంశతిలక
కృష్ణార్యకృష్ణమాంబాతనూజ శ్రీవైష్ణవవిధేయ
వేంకట దాసనామధేయప్రణీతం
బైన వరవరమునిహృదయంబు
నందుఁ తృతీయభాగము
సంపూర్ణము.

పునర్ముద్రణ – 2017
రామానుజావతారసహస్రాబ్దివత్సరము.

శ్రీరామ

శ్రీమతే రామానుజాయనమః   శ్రీవేంకట గురుభ్యోనమః

శ్రీ విష్ణుదాస గురుభ్యోనమః   శ్రీ శ్రీనివాస గురుభ్యోనమః

శ్రీవేంకటదాసస్వామి విశిష్టత

శ్లో॥ యత్పాదాంభోరుహధ్యాన విధ్వస్తాశేషకల్మషః

వస్తుతాముపయాతోఽహం వేంకటాఖ్యం నమామి తమ్॥

శ్రీ ఉడయవరులఅంశచే మహర్షి శ్రీ వేంకటదాసస్వామి క్రీ.శ 1891 సం॥ కృష్ణా జిల్లా దివి తాలూకా వక్కపట్లవారిపాలెం మాతామహులగృహమున ఖరనామ సంవత్సరాశ్వీజ శుద్ధదశమీ మంగళవారం ధనిష్ఠా నక్షత్రమున ఎదురుకాళ్లతో జన్మించినారు.

పుట్టిన పదునైదవనాడే భగవద్రామానుజులు శేషరూపమున వచ్చి ఊయలలో ఉన్న బాలునకు పడగపట్టగా బాలుడాడుకొనుచుండెను. లోపల నుండి వచ్చిన తల్లి భీతిల్లి కేకలువేయగా చుట్టు ప్రక్కలవారు పోగై చూడ సర్పమెచ్చటను కన్పించలేదు. మఱికొంత సేపటికి అచ్చటనే అందరకు నయనగోచరమై అదృశ్యమయ్యెను. అ సన్నివేశమునుజూచి అచ్చట చేరినవారందరు విభ్రాంతిపడి అదిదేవతా సర్పమనిభావించిరి. అందుచేతనే బాల్యము నుండి వేంకట దాసస్వామికి భగవద్భక్తి కలిగెను. వారికి 12సం॥ వయస్సులో శ్రీమహా విష్ణువు మధ్యాహ్న సమయమున స్వప్నములో కన్పించి నాల్కపై ఏవోవ్రాసి (బీజాక్షరములు వ్రాసి) అదృశ్యముకాగా ఏర్పడిన విష్ణుభక్తి మరింత దృఢపడి గురువు అవసరము లేకయే చదివిన గ్రంథములన్నియు అవగత మయ్యెను. సంస్కృతాంధ్రముల యందు నిరుపమాన పాండిత్య మలవడి ఇరువది సంవత్సరములకే సొంపైన కవిత్వము చెప్పసాగిరి.

జాతకప్రభావముననుసరించి బాల్యముననందే ఊరిబయట పూజా పురస్కారములులేక తాళ్ళతోపులో పడియున్న శ్రీవేణు గోపాలస్వామి విగ్రహమును తన నివాసమునకు తీసుకొనిపోయి అత్యంత పిన్నవయస్కులై యుండియు కొండరాతితో గట్టిదేవాలయము నునిర్మాణముచేయించి 1926లో ప్రతిష్ఠగావించిరి, రామజ్ఞపై భద్రాచలములో శ్రీమద్రామాయణ మును నాలుగున్నర నెలలు నిరాటంకముగా పారాయణచేసి యిల్లు చేరిరి.

అనంతరము భగవదాజ్ఞమేర తనను కోరివచ్చిన భక్తులకు చక్రాంకితమును చేసి, మంత్ర మంత్రార్థములను దెల్పి 35 సం॥ వయసులో ఆచార్య పీఠాధిష్ఠానము గావించిరి.

తదాదిగా కృష్ణా, గుంటూరు జిల్లాలలో వందలకొలది స్త్రీపురుషులను రామానుజ సిద్ధాంతమున ప్రవేశపరచి వైష్ణవులుగా తీర్చిదిద్ది తరింపజేసిరి వారు విస్తృతమైన తన శిష్యసంఘమునకు శ్రీభాష్యకారసమాజమని నామకరణముగా వించిరి. వారు ప్రజ్వలింపజేసిన జ్యోతి కృష్ణాజిల్లా (దివిసీమ మండలమున) గుంటూరు జిల్లా రేపల్లె పరిసరమున వెలుగుచు ఎన్నో గ్రామముల యందు దేవాలయములలో నిరంతరము భాష్యకారభజనలతో ప్రతిధ్వనించుచున్నది. వారికి నలుగురు కుమారులు ఇరవురు కుమార్తెలు. వారునూ తండ్రి గారి బాటలోనే పయనించుచు భక్తి మార్గములను విస్తృత పరచిరి శ్రీ వేంకటదాసస్వామి వారు వ్యవసాయమును కుటుంబ పోషణకు నిమిత్తముగా ఎంచుకొన్నను, నిరంతరము గ్రంధ రచనలతో ఆళ్వార్ల ఆచార్య విషయములతో పురాణ గోష్ఠులతో భగవద్భజనాది సత్కాలక్షేపములతో కాలము వెళ్ళదీసిరి.

వారి సమాజములో చేరిన వారెవ్వరైనను మధుమాంసములను వర్జించి ప్రాతః కాలపారాయణలతో విలక్షణ వర్చస్సుతో ప్రకాశించుచు సామాన్య మగు జాత్యుచితమైనప్రవర్తనమునకు భిన్నులై కన్పట్టుదురు. ఆరీతిలో శిష్యులను నడిపించి, చాలకాలము, శ్రీ రామనవమీ. యుత్సవములు యతీశ్వరజయంతులుగావించి శిష్యగ్రామములలో వర్షాకాలము రెండున్నర మాసములు భారత, భాగవత, రామాయణ పురాణ ప్రవచనాదులుగావించి బుద్ధసంసారులను భగవద్భక్తులుగా మార్చి శ్రీ వైకుంఠమునకు తరలించిరి.

వారి ముఖవర్చస్సు, శరీరశోభ, బింబము నందలి తేజము, గాత్రమాధుర్యము, పాండిత్యము నాన్యతోదర్శనీయము. శ్రీరామానుజులవారి వలే బోధించుట, వ్యాసులవారివలే రచించుట, శ్రీశుకునివలే వైరాగ్యము కల్గియుండుట, నారదునివలె శ్రీహరినామస్మరణ చేయుట, త్యాగరాజ స్వామివలే కీర్తనలల్లుట. పూర్వాచార్యులవలె గురుభక్తి కల్గియుండుట వారికి

జన్మసిద్ధము. వైష్ణవ పరంగా వారు రచించిన గ్రంథములు ముద్రితా ముద్రితములు పెక్కుకలవు.

ముద్రితగ్రంధములు :- 1. జ్ఞానసూర్యోదయము 2. వరవరముని హృదయము 3. లక్ష్మీస్తవము 4. సీతారామప్రభావము 5. గోపికావిలాసము 6. వేదాద్రినారసింహశతకము 7. భద్రగిరిరామభద్రశతకము 8. పూడివాడ వేణుగోపాల శతకము 9. పండరిరగడ 10. ఆశ్రితకల్పశాఖ (సంస్కృత శ్లో॥) 11. భాగవతసురభూజము.

అముద్రితములు : - 1.శ్రీశ్రీనివాస సహస్రము 2. శ్రీదేవీసహస్రము 3. ఆంజనేయస్తవము 4. శ్రీరామాష్టోత్తరశతకము 5. శ్రీవేణు గోపాలాష్టోత్తరశతకము 6. వివేక నిధానము 7. విషాదాగ్నిధారా సంపాతము 8. యతీంద్ర విజ్ఞాపనము 9. ముముక్షుజనప్రభావము. ఇంకను పెక్కుచాటువులు గలవు.

వారి పెద్దకుమారులు న్యాయ విశారద శ్రీమాన్ శ్రీనివాస పెరుమాళ్ళు గారు 1. పద్మావతీస్తుతి సహిత శ్రీ శేషనగేశస్తవము 2. పూర్వాచార్యచరిత్ర 3. దివ్యసూరిహృదయము 4. ఆచార్యపురుషుల చరిత్ర

వారి మూడవకుమారులు తర్కవేదాంత కవిభట్టారక దాశరధీసూరి గారు 1. తపోమహిమ (తండ్రి జీవిత చరిత్ర) 2. భారత గానము 3. కావ్యకళ 4.మదనగోపాల శతకము 5. చిత్రాంగదానాటకము.

కుమార్తెలు :- శ్రీమతి పద్యాల రామాబాణమ్మ శ్రీమతి తన్నీరుకమలాదేవి గార్లు 'తపఃఫలము' మరియు ఇంకననేకఖండికలు సందర్భో చితరచనలు గావించిరి.

వారి ప్రథమపౌత్రుడు ఉపన్యాసచతురానన, కావ్య కళాధర మొవ్వవృషాద్రిపతిగారు రచించిన గ్రంథములు శతాధికములు కలవు. అందుకొన్ని 1. ఉపనిషద్వాణి 1 నుండి 7 భాగ (తెల్గుసేత) 2. అచ్చతెలుగురామాయణ వ్యాఖ్య 3. నీలాసుందరీపరిణయవ్యాఖ్య 4. తపస్సిద్ధి (తండ్రి జీవితచరిత్ర) 5. విరిదండ 6. కన్నెవాగు 7. దానరాధేయ 8.

ప్రతిజ్ఞార్జునీయము 9. కసాపురాంజనేయ శతకము 10. రేపల్లె ఆంజనేయ శతకము 11. అప్పలాయిగుంట వేంకటేశ్వరశతకము. 12. పద్మావతీ శ్రీనివాసీయము 13. విదురనీతి సారము 14. శ్రీబాల కృష్ణ లీలా విలాసము 15. సోమనాద్రి 16. శ్రీ విజయాంజనేయము ఇత్యాదులనేకములు.

వారి రెండవ కుమారుడు శ్రీమాన్ వేంకటాచలపతి గారు తండ్రి గారి వలె రామాయణపారాయణ జీవితకాలమున 300 పర్యాయములు చేసి తండ్రి సంకల్పాను సారము ఆళ్వారుల ప్రతిష్ఠ, గోపురనిర్మాణము, ఆఖండదీపారాధన, నిత్యహోమములుమున్నగు కార్యములు చిన్నతమ్ముడు శ్రీమాన్ రామప్రసాదుగారు మిగిలిన కుటుంబ సభ్యులతో కలిసి పూర్తిచేసి దేవాలయ పురోభివృద్ధికి అహర్నిశము శ్రమించుచున్నారు ఈ రీతితన కుమారులు, కుమార్తెలు, మనుమలు కూడాపండితులగుటకు తగిన తపస్సును వారే చేసి సదన సన్నిధి ఆశ్రితకల్పశాఖియగు శ్రీవేణుగోపాలుని నెలకొల్పి రక్షగావారు చూపగా కుటుంబయులన్నియు ఆజగదీశ్వరుని సేవించి తరించుచున్నవి.

కుటుంబమున కీరీతి గౌరవపాండిత్యముల నలవరింపజేసి దివిసీమ యందు మోదుమూడిలో పురాణము చెప్పుచు 65 సం॥ నిండి 66 సం॥ ప్రవేశము న 1956 ఆశ్వీజ శుద్ధ ఏకాదశిని వేంకటదాసస్వామి శ్రీవైకుంఠమునకు తరలిపోయిరి.

పైన పేర్కొన్న గ్రంధము లేకాక వారనేకహరి కథలను రచించి స్వయముగా చెప్పి కుమారుల చేత చెప్పించి, పౌత్రులు, దౌహిత్రులు కూడా చెప్పునట్లు సంకల్పించి వెళ్ళిరి. వారియమోఘ సంకల్పము నేటికినీ కొనసాగుచున్నది. వారు రచించిన హరికథలు

1. శ్రీ రుక్మిణీ పరిణయము
2. శ్రీ ఉషాంగనోద్వాహము
3. శ్రీ సీతాకళ్యాణము
4. శ్రీ సత్యభామావిలాసము
5. శ్రీరామపట్టాభిషేకము
6. నరసింహమేథచరిత్ర
7. కౌంతేయాజ్ఞాతవాసము
8. ఉత్తరగోగ్రహణం (విరాటపర్వముఆధారంగా)
9. సైంధవని బర్హణము
10. (కర్ణవధ) పాండవ విజయము
11. బభ్రువాహన
12. సుధన్వోపాఖ్యానము
13. చంద్రహాసోపాఖ్యానము
14. మయూరధ్వజోపాఖ్యానము
15. నానావిధోపాఖ్యానం
16. పాండవాశ్వమేధయాగం

వరవరమునిహృదయము

(11 నం. నుండి 16 వరకు జైమనీ భారతమాధారంగా) ఛందశ్చత్కృతులతో, అచ్చతెలుగు - సంస్కృతాంధ్ర భాషాపటిమతో అంత్యప్రాసలతో సాగు వారిహరి కథలు శ్రావ్యమై యుండి భాషాపటిమ కల్గినవారికిగాని అవగతముకావు. మచ్చునకు ఒక్క పద్యము 3 కీర్తనలను చూపెదను. విరాటపర్వంలో ఉత్తరగోగ్రహణ సందర్భముగా తిక్కనగారి పద్యమును దృష్టిలో పెట్టుకొని వేంకటదాసుగారి అచ్చతెలుగు పద్యము తిలకింపుడు.

సీ॥ కాంచనమయ వేదికాకన త్కేతనో;
జ్జ్వలవిభ్రమమువాడు కలశజుండు
సింహలాంగులభూషితనభోభాగకే,
తుప్రేంఖణమువాడు ద్రోణసుతుడు
కనకగోవృష సాంద్రకాంతిపరిస్ఫుట.
ధ్వజసముల్లాసంబువాడు కృపుడు
లలితకంబుప్రభాకలిత పతా కావి,
హారంబువాడు రాధాత్మజుండు
మణిమయోరగరు చిజాలమహితమ్మైన;
పడగవాడు కురుక్షితిపతి మహోగ్ర
శిఖరఘనతాళతరువగుసిడమువాడు;
సురనదీ సూనుడేర్పడ జూచి కొనుము. (తిక్కన)

సీ॥ జానైనజాళువాజిగిలిడాల్గలవాడు;
తుగపుట్టువ్వులమిన్నయగుగురుండు
తిప్పకూతురు మావిదిను సుటెక్కెమువాడు;
తుదలేనిగడుసరి ద్రోణు పట్టి
ముక్కంటి తత్తడిటెక్కెంబుగలవాడు;
దిట్టలమిన్నయైనట్టి కృపుడు
వలమురిపడగ చేబొలుపు మీటినవాడు;
కుర్ణుడెచ్చుల కోరుకల్లరీడు
చిలువటెక్కియంబు చేజెలంగిడువాడు;
రాజరాజుబలు విరాజమానమ్మైన
తాటి టెక్కియయువాడు వినువాక;
కొడుకు వీరినెల్ల గూర్మిగనుము (వెం.దా.స్వా)

శ్రీరుక్మిణీ పరిణయములో కుండిన నగరవర్ణన చూడుడు (కీర్తన - 1)

నవరోజురాగం చతురశ్రజాతి

ఆపురంబు శ్రీపురంధ్రికాపురంబు భూపవర్యా ॥ఆపు॥. చూపఱకలయల కాపురమై భోగోపయోగమున గోపురమైస; ద్వ్యాపారములకు దాపురమై, మణి, దీపిత భోగవతీపురమైచను ॥ఆపు॥.

సూరులుసువిచారుల నందగుపాఱులు, రణధీరులురాజ కుమారులు, బేహారులు నూత్నకుబేరులు, పెంపారు శూద్రుల క్రూరులు, శృంగారం బైనబజారులు, తీపారెడుమదశృంగారులు, బంగరుతేరులు బాబా బారులు, నెఱి, కోనేరులు, ధృతి గల చారులు, దీనోద్ధారులు గలిగిన ॥ఆపు॥.

వాడలు, తపనీయమయంబగుగోడలు, వినువీధినొరసికొను మేడలు, చానల సోయగంపు జాడలు, కేతనములు చల్లని నీడలు, మిక్కిలి మాడలు గడించు ప్రోడలు, భోగక్రీడలు లతాంతపీడలుచుట్టిన ఱేడులతోజత గూడియాడు పూబోడులు గల్గిన ॥ఆపు॥.

వేంకటదాసుని శంకలుదీరుచుపం కజనాభునిరంకు శకరుణాలంకృతమై నిష్పంకమై చెలగు ॥నాపురంబు॥

బభ్రువాహన కథలో శిరస్తాడనచేసిన అర్జునునుద్దే శించి కుమారుడగు భ్రువాహనుడు అన్న కీర్తన - 2

బేయాగ్‌రాగము. జుల్వతాళము.

విన్నారాయీదొరలు ॥నన్నన్నదుర్వాక్యములన్నియునేడు॥విన్నారా॥

యెనోన్నతరముల నుండి, వారికున్నకీర్తినా నుండి, బలుసన్నమా యెననిమండి, సవ్యసాచివచించెగదండి ॥విన్నా॥.

ననునిందించుటాలించి, నిజ, జనకుడౌటుచే సహించి మదినను కూలించితిమించినా జనకునిదూఱెను నిరాకరించి ॥విన్నా॥.

తనయుడు మ్రొక్కుటతప్పా; తండ్రి ననిలోగెల్చుటమెప్పా, ధర్మము నెఱుంగు వారలచొప్పా, దీనికను కూలించిననేడు గనుడు నాగొప్పా ॥విన్నా॥.

ధరనువేంకటదాసునేలు, నట్టివరదుడౌ వేణుగోపాలు, పాద, సరసీజంబులు, పవలురేలు, గొల్చుపరమభక్తున కిది తెరువాచాలుంజాలు ॥విన్నా॥.

ఉషాంగనోద్వాహము నుండి కీర్తన -3

బాణునిపై దండెత్తి వెళ్ళు శ్రీకృష్ణ స్వామిని దేవతలు స్తుతించిన రీతి.

జయసింధురాగము - త్రిశ్రజాతి.

ఇందిరావరా సుందరాకారా - నందకుమారా ॥ఓ ఇందిరావరా॥
వందనమి దిగోరా - మందర నగధీరా । వారాశిగంభీరా ॥
ఆపన్నివారా - గోపికాజారా - తాపసాధారా
రూపజితమారా - పాపసంహారా - కాపురుష గుణదూరా
క్షీరోదశయనా - నీరేజనయనా - తారేశనిభవదనా
మారారినవనా - ధారస్వకథన - ఘోరదానవశమనా
వేంకటదాసా - విష్కృతవిలాసా - విశ్వమోహితరాసా
న్యంకు హృద్వాసా - నవకనకవాసా - నలినబందూద్భాసా ॥ఓఇంది॥

తపోమహిమాన్వితమై సమగ్ర మైన వేంకటదాస స్వామి వారి జీవిత చరిత్ర తెలుసుకొనగోరువారు వారి కుమారులు తర్కవేదాంతవిశారద కవిభట్టారక విష్ణుదాస బిరుదాంకిత శ్రీదాశరథీసూరిగారిచే రచింపబడిన 'తపోమహిమ" యనుగ్రంథమునందామూలాగ్రముగ కలదు. మరియు సొంపైన స్వామి కవిత్వము స్వారస్యమరయ దలంచిన వారు, వారి హరి కథారుచినా స్వాదింపదలంచినవారు,
(శ్రీ వేణుగోపాల సేవాశ్రమాధిపతులు పూడివాడ గ్రామం, నగరం మండలం, గుంటూరు జిల్లా యందు సంప్రతించగలరు.)
తపోమహిమ - (స్వామి జీవిత చరిత్ర) - స్వామివారి పౌత్రుడు శ్రీ మొవ్వ సరోజనాభుడు గారి చే ఇటీవల పునర్ముద్రణ గావింపబడినది

కం॥ మంగళమురుక్మిణీ వర
మంగళమా నందనిలయమధు సూదనస
న్మంగళ ముదేవకీసుత
మంగళ మిదెనీకు భక్తమందారహరీ.

ఇట్లు
విన్నవించు పద్యాలగోపీచంద్ర స్వామి
స్వామివారి దౌహిత్రుడు

శ్రీ మతే రామానుజయనమః శ్రీరామ శ్రీ వేంకట గురుభ్యోనమః

(శ్రీ పద్యాల వేంకటేశ్వర్లు గారి) దివ్యలోకగమన నీరాజనము

శ్రీపద్యాల శంభయ్య శ్రీమతి రాఘవమ్మ గార్ల ప్రియపుత్రుడు శ్రీ పద్యాల వేంకటేశ్వర్లు గారు దివ్యలోకగమన సమయమున అమ్మహనీయునకు సమర్పించుకొన్న అక్షఋసుమాంజలులు శ్రీ వేంకటేశ్వర్లు గారు నాకు వరుసకు బావగారు గాని, పితృ, అగ్రజ, తుల్యులు. ఆ పత్సమయమున ఎంతో మందిని అక్కున జేర్చుకొని ఆదరించిన పుణ్యశీలి. మరియు సామాన్య ధర్మములగు పెండ్లిండ్లు చేయుట, చేయించుట, వాసములేని వారికి ఆవాసము కల్పించుట, అన్నదానము మొదలగు ధర్మకార్యములను నెరవేర్చుటేకాక విశేషించి రామమందిర స్థాపన, విష్ణదాసస్వామి విరచితమగు భారతగానమను మహోన్నత ఇతిహాసమును కృతినందుట మొదలగు లోకోన్నత మహాకార్యములు అత్యంత ఆదరముగా నెరపిన భాగ్యశాలి. పితృమేధకార్యములు అత్యంత శ్రద్ధాసక్తులతో నిర్వహించిన కర్మనిష్టాగరిష్టుడు. ఇంకను తండ్రిగారు అన్నదాన నిరుతుడు పుణ్యమూర్తియగు అచ్చయ్య గారు నిర్మించిన శివాలయమునకు, మామాగారు మహర్షి వేంకటదాసుస్వామి ప్రతిష్ఠించిన శ్రీవేణుగోపాలుని దేవాలయమునకు సర్వవిధముల వృద్ధిగావించు కొరకు జీవితావధి కృషి సల్పిన కైంకర్యనిరతుడు. తరువాత పంచసంస్కారపరులై నిరంతరము రామపాదధ్యానము, రామకోటి వ్రాయుట. చరమ దశయందు శరతల్పగతుడైన భీష్మపితామహుడు శ్రీకృష్ణుని ధ్యానించినటుల నిద్రాహారములు లేక ఇంద్రియములన్నీ అవశమైమితిలేని శరీరబాధననుభవించుచు చూచువారలు ఆశ్చర్య చకితులగునట్లు రామషడక్షరీ జపము విధివిరామములేకుండ చేసిన తపోధనుడు. సామాన్య విశేష ధర్మముల రెంటిని ఔపాసన పట్టి పరిపూర్ణడైన సిద్ధయోగి మరియు తాను ఇతరులకు చేసిన ఉపకృతిని గాని ఇతరులు తనకు గావించిన ఆపకృతిని గానీ తిరిగి తన జీవితమున నోటితో పలికియెరుంగని ఆత్మగుణ సంపత్తి గల ధీశాలి. శ్రీ వేంకటేశ్వర్లు గారు. వారి ధర్మపత్ని బ్రహ్మవేత్త గర్భసంజాత, మహాభాగ పరమ భాగవతాగ్రణి, భగవద్భాగవతాచార్య కైంకర్య ధురీణ విదుషీమణి శ్రీమతి రామబాణమ్మ గారు. మీ దివ్యదంపతులు సామాన్య విశేష ధర్మముల రెంటింని అనుష్టించి ఇహపరముల యందు ఇసుమంత కొరంత నెరుంగని పరిపూర్ణమనోరథులు, కృతకృత్యులు, చరితార్థులు. మిమ్మువంటి పుణ్య దంపతులులోకముననే అరుదుగదా! ఇటువంటి పరిపూర్ణలగు దంపతులను కీర్తించి ఈ షణ్మాత్రముఋణవిముక్తనై, కృతకృత్యనై నేనుధన్యనైతిని.

పుట్టిన దాదిగా పుణ్యకార్యములతో - పూతమై యొప్పె నీపుణ్యతనువు
రామరామయని నోరారగాజపియించి - పూతమై యొప్పె నీపుణ్యరసన
శ్రీరామ శ్రీరామ శ్రీరామ యనివ్రాసి - కడుపావనంబయ్యె కరయుగంబు.
పూతమై విమలమై పుణ్యస్వరూపమై - ధన్యమై నీ జన్మ ధాత్రి జెల్లె
అవని నినుబోలు జనులెందు అరుదుసుమ్ము ధరను గాలించి ననుగాని దొరక బోరు
భావమునమిమ్ము మరతురే బాంధవాళి - కొనుమిదేమీకు మేమిచ్చు ఘననివాళి

సమర్పణ

ది. 29-01-2013. ఆచార్య పాదరేణువు
పూడివాడ. తన్నీరు కమలాదేవి